TEXT PROBLEM WITHIN THE BOOK ONLY

UNIVERSAL
LIBRARY
OU_204071
UNIVERSAL
LIBRARY

OUP—901—26-3-70—5,000

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. Accession No.

Author

Title

This book should be returned on or before the date last marked below.

# ఆంధ్ర విదుషీమణులు

(మొదటి భాగము)

'ఆంధ్రభూమి' సంపాదకుఁడు

ఆండ్ర శేషగిరిరావు, బి. ఏ.

వ్రాసినది

సర్వస్వామ్యములు గ్రంథకర్తవి

మొదటి కూర్పు
1950 అక్టోబరు

శ్రీ ఆంధ్ర శేషగిరిరావు, బి. ఏ.
రచియించిన గ్రంథములు

| | | రు. అ. పై. |
|---|---|---|
| 1. ఆంధ్ర రమణీమణులు 1-వ భాగము | | 0-12-0 |
| 2. ఆంధ్ర రమణీమణులు 2-వ భాగము | | 0-12-0 |
| 3. కేయూరబాహు చరిత్ర | ... | 0-12-0 |
| 4. ఆంధ్ర రాజభక్తులు | ... | 0-12-0 |
| 5. ఆకుకూరలు | ... | 1- 0-0 |
| 6. కాయకూరలు | ... | 1- 0-0 |
| 7. దుంపకూరలు | ... | 1- 0-0 |
| 8. వాణిజ్యపూజ్యులు 1-వ భాగము | | 1- 0-0 |
| 9. ఆంధ్ర విదుషీమణులు 1-వ భాగము | | 1- 0-0 |

విక్రయము :
ఆంధ్రభూమి బుక్కుడిపో
మదరాసు: 7.

ప్రచురణ :
జయని కేతనమ్
మదరాసు : 7.

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| | తొలిపలుకు | ... | ౪ |
| ౧. | శాలివాహనుని రాణి | ... | ౫ |
| ౨. | నాచి | ... | ౧౧ |
| ౩. | గంగాదేవి | ... | ౧౯ |
| ౪. | తుక్కాదేవి | ... | ౪౦ |
| ౫. | తిరుమలాంబ | ... | ౫౪ |
| ౬. | రామభద్రాంబ | ... | ౬౪ |
| ౭. | మధురవాణి | ... | ౮౧ |
| ౮. | లకుమాదేవి | ... | ౧౦౮ |

# తొలిపలుకు

Heritage of India Series లో ఒకటిగ ప్రచురితమైన 'Poems by Indian women' అను గ్రంథమున భారతదేశములోని పలు భాషల ప్రాచీన, అధునాతన కవయిత్రుల రచనములనుండి మచ్చుతునకలను ఏర్చి తీసికొని ఆంగ్లములోనికి అనువదించి యున్నారు. వైదిక వాఙ్మయమునకు ఒకరు, పాళీకి తొమ్మండుగురు, సంస్కృతమునకు నలుగురు, తమిళమునకు ఇరువురు, కర్ణాటకమునకు ముగ్గురు, మహారాష్ట్రమునకు ఐదుగురు, వంగభాషకు పదుగురు, హిందీకి ఆర్గురు, గుజరాతీకి ఇద్దరు, ఉర్దూకు ఇద్దరు, మలయాళమునకు ఒకరు, పార్సీకి ఐదుగురు, కాశ్మీరమునకు ఒకరు, ఆంగ్లమునకు ఐదుగురు ఇట్లు పదునాలుగు భారత భాషలకు మొత్తము యేబదిఆరుగురు కవయిత్రుల రచనములు అందు సంగ్రథితములై యున్నవి. ఐనను, తెనుఁగు కవయిత్రుల తెనుఁగు రచనముల అనువాదమును ఒక్కదానినికూడ ఈయరైరి. ఆ సందర్భమున పొడమిన జిజ్ఞాసలో ఆంధ్రవిదుషీమణులను గురించి జరిగిన విచారణఫలితముగా ఈ ఆంధ్ర విదుషీమణుల గ్రంథరచనము సాగినది. ఈ రచనము సాగి ఇప్పటికి ఇరువదియైదేండ్లకు పైగా నైనది.

ఈ గ్రంథము రెండుభాగములు. అందు ఇది మొదటిభాగము. ఈ భాగమున, సంస్కృతమున తమవాగ్విలాసము చూపిన ఆంధ్రవిదుషీమణుల విఖ్యాతజీవితములు వివరింపఁబడినవి. రెండవభాగమున ఆంధ్రమున తమవాగ్విలాసము చూపిన విదుషీమణుల విఖ్యాతజీవితములు పొందుపరుపఁబడినవి. ఈ జీవితగాథలలో కొన్ని 1930 ప్రాంతమున వివిధ పత్రికలలో ప్రచురితములైనవి. ఈ మొదటిభాగములోని 'శాతవాహనునిరాణి' రూపవాణి ప్రత్యేకసంచికయందును; 'నాచి' భారతియందును; 'రామభద్రాంబ', 'మధురవాణి', 'లకుమాదేవి' అనునవి గృహలక్ష్మియందును ప్రచురితములు.

కాలక్రమపరిశీలనవలన తెలియవచ్చిన అనేకనూతనాంశములను చేర్చుటతో గ్రంథము కొంత పెరిగినది. ఈ గ్రంథమును క్రొత్తగ వెలయించుటలో మిత్రులు శ్రీవేదము వేంకటకృష్ణశర్మగారు నాకు మిక్కిలి తోడ్పడిరి. వారికి నా కృతజ్ఞతాభివందనములు.

వేపేరి, మదరాసు. —ఇట్లు, గ్రంథకర్త.

౧

# శాతవాహనుని రాణి

శాలివాహన పర్యాయనామాభిధానుఁడైన శాతవాహనుఁడు ప్రథమాంధ్రమహాచక్రవర్తి.

శాతవాహనుని అనంతరము ఆతని వంశీయులు పలు శతాబ్దులు ఆంధ్రదేశము కేంద్రముగా, కృష్ణానదీ తీరస్థమైన అమరావతి ప్రధానరాజధానిగా, గోదావరి నదీతీరస్థమైన ప్రతిష్ఠానపురము రెండవ రాజధానిగా మధ్యభారత దేశమును పరిపాలించిరి.

శాతవాహనులు నెలకొల్పిన ప్రాజ్యసామ్రాజ్యమునకు హృదయస్థానముగా వెలసిన ఆంధ్రదేశమునకు కొండొకకాలము శాలివాహనరాష్ట్రము అను నామము వాడుకలో ఉండినది.

ఈ వంశీయుల పేరిట పుట్టిన శాలివాహనశకము ఈనాఁడుకూడ భారతదేశమున బహుళప్రచారమున ఉన్నది.

ఆంధ్రకీర్తికి ఇన్ని విధముల పట్టుపాగునయై నెగడుచున్న రాజవంశమునకు మూలపురుషుఁడగు శాతవాహనుని ప్రతిభాప్రాగల్భ్యములకు, ప్రజ్ఞాపాండిత్యములకు అతని రాణి కారణము.

విదుషీమణియైన భార్య తన ఉపదేశామృతముచే భర్తను అభ్యుద్ధరించిన నిదర్శనములు పురాణములలోను, చరిత్రలలోను పరిశ్రుతములుగా ఉన్నవి.

చూడాల అను స్త్రీ తనమగనికి- శిఖిధ్వజునికి- రాజ్యపాలనమున తోడుపడుటయేకాక బ్రహ్మతత్త్వోపదేశముకూడ

చేసి ఉద్ధరించిన విషయము జ్ఞానవాసిష్ఠమున విపులీకృతమై ఉన్నది

ప్రస్తుతకథకు నాయకురాలైన శాతవాహనునిరాణి చూడాలవలె భర్తకు ప్రత్యేకముగా ఉపదేశికురాలు కాలేదు. భర్త అజ్ఞానము అతని చిత్తమునకు హాస్యోల్లసముగా ఉల్లకొట్టు పలుకులతో ఎత్తి చూపినది.

శాతవాహనుఁడు ఉచితజ్ఞుఁడగుటచే భార్యచే ప్రబోధితుఁడై తన అజ్ఞానమును దవ్వుగఁ జోపి విజ్ఞానసుహితుఁడు అగుటకు విపులప్రయత్నము కావించినాఁడు.

ఈ సందర్భమైన గాథ విచిత్రమైనదై వినఁదగియున్నది:

దక్షిణాపథచక్రవర్తియైన శాతవాహనునకు పలువురు రాణులు ఉండిరి. వారిలో విష్ణుశక్తికుమారి విదుషీమణి. శబ్దశాస్త్రమున ఆమె చతురురాలు. వ్యాకరణశాస్త్రమున ఆమె పారము ముట్టిన పండితురాలు.

ఆమెతోడను, ఇతర రాణులతోడను శాతవాహనచక్రవర్తి ఒకనాఁడు వనవిహారమునకు వెడలెను. కొంతతడవు వనములో విహరించిన మీఁదట రాజునకును, రాణులకును జలక్రీడపై మనసుపుట్టినది.

తోడనే వారుఅందరును జలక్రీడార్థము ఒక పద్మసరోవరమున ప్రవేశించిరి. ఆ పద్మసరస్సున రాజును, రాణులును కేళీవిలాసలాలసులై ఒండొరులను నీళ్ళతో చల్లుపోగా ఆడుటకు ప్రారంభించిరి.

విష్ణుశక్తికుమారి శిరీషకుసుమసుకుమారాంగి. అగుట క్రీడావసరమున పెచ్చురేఁగిన నీళ్ళచల్లుకొట్టుకు ఆమె ఎంతయో సేపు తట్టుకొనలేకపోయెను. జలక్రీడ ప్రారంభించిన కొద్దిసేప

టికే ఆమె బాగుగ అలసిపోయెను.

అందుచేత అప్పుడు ఆమె తనపై దూకుడుగ నీళ్ళు కొట్టి ఉంకించుచున్న రాజును వారించుచు సంస్కృతభాషలో 'రాజన్! మాం మోదకైః స్తాడయ' అని మర్మగర్భముగ, ప్రార్థనాపూర్వకముగ పలికినది. 'రాజా! నన్ను నీళ్ళతో కొట్టకుము' అని ఆ సంస్కృతవాక్యమునకు భావార్థము.

సంస్కృతభాషయందు మిడిమిడి జ్ఞానమే కాని విశేష జ్ఞానములేని శాతవాహనచక్రవర్తికి రాణిపలికిన సంస్కృత వాక్యము సరిగా అర్థముకాలేదు. 'మాం మోదకైః స్తాడయ' అని రాణి పలికిన సంస్కృతవాక్యములోని మోదకపదము ఒక్కటియే అతనికి తెన్నుగ అవగతమైనది. మోదకము అనగా ప్రసిద్ధార్థము కుడుము అనికదా! అందుచేత రాజు రాణి కుడుము కోరినదనుకొని వెంటనే సేవకులను పంపి విస్తారముగ కుడుములు తెప్పించినాడు.

రాజు అర్థజ్ఞానశూన్యతకు రాణి పెలపెలా నవ్వి ఇట్లు పలికినది:

'రాజా! ఉదకమధ్యమున మోదకములకు ప్రసక్తియేమి? మా ఉదకైః తాడయ అనగా నీళ్ళతో కొట్టకుము అనికదా అర్థము. మా శబ్దమును, ఉదకశబ్దమును సంధిక్రియవలన మోదకమైనదికదా! మాశబ్దోదకశబ్దముల సంధినికూడ తెలిసికొనలేక పోయితివేమి? నీకు శబ్దశాస్త్రమున పరిచితి కాని, వ్యాకరణశాస్త్రమున ప్రవేశముకాని బొత్తిగా లేనట్లున్నదే.'

రాణి పలికిన ఈ పలుకులు విని ఇతరరాణులు కలకల నవ్వినారు; పరిజనులు అంకురితమందస్మితులు అయినారు.

రాణుల కలకలనవ్వు, పరిజనుల అంకురితమందస్మితము

రాజునకు తెవులులేని వేదనను కలిగించినవి. అందుతో రాజు తన అజ్ఞానమునకు లజ్జితుఁడు, ఖిన్నుఁడు ఐనాఁడు.

తోడనే అతఁడు జలక్రీడకు స్వస్తిచెప్పి, నగరికి వచ్చి విద్యాసముపార్జనముమీఁద చిత్తము లగ్నముచేసినాఁడు. శర్వవర్మ అను మహాపండితుని గురువర్యునిగా స్వీకరించి శాతవాహనచక్రవర్తి వ్యాకరణశాస్త్రమును పారముముట్ట పఠించినాఁడు.

ప్రౌఢవయస్కుఁడు, సుఖవాసి, వివాహితుఁడు అయ్యు శాతవాహనచక్రవర్తి అభ్యాసక్లేశమునకు ఓర్చి విద్యావిశారదుఁడై విదుషీమణియైన విష్ణుశక్తిపుత్రికి తగిన విభుఁడు ఐనాఁడు.

తన్ను విద్యావిశారదునిచేసిన శర్వవర్మకు శాతవాహనుఁడు తన సామ్రాజ్యములోనిది, నర్మదానదీ తీరస్థమైనది ఐన భరుకచ్ఛప రాజ్యమును గురుదక్షిణగా ఇచ్చినాఁడు.

విద్యాప్రియుఁడు, విద్యావిశారదుఁడు అగుటయే కాక అనంతరకాలమున శాతవాహనచక్రవర్తి విద్యాపోషకుఁడు కూడ ఐనాఁడు.

నాగానంద ప్రియదర్శికా రత్నావళీ ముద్రారాక్షసాది సంస్కృతనాటకకథలకును, కాదంబర్యాది సంస్కృతవచనకావ్యకథలకును మూలకందమైన బృహత్కథను రచించిన గుణాఢ్యపండితుఁడు శాతవాహనుని ఆస్థానము అలంకరించి అతని పోషణము అందినాఁడు.

మా శబ్ద, ఉదకశబ్దముల సంధిప్రక్రియ సముచితము తెలియని తనకు ప్రాణములతోడ జన్మాంతరమిచ్చి తన్ను విద్యాప్రియునిగా, విద్యావిశారదునిగా, విద్యాపోషకునిగా మార్పించిన విద్యావతిని విష్ణుశక్తికూఁతురిని శాతవాహనుఁడు పట్టపు

రాణిగా స్వీకరించి ఆమెతో ప్రత్యేకము పట్టాభిషిక్తుఁడు ఐనాఁడు.

ఈ యుదంతమువలన ఆనాఁటి స్త్రీలు సంస్కృతవ్యాకరణసూత్రములను చక్కఁగ నేర్చి సామాన్యస సంస్కృతపండితులకు కూడ కొంచెము గజిబిజి పుట్టించు మా + ఉదక శబ్దముల సంధిక్రియతో మోదకమును కూర్పఁగల పండితురాండ్రై యుండిరని తేఁటతెల్లము అగుచున్నది.

విదుషియైన విష్ణుశక్తికూఁతురి అధిక్షేపము చక్రవర్తిని విద్యావంతుని చేసినది; మనకు బృహత్కథను ప్రసాదించినది. ఈ ఆంధ్రవిదుషీమణి అధిక్షేపము మనకు ఇట్లా ఉపకరించినది.

భార్యల అధిక్షేపములచే ప్రాభవమును అందిన భర్తల ఉదంతములు అత్యంతమోదావహములై యుండును.

అట్టి అత్యంతమోదావహమైన ఈ ఆంధ్రవిదుషీమణి గాథతో జతపడు గాథలు ఒకటిరెండు ఆంగ్లసారస్వతమునకలవు.

ఆంగ్లనవలాకారులలో ఒకఁడైన నాథానియల్ హాథారన్ తనభార్య ఆడిన ఎత్తిపొడుపు మాటలచేత చోదితుఁడై 'స్కార్లెట్ లెటర్' అను నవలను రచియించినాఁడు.

ఆంగ్లనవలాకారులలో మఱియొకఁడైన ఫెనిమోర్ కూపర్ కూడను ఇట్టి పరిస్థితులయందే గ్రంథకర్త ఐనాఁడు.

ఒకనాఁడు అతఁడు ఒకనవల చదివివైచి మేజామీఁద పెట్టుచు 'నేను వ్రాయుచో ఈ నవలకంటె మంచినవలే వ్రాయఁగలను' అనినాఁడు. ఈమాట అతనిభార్య విన్నది.

నవలను ఒకదానిని రచియింపఁగల శక్తి సామర్థ్యముల పోలఁకువ ఏమియు అంతదనుక తనభర్తచెంత ఆమె పసిపట్ట

లేకపోయినది. కాఁగా తనభర్త పలికిన పలుకును ఆమె ఉత్తర కుమారప్రజ్ఞగా చేకొన్నది.

చేకొని భర్తదిక్కు మొగమై అనాదరమందస్మితము చేయుచు ఆమె 'వ్రాయుఁడు. చూచెదము' అని సవాలు చేసినది. కులపాలిక సవాలును అందుకొని కూపర్ 'ప్రికాషన్' అను నవలను రచించుటకు పూనుకొనినాఁడు. కొద్దిరోజులలోనే దానిని పూర్తిచేసి స్వయముగ ప్రచురించినాఁడు.

కాని అది ప్రజామోదమును అందలేదు. అంతమాత్రమున నిరుత్సాహపడక కూపర్ మఱియొక నవలను 'దిస్పై' అను నామముతో రచించినాఁడు. ఈ రెండవ నవల ప్రచురితమైన తోడనే జయపథము అంటినది.

భార్యల అధిక్షేపవాక్యములచేతనే శాతవాహనుఁడు, నాథానియల్ హాథారన్, ఫెనిమోర్ కూపర్ ప్రాభవము అందినారు. వీరి అందఱిలోను శాతవాహనుఁడు అత్యంతప్రాచీనుఁడు, అత్యంతప్రముఖుఁడు.

అత్యంతప్రాచీనకాలమునకు చెందిన ఈ ఆంధ్రవిదుషీమణిజీవితము ఆంధ్రులు గర్వింపఁదగిన ఒక మహత్తరవిషయమును చాటుచున్నది.

ఆంధ్రదేశమున అత్యంతప్రాచీనకాలమున స్త్రీలు విద్యావతులై ఉండిరనుటకు ఈ విదుషీమణిజీవితముకంటె మఱియొక నిదర్శనము అవసరములేదు.

భార్య విద్యామదమ్మునఁ బలికినట్టి
హాస్యవచనమ్ములకుఁ గడువ్యసనమంది
హృదయపరివర్తనము నొంది కృషియొనర్చె
అతఁడు శ్రీశాతవాహన క్ష్మాధిపుండు.

— వేదము చంద్రశేఖరయ్య.

## ౨

# నాచి

నాచి ఆంధ్రబ్రాహ్మణ స్త్రీ; మహా విద్వాంసురాలు. ఆంధ్రులకు సుపరిచితుఁడును, సుప్రసిద్ధపండితుఁడును ఐన ఏలేశ్వరోపాధ్యాయుఁడు ఆమెజనకుఁడు.

ఈ పండితుని నివాసస్థానము ఏలేశ్వరము. ఇది గుంటూరు మండలమునందలి పల్నాడుతాలూకాకు సరిహద్దున నాగార్జున కొండకు సమీపమున కృష్ణవేణీమహానదికి అవ్వలియొడ్డున ఉన్న పుణ్యక్షేత్రము.

ప్రాంతికజనులు ఏలేశ్వరమును దక్షిణకాశి అందురు. విధ్వస్తావశిష్టములగు దేవాలయములు ఆ గ్రామమున నేఁటికిని చాల కలవు. ఏటేట శివరాత్రికి అక్కడ జరుగు తీర్థమునకు వేల కొలఁది జనులు వచ్చుచుందురు.

క్రీస్తుశకము ఏడవ శతాబ్దియందు ఈగ్రామమున ఏలేశ్వరోపాధ్యాయుఁడు జీవించియుండెను.

అతఁడు సంస్కృతసాహిత్యమండనుఁడు. వేదవేదాంగములయందు అనంతకౌశలము గడించిన కోవిదుఁడు; ఆయుర్వేదమునందు విశేషానుభవము సంపాదించిన అభిజ్ఞుఁడు; జ్యోతిషశాస్త్రమున పారముముట్టిన పండితుఁడు. వేయేల? అతఁడు సమస్తశాస్త్రములను సర్వాంకషముగ నేర్చిన ప్రజ్ఞానిధి.

కావున అతనికి ఏలేశ్వరోపాధ్యాయుఁడు అను బిరుదనామము కలిగినది. బిరుదనామమే కాని అతని అసలునామము

ఏదియో తెలియరాదు.

'నీ వేమి ఏలేశ్వరోపాధ్యాయుఁడవా?' అని నేఁటికిని తెనుఁగునాట నిలిచియున్న నానుడిసిపట్టి ఈ పండితుని ప్రఖ్యాతిని ఈనాఁడు మనము కొంతకుకొంత పోల్చుకొనవచ్చును.

ఆంధ్రభూమియందు బ్రాహ్మణులలో వివాహములందు పాటింపఁబడుచున్న నాడుభేదములు ఏలేశ్వరోపాధ్యాయుఁడు కల్పించినవే. అతఁడు తన కొమరితెలలో ఒకయామె పరిణయ సందర్భమున వరుని కులవిషయమున ప్రమాదపడియెను.

ఐనది వర్ణాంతరవివాహమని ఉపాధ్యాయుఁడును, అతని పుత్రికయు కొంతకాలమునకు తెలిసికొనినారు. అప్పటికి ఆమె సంతానవతికూడ ఐనది. కులాచారప్రియుఁడైన తండ్రికి తన వివాహమూలమున కలిగిన అవమానమునకు దురపిల్లి ఆమె ఒకనాఁటి అర్ధరాత్రమున తనయింటికి నిప్పంటించి పిల్లలతో, పెనిమిటితో కాలిపోయినది.

అందుపై అతఁడు బ్రాహ్మణసంఘములో నాడుభేదములు ఏర్పఱిచి యేనాడువారు ఆనాడునందలి స్త్రీని మాత్రమే పెండ్లిచేసికొనవలయునని విధించెను.

ఏలేశ్వరోపాధ్యాయుఁడు ఈ సందర్భముననే ఏలేశ్వరవిజయము అను సంస్కృతగ్రంథమును రచియించెను. ఆ గ్రంథము కులములను, శాఖలను- వేగినాఁడు, వెలనాడు మొదలగు నాడువిభాగములను- వివరించుచున్నది.

నాఁటినుండి నేఁటివఱకును ఆంధ్రబ్రాహ్మణసంఘము నందు వివాహముల విషయమున ఉపాధ్యాయుని అనుశాసనము అనుస్యూతాచారమై వెలయుచున్నది.

ఏలేశ్వరోపాధ్యాయుఁడు ఏలేశ్వరవిజయము అను గ్రంథ

ము నే కాక స్మృతిదర్పణము అను మఱియొక గ్రంథమునుకూడ రచియించినాఁడు. అది గౌతమస్మృతికి వ్యాఖ్యానగ్రంథము.

ఏలేశ్వరోపాధ్యాయుఁడు తాను ఆర్జించిన విద్యనంతను లోభమూని తనయందే జీర్ణము చేసికొనక శిష్యులను చేరఁదీసి విద్యాశిక్షణము ఇచ్చెడివాఁడు. ఆయనయొద్ద ఎల్లప్పుడు వందల కొలఁది విద్యార్థులు సంస్కృతమును అభ్యసించుచుండువారు.

ఓరంతిప్రొద్దును ఆతనియింట సంస్కృతఘోషయే. నిరంతరము అట్టి సంస్కృతఘోష నడుమ మెలఁగుచుండుటచే ఆతనిగృహమున స్త్రీలు సయితము సంస్కృతమున స్వచ్ఛముగ, ధారాళముగ సంభాషింపఁగలిగి ఉండిరి.

ఏలేశ్వరోపాధ్యాయునకు పురుషసంతతి లేదు. మువ్వురు తనయలు మాత్రము కలిగిరి. అందు మన కథానాయికురాలైన నాచి రెండవయామె. దురదృష్టవశమున నాచి యౌవనాశామృదుపుష్పము పూర్తిగ వికసింపకుండఁగనే పతిని కోల్పోయి దుర్భరమగు వైధవ్యమున ఇల్లుపట్టెను.

ఏలేశ్వరోపాధ్యాయుని ప్రేమార్ద్రహృదయము అప్పుడు కొలిమివలె కణకణలాడి కుమిలిపోయెను. తన కొమార్తె వైధవ్యవేదన ఆతఁడు చూడలేకపోయెను. ఇఁక ఆజన్మమునకు ఎట్టులును తీరని అట్టి దీర్ఘవిచారమునుండి ఆమె మనస్సు ఒకింత మఱల్చుటకై ఆతఁడు నాచిని సంస్కృతవిద్యాభ్యాసమునకు పురికొల్పెను.

నాచి దీక్షతో సంస్కృతము అభ్యసింపదొరకొనెను. నిద్రాసుఖములను మఱచి ఆమె కష్టపడి పాఠములు వల్లించుచుండెను. కాని ఆమె మందమతియగుటచే తగిన ప్రయోజనము లేకపోయినది. కాఁగా విద్యాప్రియయగు నాచి మేర లేని

విచారమున మునిఁగినది. తాను ఎట్లులైన గొప్ప విద్వాంసు రాలు కావలెనని ఆమె వేగిరపడినది

నాచివలె మందమతులగువారు వీరేశ్వరోపాధ్యాయుని విద్యార్థులలో మఱికొందఱు ఉండిరి అట్టి విద్యార్థుల జ్ఞాపక శక్తి వృద్ధిపొంది వారి బుద్ధిబలము తీవరించుటకు ఔషధము కనుఁగొన వీరేశ్వరోపాధ్యాయుఁడు ఆయుర్వేదమందలి తన అభి నివేశమును అంతయు వినియోగించెను. వినియోగించి 'జ్యోతి ష్మతి' యను తీగెరసమును త్రాగినచో మేధాశక్తి పెంపొందు నని గ్రహించెను.

ఆయౌషధసేవవలన ఆయన శిష్యులలో మందబుద్ధులగు వారు అధికమేధాసంపన్నులైరి.

సత్వరమున మహావిద్యావంతురాలు కావలెనను తహ తహతో నాచి ఒకనాఁడు ఆ జ్యోతిష్మతిరసమును మోతాదు తప్పించి మిక్కుటముగా త్రాగెను

ఆ రసము పరిమాణమునకు మించినచో వికటించి విష తుల్యమగు ఫలమును ఒసఁగును. అగుట ఆరసముగ్రోలిన కొద్ది సేపటికి నాచికి అవిడితాపము, విదాహము బయలుదేరెను.

ఆమె ఈ ఆపసోపాలకు తాళఁజాలక పెరటిలోని బావి యందు దుమికెను. అందు ఆమె ఎనిమిదిగడియల కాలము ఉండెను. ఆ నూయి అంత లోఁతువినది కాదు కావున ఆమెకు ప్రాణాపాయము కలుగలేదు.

వీరేశ్వరోపాధ్యాయునకుకాని, మఱి ఎవ్వరికికాని ఈ వృత్తాంతము ఏమియు తెలియును నాచి అకస్మాత్తుగ కనిపింప కుండ పోవుటచే ఉపాధ్యాయుఁడు ఊరెల్ల అంపెను కాని లాభము లేకపోయినది. తుదకు అతఁడు విసిగి వేసారి పెరటి

నూతిచెంత చదికిలఁబడి వెల్లుబ్బుచున్న విచారమును అఁకట్టఁ జాలక 'నాచీ', నాచీ' అని బిగ్గఱగా పలవింప మొదలిడెను.

అప్పటికే నాచి చాలసేపటినుండి నీటిలో ఉన్నది కావున తాపము చల్లారుచుండుటచే కొంచెము కొంచెముగా తెలివిని పొందుచు తెప్పిరిలుచుండెను. కాఁగా అప్పుడు ఆమెకు తండ్రి పిలుపు వినిపించినది. అందుపై ఆమె నూతికేకవైచి జరిగిన సంగతి అంతయు తండ్రికి చెప్పెను. ఏలేశ్వరోపాధ్యాయుఁడు అంత పుత్రికను బావినుండి బయటకు తీసెను.

నాఁటినుండి నాచి మహామేధాశక్తిసంపన్నయై అచిర కాలముననే సమస్తశాస్త్రములందును అపారపాండిత్యమును సంపాదించి తండ్రితో సమానురాలు అయ్యెను.

ఈ గాథను మనము సత్యచరిత్రముగ చేకొనినను, వుక్కిటిపురాణముగ త్రోసిపుచ్చినను నాచి మహావిద్వాంసురాలనిమాత్రము ఒప్పుకొని తీరవలెను. సంస్కృతమున అనన్యసాధారణమైన వైదుష్యమును సంపాదించినమీఁదట ఆమె సంస్కృతకవిత్వరచనకు దొరకొనెను.

ఆమె కవితావ్యాసంగమునకు అమృతఫలముగా 'నాచీ' అను దృశ్యకావ్యము ఉదయించినది. భాషాచాతుర్యమందేమి, భావమాధుర్యమునందేమి ఆ నాటకమునకు అదియే సాటి.

మన దురదృష్టవశమున ఇపుడు ఆనాటకము ఉపలబ్ధము కాకున్నది.

ఆ నాటకమున ప్రస్తావితవిషయము నాచి స్వీయజీవిత చరిత్రమే. దానియందు ఆమె దుఃఖభాజనమును, దయనీయమును అగు తన వైధవ్యజీవనమును హృత్పిండములను చిదుపు కరుణారసముతో వర్ణించి ఉన్నది.

ఆంధ్రునిది జాలిగుండె. కావుననే కరుణారసవర్ణనమున సాటిలేని నేర్పు సహజముగా అలవడ్డది ఆంధ్రహృదయమునకు.

కరుణారసపూరితమైన సీతాచరితము వివరించుటయందే ఆంధ్రకవయిత్రీమతల్లి మొల్ల తన కవితాచమత్కారము నంతను అవధానము ఒనర్చి కఠినహృదయములను కూడ కనికారముతో ముంచెత్తుచున్నది.

దుఃఖమయమైన ఆత్మోదంతమును కావ్యవస్తువుగా స్వీకరించి ఆంధ్రవిదుషీమణి నాచి కరుణారసప్లుతి కలిగించుచున్నది.

ఆంధ్రుడగు భవభూతి సంస్కృతమున 'ఉత్తర రామచరిత్ర'ను రచియించి కరుణారసమునకు అవధి కల్పించినాడు. ఉత్తరరామచరిత్రలోని సీతావియోగజన్యమయిన రాముని విలాపమును వర్ణించెడి శ్లోకములు వజ్రకఠినహృదయములను కూడ ద్రవీభూతము ఒనర్చు సామర్థ్యము కలవి.

ఆహా పుట్టునట్లు కరుణారసమును పోషించి వర్ణించుటలో ఆంధ్రునకు ఆంధ్రుడే సాటి. ఆంధ్రునకు ఇట్టి గొప్ప పేరు వచ్చుటకు కారణభూతమైనవారిలో నాచి ఒకతె.

పరిణతవయస్సున నాచి కాశీ, ప్రయాగ మున్నగు సుప్రసిద్ధపుణ్యతీర్థముల సేవించి కాలమును సద్వినియోగము చేసినది. ఇట్టి తీర్థసేవయందు ఆమెకు కేవలము యాత్రాభిలాషయే కాక విద్యావిజయాభిలాషకూడ మిళితమై ఉండెను.

సంస్కృతవిద్యకు కాణాచియైన కాశియందును, ఇతర పుణ్యస్థలములయందును దిగ్దంతులవంటి పండితులతో ఆమె శాస్త్రవాదము నెఱపి దిగ్విజయము అందినది.

ఇంతతో తృప్తిపొందక ఆ పండితురాలు ఢిల్లీ, ఆగ్రా

మొదలగు స్థలములకు వెళ్ళి రాజసభలయందు విద్వాంసులతో వాదము చేసి గెలిచి విశేషములైన బహుమతులు అందినది.

ఆమె ఆ కానుకలు అన్నియు తీసికొనివచ్చి తండ్రికిచూపి తన యాత్రావృత్తాంతము అంతయు వినిపించినది. ఆమె కొనిన విద్యావిజయములకు, తెచ్చిన పారితోషికములకు, పొందిన రాజసన్మానములకు మెచ్చి ఏలేశ్వరోపాధ్యాయుఁడు తనకు పుత్రులు లేని లోపము ఆవంతయు లేదని అలరెను. అట్టి మహావిద్వాంసురాలిని పుత్రికగా పడసిన ఆతని సంతోషమునకు కొలఁది లేకుండెను.

కాని, ఆతని సంతోషచంద్రిక నాచి వైధవ్యవేదన అను మేఘమును ఒత్తిగించి బహిర్గతము కాఁజాలక మఱుఁగు పడి ఉండెను.

సకలశాస్త్రములందును సంపూర్ణపాండిత్యము సంపాదించి కాశి, మధుర, హరిద్వారము మొదలగు స్థలములయందు శాస్త్రవాదములు సలిపి, దిగ్విజయములు పొంది, మహారాజులచే మన్ననలు చేకొని ఆంధ్రకీర్తిని దేశదేశములందు చాటివచ్చిన మహాపండితులు ఎందఱో ఆంధ్రులది యగు ఈ విజ్ఞానభూమియందు ఇటీవల ఉదయించియున్నారు.

అట్టి ఆంధ్రపండితరత్నములకు పురోగామినియై వారి ప్రతిభకు పునాదిరాయిగా ఆంధ్రవిదుషీమణి నాచి అలరారుచున్నది.

వేదయుగమున జనకమహారాజు ఆస్థానమున బ్రహ్మజ్ఞానియు, ఋషిశ్రేష్ఠుఁడును అగు యాజ్ఞవల్క్యునితో అశ్వలుఁడు, ఆర్తభాగుఁడు, కహోళుఁడు, ఉషస్త్యుఁడు మున్నగు కొమ్ములుతిరిగిన పండితులు చేయలేక విరమించిన వాదము

తాను అందుకొని అత్యద్భుతముగ వేదాంతచర్చ సలిపి జయమును గొనిన భారతమహిళ గార్గివలె ఆంధ్రపురంధ్రి నాచి తీర్థయాత్రలందు భూలోకబృహస్పతులగు మహాపండితులతో శాస్త్రవాదము ఒనర్చి విజయములు అందినది.

అట్టి విద్వాంసురాలు నాచి మహత్తరజీవితమును విని ఆనందింపని, ఆనందించి గర్వింపని ఆంధ్రుఁడు ఉండునా!

పండితురాలు, గ్రంథకర్త్రి ఐ నాచి పండితుఁడు, గ్రంథకర్త అగు తండ్రికి తగిన తనయ అని అనిపించుకొనినది.

కవనము అల్లిన ఆంధ్రరమణులలో చరిత్రకు తెలిసినంత వఱకు తెనుఁగున మొల్లయు, సంస్కృతమున నాచియు మొదటివారు. అట్లగుట ఈ విదుషీద్వయము ఆంధ్ర స్త్రీ లోకముచే కవితాపీఠమున తొలిపూజలను అందవలసిన మహనీయురాండ్రు.

అవకాశము ఇచ్చి, సంస్కారము ఒసఁగినచో ఆంధ్ర కాంతలు మొల్ల, ముద్దుపళని, వేంకమ్మ మున్నగువారివలె ఆంధ్రసారస్వతమునే కాక నాచివలె సంస్కృతవాఙ్మయమును కూడ గ్రంథరత్నములతో అలంకరించి అనశ్వరమైన యశోధనమును సముపార్జింపఁగలరని ఈ విదుషీమణి ధన్యజీవితము ఆంధ్రసీమాంతములు మాఱుమ్రోయునట్లు మేఘనినదములతో ఉద్ఘోషించుచున్నది.

సంస్కృతమున కవనము చెప్పిన ఆంధ్రస్త్రీలలో మొదటిపేరు ఆమెది ఐనట్లే స్వీయచరిత్ర వ్రాసిన ఆంధ్రులలో మొదటిపేరుకూడ ఆమెదే కానగును.

# 3

# గంగాదేవి

సంస్కృతకావ్యములను చెప్పిన ఆంధ్రస్త్రీలలో గంగాదేవి ఒకతె.

ఈమె వీరకంపరాయచరిత్రము అను చారిత్రక కావ్యము రచియించినది. ఈ గ్రంథమునకు మధురావిజయము అను నామాంతరముకూడ కలదు

విజయనగరసామ్రాజ్యసంస్థాపకులలో ఒకఁడైన బుక్కరాయల ముగ్గురు కుమారులలో మూడవవాఁడు కుమారకంపరాయలు. కవయిత్రి గంగదేవి ఈ కంపరాయలభార్య. ఆమె తాను రాజకన్యకను అని మధురావిజయమున తెలుపుకొన్నది.

విదుషీమణియైన గంగాదేవి తనవిభుఁడైన కుమారకంపరాయల వీరవిక్రమములను, విజయయాత్రలను ఈ గ్రంథమున విపులముగ వర్ణించియున్నది.

మధురావిజయము ఎనిమిదిసర్గల మహాకావ్యము. ఈ కవయిత్రి ఒక్కొక్క సర్గలో ఒక్కొక్కవిధమైన ఛందస్సును వాడియున్నది.

మొదటి సర్గమున అనుష్టుప్, రెండవసర్గమున ఉపజాతి, మూడవసర్గమున వంశస్థ, నాలుగవ సర్గమున తిరిగి అనుష్టుప్, ఐదవసర్గమున ద్రుతవిలంబిత, ఆఱవసర్గమున పుష్పితాగ్రఛందము ఇత్యాదిగా వాడియున్నది.

మొదటిసర్గమున దేవతాప్రార్థనము, కవిస్తుతి, కుకవి నింద ఐనపిమ్మట ఆమె కావ్యనాయకుని ప్రధాననగరమైన విజయనగరమును విపులముగ వర్ణించినది.

రెండవసర్గమున బుక్కరాయల పుత్రుల అభివర్ణనము కలదు. బుక్కరాయల భార్య దేవాయి. ఆ దంపతులకు కంపన, సంగమ, కుమారకంపన అను మువ్వురుపుత్రులు. ఇందు కుమారకంపరాయలు కావ్యకర్త్రి అగు గంగాదేవి ధవుఁడు.

మూడవసర్గము కుమారకంపరాయలకు బుక్కరాయలు చేసిన హితబోధను ప్రస్తరించుచున్నది.

నాలుగవసర్గమున కంపన దక్షిణదిగ్విజయయాత్రకు బయలువెడలుట అభివర్ణితము. రణప్రయాణభేరి మ్రోయించి అతఁడు కర్ణాటవిషయము అతిక్రమించి ఐదారుదినములలో కంటకాననపురమునకు ఏగి అచ్చట కొన్నాళ్ళు దండువిడిసినాఁడు. అటుపిమ్మట చంపనృపతిని జయించి రాజగంభీరమను గిరిదుర్గమును స్వాధీనపఱుచుకొనుట వర్ణింపఁబడినది.

ఐదవసర్గమున కాంచీపురము రాజధానిగా చేసికొని కంపరాయలు ప్రావృట్కాలమును, శీతకాలమును గడుపుట వివరించుచున్నది.

ఆఱవసర్గమున దండువిడిదిలో కుమారకంపరాయల జీవితక్రమము వర్ణితము.

ఏడవసర్గము కుమారకంపరాయలకును; అతని అర్ధాంగియు, కావ్యకర్త్రియు అగు గంగాదేవికిని నడచిన సంభాషణను ప్రస్తావించుచున్నది. ఈ సర్గమున కొంత గ్రంథపాతము కలదు. వీరకంపరాయలు ఉదయమున కావ్యగోష్ఠీప్రియుఁడై

కోరి గంగాదేవిచే వెన్నెలవర్ణన కావించుకొనినాఁడు.

ఎనిమిదవసర్గమున కంపరాయల సముఖమున మధురాపురదేవత ప్రత్యక్షమగును. ముసల్మానులు దక్షిణదేశము మీఁదికి ఎత్తివచ్చి హైందవదేవాలయములను ఎట్లు పచ్చము పాడు చేసినారో, ముహమ్మదీయదుష్పరిపాలనమువలన దక్షిణదేశప్రజలు ఎట్లు పంచకరిపాట్లు పడుచున్నారో ఆ దేవత కంపరాయలకు చెప్పును. వారిని శిక్షించుటకు ఆమె అతనికి ఒక కరవాలమును ఇచ్చును. అందుమీఁద కంపరాయలు మధురమీఁద దండెత్తిపోయి సమరములో అచటి సుల్తానును ఓడించి అచటి దేవాలయములు పెక్కింటికి దానధర్మములు కావించును.

ఈ కావ్యమున ప్రస్తావితమైన కుమారకంపరాయల కార్యకలాపమంతయు క్రీస్తుశకము 1343-వ సంవత్సరమునకును, 1356-వ సంవత్సరమునకును నడుమ జరిగియుండునని చరిత్రకారుల ఊహ.

గంగాదేవి మధురావిజయమును తిరువాన్కూరు పురాతత్త్వపరిశోధకశాఖవారు 1916 లో ప్రకటించి ఉన్నారు. శ్రీ తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రిగారు దీనిని తెనుఁగులోనికి చంపువుగా అనువదించి ఉన్నారు.

మధురావిజయము చారిత్రకముగా గొప్పవిలువకల గ్రంథము. సంస్కృతకావ్యరచయితలకు ఇతిహాసములనుండి ఏదియో ఒకగాథను తీసికొని దానిని మహాకావ్యముగా పెంపొందించుట పరిపాటియై ఉండెను. ఉపజ్ఞామహితురాలగుట గంగాదేవి సర్వసాధారణమైన ఈ పంథాను అవలంబింపక రాజకుమారుఁడైన తనభర్త వీరజీవితమును కావ్యవస్తు

వుగా, తనకవితావైదుష్యమునకు ప్రదర్శనభూమిగా చేకొనినది.

అమూల్యములైన ఆనాఁటి చారిత్రకాంశములను తెలిసికొనుటకు గంగాదేవి కావ్యము ఎంతయో ఉపకరించుచున్నది.

అంతియేకాదు. వీరకంపరాయచరిత్రమున మహాకావ్యలక్షణములు అన్నియు లెస్సగ అమరియున్నవి. ఆఱు ఋతువులు, ఉషఃకాలము, చంద్రోదయము మున్నగు అష్టాదశవర్ణనములు అందు విపులీకృతములై ఉన్నవి.

కావ్యమంతయు వైదర్భీరీతిలో రచితమైనది. భావములు మృదుమధురములు. శైలి సులభసుందరము.

గంగాదేవి వాడిన ఉపమాలంకారములు ప్రాయికముగా ప్రకృతినుండి గ్రహింపఁబడినవి.

పాండిత్యప్రకర్ష, వ్యర్థపదాడంబరము గంగాదేవి కవితయందు కానరావు. ఈ విషయమున ఆ విదుషి సమకాలిక సంస్కృతకవుల మర్యాదకు పెడఁదొలఁగి ఉచితజ్ఞతను ప్రదర్శించినదని చెప్పవచ్చును.

కవిలోకగురువగు కాళిదాసు ఆమె అభిమానకవి. అగుట ఆమె తన కావ్యమున పలుతావులయందు కాళిదాసును అనుకరించి ఉన్నది.

అగుఁగాక! గంగాదేవి అనుకరణము అంధానుకరణము కాదు. తాను అనుకరించు కాళిదాసువర్ణనములకు ఆమె తన ప్రజ్ఞాచమత్కారముచే క్రొత్తరూపము ఇచ్చి ఇంపును కూర్చుచున్నది.

ఒక్క నిదర్శనమును తిలకింపుఁడు:

రఘుమహారాజు జైత్రయాత్ర పోవు సందర్భమును రఘువంశమున నాలుగవ సర్గమున ముప్పదిరెండవశ్లోకమున కాళి

దాసు ఇట్లు వర్ణించుచున్నాఁడు:

స సేనాం మహతీం కర్షన్
పూర్వసాగర గామినీమ్
బభౌ హరజటాభ్రష్టాం
గంగామివ భగీరథః.

రఘుమహారాజు తూర్పుసముద్రమువఱకు వ్యాపించియున్న తన సేనను వెంటఁబెట్టుకొని పోవుచు ఈశ్వరజటాజూటమునుండి భ్రష్టమైన గంగను వెంటనిడుకొని పోవుచున్న భగీరథునివలెనే ప్రకాశించుచున్నాఁడు.

కాళిదాసు వర్ణనము ఇట్టిదికాఁగా దీనిని అనుకరించుచు గంగాదేవిచేసిన వర్ణనము ఎట్లున్నదో పరికింపుఁడు:

స నయన్ మహతీం సేనా
వ్యరుచ ద్వీర కుంజరః
పయోదమాలా మాకర్షన్
పౌరస్త్య ఇవ మారుతః.

ఆ వీరకుంజరుఁడు (వీరకుమారకంపరాయలు) సేనను వెంట నిడుకొని పోవుచు మేఘమాలలను కొంపోవుచున్న తూర్పుగాలి రీతిని శోభిల్లుచున్నాఁడు.

ఆమె రచనావైదగ్ధి తెలుపుటకు ఈ నిదర్శనము చాలును.

కృత్యాదిని గంగాదేవి గణేశ్వరుని, పార్వతీపరమేశ్వరులను, శారదాదేవిని ఇట్లు స్తుతించుచున్నది:

కల్యాణాయ సతాం భూయాత్
దేవో దంతావలాననః
శరణాగత సంకల్ప
కల్పనా కల్పపాదపః.

శరణాగతుల ప్రార్థనాపరంపరలకు కల్పవృక్షము, గజాననుఁడు ఐన వినాయకదేవుఁడు సత్పురుషులకు గొప్ప శుభములను ఇచ్చును కాక!

స్రష్టుః స్త్రీపుంసనిర్మాణ
మాతృకారూపధారిణౌ
ప్రపద్యే ప్రతిబోధాయ
చిత్ప్రకాశాత్మకౌ శివౌ.

బ్రహ్మయొక్క స్త్రీపుంసాత్మకసృష్టికి మాతృకారూపధారులైన చిత్ప్రకాశాత్మకులను- పార్వతీపరమేశ్వరులను- జ్ఞానాభివృద్ధికి తలంచెదను.

మహాకవి ముఖాంభోజ
మణిపంజర శారికాం
చైతన్యజలధి జ్యోత్స్నాం
దేవీం వందే సరస్వతీం.

మహాకవుల ముఖపద్మములనెడు మణిపంజరములందు మైనగోర, చైతన్యసముద్రమునకు వెన్నెలయై ప్రకాశించు శారదాదేవికి నమస్కరించుచున్నాను.

ఇష్టదేవతావందనము కావించినపిమ్మట గంగాదేవి ఇట్లు గురుస్తుతి చేయుచున్నది:

అసాధారణ సార్వజ్ఞ్యం
విలసత్సర్వ మంగళం
క్రియాశక్తి గురుం వందే
త్రిలోచన మివాపరం.

అసాధారణపాండిత్యముచే సర్వజ్ఞుఁడును, సర్వశుభములచే విలసితుఁడును ఐ రెండవ ఈశ్వరుఁడనఁదగిన సద్గురునికి క్రియాశక్తికి నమస్కరింపుచున్నాను.

క్రియాశక్తి పూర్తినామము కాశీవిలాస క్రియాశక్తి అని. గంగాదేవితోపాటు మాధవమంత్రికి (బుక్కరాయల మంత్రికి) కూడ క్రియాశక్తి గురుమూర్తి.

క్రియాశక్తి శైవాచార్యుడు. కాశ్మీరదేశపు పాశుపత శైవమతమునకు చెందినవాడు. ఈవర్గమువారికే కాలముఖులని మఱియొక పేరు.

విజయనగర సామ్రాజ్యసంస్థాపనాచార్యులైన హరిహరరాయుడు, బుక్కరాయుడు క్రియాశక్తిశిష్యులు. ఆతడు ఆ కాలమున గొప్ప మతబోధకుడు. ప్రజాహితచింతకుడు నైయుండి శైవాచారపీఠమును ఒకదానిని స్థాపించెను. రాయల సీమలో అనేక దేవాలయములను నిర్మించెను.

విజయనగరరాజుల గురువైన అనగా తనభర్త్రువంశమునకు కులగురువైన క్రియాశక్తి ఆశీర్వాదమును తనకావ్య విజయమునకుగాను గంగాదేవి కృతజ్ఞతాపూర్వకముగ? అభ్యర్థించుచున్నది.

తన మతగురువును ఇట్లు స్తుతించినపిమ్మట గంగాదేవి ప్రాచీనసంస్కృతకవిప్రముఖులను ప్రస్తుతించినది. ఆమె కవితాహ్వానయమును కొంతకుకొంత తెలిసికొనుటకు ఈ కవి స్తుతి శ్లోకములు బాగుగ ఉపకరించును.

వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు, బాణుడు, భారవి, దండి, భవభూతి, లీలాశుకులను కవులను ఆమె వరుసగా ఇట్లు స్తుతించుచున్నది:

చేతసోఽస్తు ప్రసాదాయ
సతాం ప్రాచేతసో మునిః

పృథివ్యాం పద్య నిర్మాణ
విద్యాయాః పరమం పదమ్.

భూమియందు పద్యనిర్మాణవిద్యకు ఆదికరణమైన వాల్మీకి సత్పురుషులకు మనోనైర్మల్యమును ప్రసాదించును గాక!

వైయాసికే గిరాం గుంఫే
పుంశ్రేత్సు విరలభ్యతే
సద్యః సహృదయాహ్లాది
సారః పర్వణి పర్వణి.

వ్యాసగురు వాగ్గుంభనయందు తెల్లచెఱుకుసంగువలెనే సహృదయహృదయాహ్లాది అగు సారము ప్రతిపర్వమునను లభించుచున్నది.

దాసతాం కాళిదాసస్య
కవయః కేన బిభ్రతి
ఇదానీమపి తస్యార్థా
నుపజీవత్య మీయతః.

నేటివఱకుఁగూడ నెవనియొక్క భావాదుల నేకరించి కవులు జీవించుచున్నారో యట్టి కాళిదాసు దాస్యమును ఏకవి అంగీకరింపఁడు?

వాణీ పాణి పరామృష్ట
వీణా నిక్వాణ హారిణీం
భావయంతి కథం వాన్యే
భట్టబాణస్య భారతీం.

భారతి వాయించుచున్న వీణానాదమువలె అతిహృద్యమగు భట్టబాణుని వాగ్జాలము నెవ్వఁడు భావింపఁడు?

విమర్ద వ్యక్త సౌరభ్యా
భారతీ భారవేః కవేః

ధత్తేవ కులమాలేవ
విదగ్ధానాం చమత్క్రియాం.

పొగడదండవలెనే సమ్యగ్గ్రథనముం గూడ సువ్యక్తసౌరభము కల భారవి వాక్కుల నెట్టి విద్వాంసులు ధరింపరు?

ఆచార్య దండినో వాచాం
ఆచాంతామృత సంపదాం
వికాసో వేధసః పత్న్యా
విలాస మణి దర్పణః.

అమృతమును గ్రోలిన ఎంత హాయిగా నుండునో అట్టి యానందమును ఇచ్చు దండి వాగ్విలాసము భారతికి విలాసమణిదర్పణమై వెలయుచున్నది.

సాకాపి సురభి శ్శంకే
భవభూతేః సరస్వతీ
కర్ణేషు లబ్ధవర్ణానాం
సూతే సుఖమయీం సుధాం.

వినునంతమాత్రమున సుఖస్వరూపమగు అమృతము నొసంగుచున్న భవభూతివాక్కు ఒకానొక కామధేనువని తలంచెదను.

మందార మంజరీ స్యంది
మకరంద రసాబ్ధయః
కస్య నాహ్లాదనాయాలం
కర్ణామృత కవేగిరః.

మందారపుష్పమంజరులందు స్రవించుచున్న మకరంద సముద్రములయి యొప్పెడు లీలాశుకుని వాక్కులు ఎవనికి ఆహ్లాదమును చేయవు?

ఈ శ్లోకముల తరువాత కవిస్తుతిలో గంగాదేవి చెప్పిన

మఱినాలుగు శ్లోకములు ఆంధ్రులు ప్రత్యేకముగ పఠింపఁదగి యున్నవి.

తిక్కయజ్వః కవేస్సూక్తీః
కౌముదీవ కలానిధేః
సతృష్ణైః కవిభిస్స్వైరం
చకోరైరివ సేవ్యతే.

చంద్రునియొక్క వెన్నెలను తృష్ణతో ఉన్న చకోరములు ఎట్లు సేవించునో అట్లు తిక్కయజ్వకవి సూక్తులను ఉత్సాహముకల కవులు స్వేచ్ఛగ అనుభవింతురు.

ఇందు ప్రస్తుతినందిన తిక్కకవి మన తిక్కనసోమయాజి కావలయు. అతఁడు ఉభయకవిమిత్రుఁడుకదా!

కాకతీరాజ్యపతనానంతరము ఓరుగంటినుండి హరిహరరాయలు, బుక్కరాయలు అను తెనుఁగునాయకులు వెళ్ళి విజయనగర రాజ్యమును స్థాపించినారు. అందు బుక్కదేవభూపాలుని కోడలైన మనగంగాదేవి ఆంధ్రకవిబ్రహ్మ, ఉభయకవిమిత్రుఁడు ఐన తిక్కనసోమయాజి ఆంధ్రకవితను ఆలించి మేలెంచి యుండుటలో ఆశ్చర్యము ఏమియు లేదు.

కవితాహృదయముకల ఆంధ్రులకు సంస్కృతకవులును, ఆంధ్రకవులును సమానముగా పూజ్యులేకదా! అందుచేతనే గంగాదేవి తన గీర్వాణకావ్యమున ఆంధ్రకవిగ్రామణియగు తిక్కకవినికూడ ప్రస్తుతించి ఉన్నది.

తిక్కనను స్తుతించినపిమ్మట గంగాదేవి మఱిముగ్గురు ఆంధ్రులను స్తుతించుచున్నది. ఈ ఆంధ్రులు ముగ్గురును ఓరుగల్లు ప్రాంతీయులు; సంస్కృతకవితాధురీణులు.

చతుస్సప్తతి కావ్యోక్తి
వ్యక్తవైదుష్య సంపదే
అగస్త్యాయ జగత్యస్మిన్
స్పృహయేత్ కోన కోవిదః.

డెబ్బదినాలుగు కావ్యములను వ్రాయుటచే సువ్యక్తమైన పాండిత్య ప్రాభవముకల అగస్త్యుని భూమియందు ఏ విద్వాంసుఁడు మెచ్చును?

స్తుమస్తమ పరంవ్యాసం
గంగాధర మహాకవిమ్
నాటకచ్ఛద్మ నాకృష్టాం
యశ్చక్రే భారతీకథామ్.

భారతకథ నంతయును నాటకరూపముగా చేసి అపరవ్యాసుఁడనిపించుకొనఁదగిన గంగాధరమహాకవిని స్తోత్రము చేసెను.

చిరం స విజయీ భూయాత్
విశ్వనాథః కవీశ్వరః
యస్య ప్రసాదాత్సార్వజ్ఞ్యం
సమింధే మాదృశేష్వపి.

ఎవనియొక్క ప్రసాదమువలన మావంటివారము సర్వజ్ఞులమనిపించుకున్నారమో ఆ విశ్వనాథకవితల్లజునకు చిరకాలము జయమగుఁగాత!

ఈ స్తుతిశ్లోకమున ప్రస్తావింపఁబడిన విశ్వనాథకవి కాకతీయ ప్రతాపరుద్రదేవుని ఆస్థానమునందు ఉండినవాఁడు. ఈతఁడు భీముని సౌగంధికాపహరణగాథను వ్యాయోగముగ సంస్కృతమున రచించినాఁడు.

స్తుతిధోరణిఁబట్టి చూడఁగా ఈ విశ్వనాథకవి గంగాదేవికి కవితాగురువుగా తోఁచుచున్నాఁడు. మఱియు మధురా

విజయరచనాకాలమునాఁటికి ఆ కవిరాజు జీవించి ఉన్నట్లుగా ఊహింపనై ఉన్నది. అప్పటికి అతఁడు జీవించి ఉండకపోయినచో ఈశ్లోకమున గంగాదేవి 'విశ్వనాథకవితల్లజునకు చిరకాలము జయమగుఁగాక!' అని ఎట్లనఁగలదు?

గంగాదేవి మగఁడు బుక్కభూపాలుఁడు ఓరుగంటి నుండియే విజయనగరప్రాంతమునకు వెళ్ళినాఁడుకదా! అక్కడకు వెళ్ళినతరవాతకూడ అతని సంబంధబాంధవ్యములు హెచ్చుగా ఓరుగంటిప్రాంతపువారితోనే ఉండినవనుటకు గంగాదేవి ఉదంతము ఒక నిదర్శనము.

విశ్వనాథకవియేకాక అగస్త్యుఁడు, గంగాధరుఁడుకూడ ఓరుగంటి ప్రాంతమువారే. ఈసందర్భమున సరస్వతీపత్రికలో శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు వ్రాసిన క్రిందిపంక్తులు చదువఁదగియున్నవి:

"సౌగంధికాపహరణము వలన విశ్వనాథకవికి అగస్త్యుఁడు మేనమామయని యెఱుఁగనయ్యెను. కాదంబరీనాటకమందు నరసింహకవికి గంగాధరకవి తండ్రియనియు, విశ్వనాథకవి యన్నయనియుఁ దెలియుచున్నది."

కవిత్వమును గుఱించి, దోషైకదృక్కులను గుఱించి, కావ్యములను గుఱించి, మధురావిజయమును గుఱించి క్రింది శ్లోకములలో గంగాదేవి వెల్లడించిన భావములు ఆపాతమనోహరములై ఉన్నవి.

సమగ్రసుందరమగు కావ్యము అరుదైనదని ఆమె ఇట్లు చెప్పుచున్నది:

క్వచిదర్థః క్వచి చ్ఛబ్దః
క్వచి ద్భావః క్వచిద్రసః

యత్రైతే సంతి సర్వేపి
సనిబంధో నలభ్యతే.

ఒకచో శబ్దసౌష్ఠవము, ఒకానొకచో భావగాంభీర్యము, వేఱొకచో వస్తుమాధుర్యము, మఱియొకచో రససంపద చూచుచున్నారము. ఇవి అన్నియు నొకేచోట నిబంధనగా లభ్యముగుట అరుదు.

కొంచెము దోషమున్నను ఆ కావ్యము తెగడఁదగినదని గంగాదేవి ఇట్లు వివరించుచున్నది:

ప్రబంధ మూష న్నల్పోపి
దోషో నయతి దూష్యతాం
కాలాగరుద్రవభరం
శుక్తికాశకలో యథా.

కాలాగరుద్రవముతో నిండిన శుక్తిలో కొంచెము కారము కలిసిన ఎట్లు దూష్యమో అట్లే యీషద్దోషయుక్తమగు కావ్యము కూడ దూష్యమే.

గుణములేని కావ్యము నిర్దోషమయ్యు రుచింపదను సత్యమును గంగాదేవి ఇట్లు వర్ణించుచున్నది:

నిర్దోషాప్య గుణా వాణీ
నవిద్వజ్జనరంజనీ
పతివ్రతాప్యరూపా స్త్రీ
పతిణో లేవరోచతే.

గుణసంపదలేని కావ్యము నిర్దుష్టమైనను పండితుల రంజింపఁజేయదు. పతివ్రతయైనను కురూపియగు స్త్రీని వరుఁడు ఇచ్చగింపఁడుకదా!

దోషైకదృక్కులను ఆమె ఇట్లు నిరసించుచున్నది:

గుణం విహాయ కావ్యేషు
దుష్టోదోషం గవేషతే
వనేషు త్యక్త మాకందః
కాకోనింబ మపేక్షతే.

కావ్యములలోని గుణములను విడిచి దుర్మార్గుఁడు దోషములనే వెదకును. మధురమగు మామిడిపండ్లుకల తోఁటను విడిచి కాకము వేపపండ్లకై ఆశించునుకదా!

'అర్థపుం దెలువాఁబలు' కొట్టి వ్రాసిన కావ్యము రాణింపదని గంగాదేవి ఇట్లు చాటుచున్నది:

చౌర్యార్జితేన కావ్యేన
కియద్దీవ్యతి దుర్జనః
ఆహార్యనాగో నచిరం
రుచిరః కృత్రిమోపలః.

అర్థాదిచౌర్యము చేసిన కాకవులు ఎంతవఱకు ప్రకాశింతురు? అలంకారాదులచే కూడుకొన్నను కృత్రిమపు రాతియేనుఁగు చాల కాలము ప్రకాశింపదుకదా?

సరలాలాపపేశలమైన కవిత్వము చెప్పు కవులు అరుదని గంగాదేవి ఇట్లు వచించుచున్నది:

తార్కికా బహవస్సంతి
శాబ్దికాశ్చ సహస్రశః
విరలాః కవయో లోకే
సరలాలాపపేశలాః.

తార్కికులు అనేకులు ఉన్నారు. వ్యాకరణవేత్తలు వేలకొలఁది ఉన్నారు. కాని సరలమగు వాగ్గుంభనకల కవులుమాత్ర మరుదు,

కావ్యప్రయోజనమును ఈ కవయిత్రి ఇట్లు విపులీకరించు చున్నది:

కరోతి కీర్తి మర్థాయ
కల్పతే హంతి దుష్కృతం
ఉన్మీల యతి చాహ్లాదం
కింనసూతే కవేః కృతిః.

కావ్యము కీర్తిని కలిగించును. ధనమును ఇచ్చును. పాపమును తొలఁగించును. ఆహ్లాదమును కలుగఁజేయును, కావ్యము దేని నీయదు?

సత్కావ్యశ్రవణమునకై పండితులు తమకుఁదామే పూనుకొందురను సూక్తిని ఆమె ఇట్లు చమత్కరించుచున్నది:

నప్రార్థనీయా సత్కావ్య
శ్రుతౌ సహృదయో జనః
స్వాదు పుష్ప రసాస్వాదే
కః ప్రేరయతి షట్పదం.

సత్కావ్యశ్రవణమునకై సహృదయుఁడు వేఁడఁబడఁడు. రుచిరమగు పుష్పమకరందమును గ్రోలుటకు తుమ్మెదను ఎవఁడు ప్రేరేఁచును?

తాను రచియించిన మధురావిజయము వినఁదగిన కావ్యమని ఆమె ఇట్లు సూచించుచున్నది:

తన్మదీయ మిదం కావ్యం
విబుధాః శ్రోతుమర్హత
మధురావిజయం నామ
చరితం కంప భూపతేః.

నేను వ్రాసినది, మధురావిజయము మను నామముకలది అగు కంప

భూప చరితమును పండితులు వినఁదగియున్నారు.

గంగాదేవి రచియించిన మధురావిజయమునందు రెండు ఘట్టములు అతిశయమనోహరములు.

ఆ రెండుఘట్టములలో ఒకటి భర్తకోరికమీఁద గంగాదేవి వెన్నెలను వర్ణించిన ఘట్టము; రెండవది మధురానగర దేవత కంపభూపతికి కలలో కనిపించి తన కడగండ్లు చెప్పిన ఘట్టము.

ఈ రెండు ఘట్టములను మనము ప్రత్యేకించి పరామర్శించుకొందము

తాను క్రొత్తగా జయించిన రాజ్యభాగమునకు కంపరాయలు మరకట పట్టణమును రాజధానిగా చేకొనినాఁడు. రాజభవనమున ఉన్నప్పుడు అతఁడు అనుదినము కొంతప్రొద్దు కవులతో, పండితులతో కావ్యగోష్ఠిప్రియుఁడై ఉండువాఁడు. మఱికొంతసేపు అంతిపురమున స్త్రీలతో వివిధఋతువులలో ఆ యాకాలములకు అనువైన విలాసములతో తగిలియుండువాఁడు.

క్రీస్తు శకము 1367-వ సంవత్సర ప్రాంతమున కంజీవరమున (కాంచీపురమున) నెలకొని కుమారకంపరాయలు విజయనగరసామ్రాజ్యభాగమును ఒకదానిని ఏలినాఁడు. కంజీవరమున ఉన్నప్పుడు ఒకనాఁటి సాయంకాలము కంపరాయలు భార్యయగు గంగాదేవిని కోరి వెన్నెలవర్ణన కావించుకొనినాఁడు.

ఈ సందర్భమైన భార్యాభర్తల సంభాషణ మధురావిజయకావ్యమున సప్తమసర్గయందు మూఁడుశ్లోకములలో (39, 40. 41 సంఖ్యగల శ్లోకములలో) ప్రస్తావితమైనది. గమనింపుఁడు:

అథ కంపనృపోఽపి కృత్యవిత్
కృతసంధ్యాసమయోచితక్రియః
అవదత్ సవిధేస్థితాం ప్రియాం
భువి గంగేత్యభిశంసితాహ్వయాం. (39)

తరువాత సమయజ్ఞుఁడగు కంపభూపాలుఁడు సంధ్యాకాలోచితకృత్యముల నిర్వహించుకొని తన సన్నిధియందున్నది, గంగయనెడు పూజ్యమగు నభిధానము కలది ఐన తనభార్యను గుఱించి ఇట్లు పలికెను.

కమలాక్షి కటాక్ష్యతామయం
సమయో వర్ణనయా రసార్ద్రయా
జన ఏష వచస్తవామృతం
శ్రవసా పాయయితుం కుతూహలీ. (40)

ప్రియా! ఈ సంధ్యాకాలమును గూర్చి రసార్ద్రమగు వర్ణనా చాతుర్యముచే వర్ణింపుము. ఈజనుఁడు నీవాగమృతము వీనులచే గ్రోలుటకు కుతూహలుఁడై యున్నాఁడు.

ఇతి సా దయితేన భాషితా
దరనమ్రం దధతీ ముఖాంబుజమ్
వదతి స్మ శనైః శుచిస్మితా
సరసోదారపదాం సరస్వతీమ్. (41)

ఈ ప్రకారముగా భర్తచే ఆజ్ఞాపింపఁబడి గంగ శుచిస్మితముతో కూడిన వదనమును ఇంచుక వంచి సరసము, ఉదారము అగు వాగ్గుంభనచే మెల్లగా ఇట్లు వర్ణింపఁదొడఁగెను:

"బహువల్లభుండగుటఁ దక్షిణవారికన్నఁ దనపై నెక్కుడు మక్కువతో మెలఁగవలయునని రోహిణియో, గురుదారయని నిరసింపక తనకుఁ గైవసము కావలయునని తారయో పెట్టిన వేఁడులు వారుచున్న మంటలో? మాఁటలో?—

తమతమ భాగము హెచ్చుతగ్గులు లేకుండఁ గైకొంటకై యమృతాంధసు లుంచిన విల్లిగరిటయో? —

చిత్తమునకెక్కిన వైరియగు జీఁకటియో? —

యబ్జనాభుమ్రోఁ గొనిచేరిన మాళీపుంజమ్మో? —

కలానిధానముగుట లక్ష్మిబిగింపో? —

అమృతమయుండగుట సిందారఁబోసెను పిపీలికానికాయంబో?

బింబపదంబు గని వ్రాలిన చిలుకయో? —

శూద్రధరుండుగాన తిష్యక్కకమో? —

రాజు కాన హృదయస్వభావమో? —

తేజంబుకాన ప్రాణుంబో? ---

గగనాంగణమున వెట్టిన దీపంబు కాన కాడియో? —

అత్రిముని కంటిపుసి కాన నలకయో? —

కలంక మనుపేర నెఱబాణయగు సిరఁజారియుండఁ బోను కానియో.’’

—(శ్రీ తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రి అనువాదము.

చంద్రునిలోని మచ్చను ఈకవపుత్రి ఎన్నివిధముల, ఎంత చమత్కారముగ ఉత్ప్రేక్షించినదో చూచితిరా?

తురక సులతాను దుర్గప్రత్యునికి తాపిలమైన మధురానగరదేవత వీరకంపరాయలకు కలలో కనిపించినప్పటి స్థితివర్ణనము ఎంత మనోహరముగా ఉన్నదో పరికింపుఁడు:

“గరుపాఱు మోమున వ్రేలు ముంగురులతోఁ, జెరిగిపోయిన చేర్పుక్కతో, బ్రద్దెప్పనగు గద్దోయితో, వేఁడి నిట్టూర్పుతో, విన్ననగు నాననముతోఁ, దూలు మైఁదీఁగతో, వ్రేలు వేనలితో, మాసిన చీరతోఁ, బాసిన యలంకారములోఁ జూడరాని యవస్థనొందియు నొక్క తేజంబున మహానుభావత్వంబుఁ బ్రకటించు

నొక్క యన్నుల మిన్న యన్నెలఁతని కన్నుల యెదుటఁ బొడ
మూపె,"

—(శ్రీ తాశేపల్లి రాఘవనారాయణశాస్త్రి అనువాదము.)

మధురాపుర దేవత తనయవస్థ వీరకంపరాయలకు విని
పించిన తీరు గమనింపుఁడు:

"దయాశరధీ! నాపేరు మధుర. నే నొక పురంధ్రిని. నా
యునికిపట్టు మధురాపురి. దక్షిణాశావధూటీమణి మణిహారలతిక,
ఆ హారమునకుఁ దారమణి సుందరేశ్వరుఁడు. బహువైభవ మనుభ
వించిన యమ్మనికిఁ గాలవశంబున దుర్జనులవలనఁ గలిగిన యిడు
ములు దలఁచుపాటివియే? ఆశ్రయాశ్రయులలో నొకరిబాధ యొక
రిది కాదా? కరుణార్ద్రా! వినుచుంటివా? దక్షిణాశ యదక్షిణాశ
యన నయ్యె. సుందరేశ్వరుం డసుందరేశ్వరుం డయ్యె. నాయం
దమధురత సాక్ష్యమిచ్చుచు నే యున్నదికదా! రాజసింహా!"

—(శ్రీ తాశేపల్లి రాఘవనారాయణశాస్త్రి అనువాదము.)

వీరకంపరాయలు ఒనర్చిన తురుష్కనిష్కాసనమును
గంగాదేవి గొప్పగా వర్ణించినది.

కంపరాయలతోనైన యుద్ధసందర్భమున నాఁటి మధుర
తురుష్కసురత్రాణునినోట గంగాదేవి పలికించిన పలుకులు-
'మీసలువచ్చె హిందువుల కౌరా!', 'ఏమీ! హిందువులింత
వారలయిరా?' మున్నగునవి- ఆయా ప్రకరణములందు విశేష
రసోదంచితములై యున్నవి.

స్త్రీ రచితమగు మధురావిజయమున 'తరుణుల సత్వ
మిట్టిదయ తప్పానరించిన మంచిసేసినన్' వంటి అర్థాంతరన్యా
సములు ఉండుట మెచ్చఁదగిన విషయము.

పేరు ఉచ్చరించిన మాత్రముననే శత్రువులకు కంప

మెత్తుచుండుటచే తనభర్తకు కంపన నామము పెట్టఁబడినదని గంగాదేవి మధురావిజయకావ్యమున చమత్కరించుచున్నది.

కంపరాయలు రణవిద్యయందే కాక కళలయందును కుశలుఁడని గంగాదేవి చెప్పుచున్నది. తన కవితాప్రాగల్భ్యమునకు, వర్ణనాచమత్కారమునకు మెచ్చి విభుఁడు తనకు అనేకవిధములైన బహుమానములు ఇచ్చినట్లు ఆమె పేర్కొనుచున్నది.

సంస్కృతసారస్వతమున, ఆంధ్రసారస్వతమున చారిత్రకగ్రంథరచనము అరుదైన విషయము. అందును సమకాలికచరిత్రను ప్రస్తరించు గ్రంథముల రచన మఱింత అరుదైన విషయము.

కల్హణుఁడు వ్రాసిన రాజతరంగిణి, బాణుఁడు వ్రాసిన హర్షచరిత్ర మున్నగునవి సంస్కృతమున చారిత్రకసారస్వతమును పరిపుష్టి నొందించుచున్నవి. గంగాదేవి రచియించిన మధురావిజయముకూడ ఈ వర్గమునకు చెందినదే

బాణుని హర్షచరిత్రవలెనే గంగాదేవి మధురావిజయముకూడ సమకాలికచారిత్రకాంశములను ప్రస్తరించుచున్నది.

గంగాదేవి వలెనే సమకాలికచారిత్రకాంశములను కావ్యవస్తువుగా స్వీకరించిన ఆంధ్రవిదుషీమణులు మఱి ఇరువురు కలరు. వారు తిరుమలాంబ, రామభద్రాంబ అను వారలు.

వీరిలో తిరుమలాంబ విజయనగరరాజులలో ఒకఁడైన అచ్యుతరాయలు వరదాంబికను వివాహమైన ఉదంతమును వరదాంబికాపరిణయ మను కావ్యముగా విరచించినది.

రామభద్రమ్మ తన ఏలికయగు తంజాపురి రఘునాథ రాయలచరిత్రమును రఘునాథాభ్యుదయము అను నామముతో కావ్యముగా రచించినది.

గంగాదేవియు, రామభద్రమ్మయు తమభర్తల జీవిత ఘట్టములను తమ కావ్యవస్తువులుగా స్వీకరించియున్నారు.

అగుఁగాక! ఇక్కడ ఒకచిన్న తేడ యున్నది. రామభద్రమ్మ రఘునాథరాయుల ఉపస్త్రీ. గంగాదేవి కంపరాయల పట్టపుదేవి.

తాను కంపరాయల దేవేరినని గంగాదేవి స్పష్టముగా చెప్పియున్నది. ఆమెకు గంగాదేవి అనునది ప్రసిద్ధనామము. రాణికి తప్ప అన్యులకు దేవి శబ్దము చెల్లుట సంప్రదాయము కాదని భరతశాస్త్రము నిర్ణయించుచున్నది.

ఒకానొక రాజునకు పట్టపుదేవియై ఆరాజు చరిత్రను ఒక మహాకావ్యముగా రచింపఁగల ప్రతిభకు సంస్కృతిసారస్వతమున తావలమైనది ఆంధ్రవిదుషీమణియైన గంగాదేవి యొక్కర్తుకయే యనుట అతిశయోక్తి అనిపించుకొనఁజాలదు.

చారిత్రకజ్ఞానముగల విదుషీమణిని భార్యగా చేకొన్న అదృష్టశాలి కావున వీరకంపరాయలు సంస్కృతోక్తిమయ ప్రపంచమున చిరంజీవియై యున్నాఁడు.

విదుషీమణిని భార్యగా పడసిన భర్తల అదృష్టము కొలఁదులు పెట్టుటకు తరముకానిది.

# ౪

# తుక్కాదేవి

తుక్కాదేవి ఓఢ్రుల ఇంటి యాఁడుపడుచు; తెలుఁగుల ఇంటి కోడలు. ఆమె ఒక మహారాజుకడుపున పుట్టి మఱిఒక మహారాజు కరమును పట్టినది. ఆమె కటకాధిపతి ప్రతాపరుద్రగజపతి సుత, విజయనగరాధిపతి కృష్ణదేవరాయల సతి.

ప్రతాపరుద్రగజపతి స్వయము పండితుఁడు. పయిఁగా పండితాదరము చూపినవాఁడు. అట్టివాని కూఁతురు తుక్క.

కృష్ణదేవరాయలు స్వయము సంస్కృతాంధ్రకవిపండితుఁడు. పయిఁగా సంస్కృతాంధ్రకవిపండితులను ఎందఱనో పోషించినవాఁడు. అట్టివాని దేవేరి తుక్క.

అగుట తుక్కాదేవి విదుషి కావుటలో ఆశ్చర్యకరమైన విషయము ఏమియు లేదు. కాని ఆమె తనవైదుష్యమును ప్రదర్శింపవలసి వచ్చిన తీరుమాత్రము విపరీతమైనదిగా, విషాదకరమైనదిగా ఉన్నది.

ఆ విదుషి వివాహము విపరీతపరిస్థితులలో జరిగినది. అది కేవలము రాజకీయవివాహము. అనేకరాజకీయవివాహములు అనంతరము సుఖపర్యవసితములైన నిదర్శనములు చరిత్రలో పరశ్శతములుగా ఉన్నవి. కాని ఈ రాజకీయవివాహము మాత్రము అట్లు కాలేదు.

కృష్ణదేవరాయలు 1509–వ సంవత్సరమున విజయనగరసింహాసనము ఎక్కుసరికి నెల్లూరుజిల్లాలోని ఉదయగిరి

వఱకుఁ గల సముద్రతీరపు తెలుఁగుదేశము అంతయు కటకాధిపతి ప్రతాపరుద్రగజపతి ఏలుబడిలో నుండెను.

ఈ ప్రాంతమును జయించుటకు కృష్ణదేవరాయలు 1513 మొదలు 1517 వఱకుఁగల నాలుగు సంవత్సరములలో పలుదండయాత్రలు సాగించినాఁడు. ఈ దండయాత్ర ధాటి నెల్లూరుజిల్లాలోని ఉదయగిరితో ప్రారంభమై గజపతిరాజధాని కటకపురివఱకు పొడిచినది.

ప్రతాపరుద్రగజపతిభార్య, అతని కొడుకు వీరభద్రుఁడు కృష్ణదేవరాయలకు ఖైదీలుగ చిక్కినారు. ఈ సమయముననే ఉత్తరమునుండి వంగసురత్రాణుఁడు ప్రతాపరుద్రగజపతి మీఁదకు ఎత్తివచ్చినాఁడు. ఇట్లు ఇరుకటమున పడి ప్రతాపరుద్రగజపతి కృష్ణదేవరాయలతో సంధిచేసికొనినాఁడు. తన కూఁతును కృష్ణరాయలకు ఇచ్చినాఁడు. అప్పుడు కృష్ణరాయలును తాను జయించిన గజపతిరాజ్యములో కృష్ణానదికి అవ్వల కల ప్రదేశమును అంతయు ప్రతాపరుద్రునకు ఇచ్చివేసినాఁడు. ఈ సంధి, ఈ వివాహము జరుగులోఁగా ఖైదులోఉన్న వీరభద్రుఁడు అవమానితుఁడై ఆత్మహత్య చేసికొని అసువులు బాసినాఁడు.

సోదరుఁడు మరణించినాఁడు. తండ్రికి కొంతరాజ్యము పోయినది. ఈ రెండుకష్టములకును కారణభూతుఁడు ఐన కృష్ణరాయలతో ఆమెకు వివాహము. అప్పటికే రాయలకు తిరుమల దేవి, చిన్నాదేవి అని ఇరువురు భార్యలు ఉండినారు. ఆనాఁడు రాజపత్నులకు ఇట్లు సవతులను కలిగిఉండుట ఒక విపరీతవిషయము కాకున్నను తుక్కాదేవికి ఈ వివాహము వలన సంసారసుఖము కలిగినట్లు కనిపించదు.

ఈ వివాహము జరిగిన తరువాత కృష్ణదేవరాయలు ఒక పుష్కరకాలము జీవించిఉండి విజయనగరసామ్రాజ్యమును జగజ్జేగీయమానముగా పరిపాలించినాఁడు. సామ్రాజ్యమును పాలించినాఁడుకాని ఆ చక్రవర్తి తుక్కాదేవిని పాలించలేదనియే చెప్పవలసిఉన్నది. ఆలన పాలన లేక ఆమె చాలకాలము అఘోరించుచు ఉండినది.

ఈ సందర్భమై వాడుకలో ఒకకథ కలదు:

"తన పతి కృష్ణరాయలతో కూర్చుకొనిన సంధికార్యము గజపతికాంతకు ఇష్టము లేకపోయినది. కాఁగా ఆమె తన కూఁతువలన కృష్ణరాయలను చంపింప తలఁచినది. పసిఁడియడిదమును చేయించినది. దానిని తుక్కాదేవి ఒడ్డాణమున భద్రపఱచి 'దీని సాయమున నీ మగనిని తుదముట్టింపుము' అని ఆమె కూఁతునకు దుర్బోధము చేసినది.

సోదరుని మరణము, తండ్రికి రాజ్యనష్టము- ఈ కష్టములకు కారణభూతుఁడయ్యె తనకు కాంతుఁడు ఐనవానిని మట్టుపెట్టుమని మాతృదేవి ఉపదేశము. ఆ యవస్థలో ఆ యుపదేశము ఆమెకు నచ్చినది.

నచ్చినదికాని ఆపనిని ఆమె నయముగ చేయలేకపోయినది, ప్రాణనాథునితో సరసాలాపసందర్భమున ఒకనాఁడు ఆమె తన దుష్టచేష్టితమును కొనసాఁగించుటకై ఒడ్డాణమును ఒక్కింత సడలించినది. పటకా సడలించు తొందరలో ఆమె చేయి కొంచెము వణఁకినది. అందుతో ఒడ్డాణము చిటాలున ఎగసి మీటుకొని కృష్ణదేవరాయల పాదములకడ పడినది. కట్యాభరణమున గుప్తపఱుపఁబడిఉన్న ఆయుధము బయటపడినది.

రాయలు ఆయుధమును చూచినాఁడు. ఆమె వదనమును చూచినాఁడు. అంతయు అతనికి అర్థమైనది. తోడనే అతఁడు ఆమెకు కర్నూలుమండలములోని నల్లమలకాంతార ప్రదేశమున ప్రవాసశిక్ష విధించినాఁడు.

తాను చేసిన కానిపనికి నిజముగా మరణశిక్ష పడవలసినది. కాని రాయలు కనికరమువహించి ప్రవాసశిక్షతో పోనిచ్చినాఁడు. అందుతో ఆమెకు రాయల మంచితనము మనస్సునకు పట్టినది.

కాంతారప్రదేశవాసాయాసమునకు ఆమె ధైర్యచిత్తముతో ఒడఁబడినది. తన నామమును వరదరాజేశ్వరిగా మార్చుకొనినది. తటాకనిర్మాణాదిధర్మకార్యములు కావించుచు ప్రజలకు ఎంతగనో ఉపకరించినది. నిరంతరము అన్నదానము చేయుచు అన్నపూర్ణ అను అన్వర్థనామధేయమును పొందినది.

తన దేవేరి హృదయపరివర్తనమును కొంతకాలమునకు కృష్ణదేవరాయలు గుర్తించినాఁడు. ఆమె ప్రజాహితతత్పరబుద్ధియు, ప్రియవాదిత్వమును పొల్తిపట్టినాఁడు. క్రమక్రమముగా అతనికి ఆమెపట్ల సుముఖభావము కలుగుచు వచ్చినది.''

ఈ గాథ ఎంతవఱకు సత్యమైనదో చెప్పుటకు తగిన ఆధారములు ఏమియు లేవు.

ఈ కథకు అనేకములగు చిలవలు పలవలు పుట్టినవి.

నల్లమల కాంతారప్రదేశమున ప్రవాసశిక్షను ఆమెకు కృష్ణరాయలు విధింపలేదఁట. అతఁడు ఆమెను సపరివారముగా కటకపురికి ప్రయాణముచేసి పంపించివేసినాఁడఁట. కాని ఆమె

పతిరాజ్యప్రదేశమును వీడనొల్లక తనకుఁదానే కర్నూలు మండలములోని నల్లమల కాంతార ప్రదేశమున వలసనెలకొన్నదఁట. వివాహకాలమున తనకు తండ్రిఇచ్చిన అపారధన సంపత్తిని ఆమె ప్రజోపయోగమునకై నీళ్ళప్రాయముగ వెచ్చించినదఁట. కంబము తటాకము ఆమె నిర్మాణమఁట.

ఇట్లే ఇంకొక కథకూడ ఆమెను గుఱించి వాడుకలో కలదు:

'ముక్కు తిమ్మనార్యుఁడు ఆమె అరణపుఁగవి. ఆమెకును కృష్ణరాయలకును ప్రణయకలహము కారణముగా రవరవలు పుట్టినవి. ఆ రవరవలు శమింపఁజేయుటకు తిమ్మన పారిజాతాపహరణము వ్రాసినాఁడు.'

ఈగాథ చారిత్రకముగా సమర్థింపరానిది. గజపతి ఆస్థానమునుండి కొందఱు కవులు కృష్ణరాయల ఆస్థానమునకు వచ్చిఉన్నారు. కాని ముక్కు తిమ్మన్న అట్టివాఁడు కాఁడు. పారిజాతాపహరణము రాయలు గజపతిని ఓడించి అతని కూఁతును చేపట్టకపూర్వమే రచింపఁబడినది.

అగుఁగాక! కృష్ణరాయల దాంపత్యజీవితములో ప్రణయకలహముల ప్రాబల్యము మూలముననో, మఱి ఇతరకారణముల మూలముననో ప్రియావియోగము ఉన్నట్లు కథలు ఉన్నవి. తన దాంపత్యజీవితకథతో సాదృశ్యనిబంధన కలది అగుటచేతనో, మఱియెందుచేతనో రాయలకు ఖండితనాయిక యగు సత్యభామగాథయందు కొంతహెచ్చుప్రీతి కదిరినట్లు ఊహింపనగుచున్నది. 'కావ్యగోష్ఠీప్రియుఁడై' పారిజాతాపహరణమున సత్యభామగాథను వినినట్లే అతఁడు 'కవితాప్రావీణ్యఫణీశుఁడై' సత్యావధూప్రీణనమున సత్యభామగాథను

వ్రాసినాఁడుకదా! (సత్యావధూప్రీణనమను గ్రంథమును తాను వ్రాసినట్లు రాయలు ఆముక్తమాల్యదలో తెలిపియున్నాఁడు.) సత్యామానిని గాథపట్ల రాయలు చూపిన ఈ వలపక్షము కేవలము యాదృచ్ఛికమే అగునా? లేక ఆతనికి భార్యతోనైన వియోగము మూలముగా కలిగిన మానసికభావపరంపర ఈ గాథపట్ల అతనికి అభిమానమును హత్తించినదిఅని అననగునా!

ఈ యూహాగానమును ఇఁక కట్టిపెట్టి అసలు విషయమును ఎత్తికొందము.

విజయి అగు కృష్ణదేవరాయలు ఓడిన రాజుకూఁతును మోహపడి వివాహమయ్యు ఆమెవలన సహచారిణీసుఖమును పొందఁజాలకపోయిన ఈ విషాదగాథ ఆర్ద్రహృదయులైన పలువురు అక్షరముఖులను ఆకర్షించినది. శ్రీ వంగూరి సుబ్బారావుగారు ఈగాథను 'ప్రభాతమ్ము' అను నవలగ పెంపొందించినారు. శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు 'వరదరాజేశ్వరి' అను శీర్షికతో భారతిలో (సంపుటి 7: సంచిక 1) ఈ వృత్తాంతమును కథగా రచియించినారు. శ్రీ చిరుమామిళ్ళ శివరామకృష్ణప్రసాదుగారు ఈగాథను 'రుచీదేవి' అను శీర్షికతో ఆంధ్రభూమి మూడవసంపుటములో రూపకముగా విపులపరచినారు. కవితాత్మ కల మఱియెందఱో ఈగాథను కావ్యవస్తువుగా స్వీకరించి ఉన్నారు.

ప్రాణేశ్వరునితో ఐన చిరవియోగవిచారముతో మనమెఱియుచుండిన స్థితిలో తుక్కాదేవి ఒకసారి అపదేశభంగిగా కృష్ణరాయలకు ఐదు శ్లోకములు పంపినది.

ఆ శ్లోకములు భృంగమును ఉద్దేశించి చెప్పఁబడినట్లుగా ఉండుటచేత భృంగపంచకమనియు, తుక్కాదేవిచే ప్రాచుర్య

బాహుళ్యమునందుటచే తుమ్మెదా పంచకమనియు వ్యవహరింపఁ బడుచు పండితప్రపంచమున ప్రఖ్యాతములై ఉన్నవి. వానిని పఠింపుఁడు:

చరన్వనాంతే నవమంజరీషు
నషట్పదో గంధఫలీ మజిఘ్రత్
సాకింనరమ్యా సచకింనరంతేః
బలీయసీ కేవల మీశ్వరాజ్ఞా!

అన్ని పూవులవాసన అంగీకరించు తుమ్మెద సంపంగిపూవుపై వాలకపోవుటకు బలవత్తరమైన ఈశ్వరాజ్ఞయే కారణము,

మా కింశుక ప్రకటయాత్మ నిమేషమాత్రం
మన్మస్తకే విహరతీతి మధువ్రతోయమ్
కిం మాలతీ విరహవేదనయా త్వదీయం
దృష్ట్వా ప్రసూనమచిరాదనలభ్రమేణ.

ఓ మోదుగుపువ్వమా! తుమ్మెద నీమీఁద వ్రాలినదని గర్వింపకుము. తనకు మాలతీపువ్వు అలభ్యముకాఁగా తత్సంబంధమైన విరహవేదనకు తాళఁజాలక ప్రాణము పరిత్యజించుకొనుటకు నీ ఎఱుపు అగ్నిగా భావించి తుమ్మెద నీమీఁద వ్రాలినది.

భ్రమర భ్రమతా దిగంతరాళే
క్వచితా స్వాదిత మీక్షితం శ్రుతంవా
వదసత్యమపాస్య పక్షపాతం
యదిజాతీకుసుమానుకారి పుష్పమ్.

ఓ తుమ్మెదా! నీవు అంతటను విహరించుచున్నావుకదా! జాజిపువ్వువంటి పువ్వు మఱియేదైన ఉన్నదేమో పక్షపాతము లేకుండ చెప్పుము.

కుసుమాని లిఖంతు నామ చిత్రే
కతి చిత్కారు విశేష యోధశిక్షాః

సురభిత్వమమూనికింలభంతే
కిము చైతేమధురసం పిబంతి భృంగాః.

చిత్రకారులు పువ్వులను చిత్రించుచున్నారు. కాని వారు వానికి వాసనను హత్తించఁగలరా? ఆ పువ్వులమీఁదకు రసాస్వాదన నిమిత్తము తుమ్మెదలు వచ్చునా?

కిం మాలతిం మా యసి మాం విహాయ
చుచుంబ తుంబీ కుసుమం షడంఘ్రిః
లోకే చతుర్భిశ్చరణైః పశుస్స్యాత్
షడ్భిరత్యర్థ పశుర్నకిం స్స్యాత్.

ఓ తుమ్మెదా! మాలతీకుసుమమునైన నన్ను వాడిపోవునట్లుగా రసాస్వాదనచేసి ఇప్పుడు గుమ్మిపూవుపైకి పోవుచున్నావేమి? లోకమునందు నాలుగుకాళ్ళ జంతువును పశువు అనుచున్నారు. నీకు ఆరుకాళ్ళు ఉన్నవి. కాఁబట్టి ఒకటిన్నరపశువుగా కనిపించుచున్నావు.

ఈ ఐదుశ్లోకములలో మొదటిదియు, మూడవదియు అతిశయమనోజ్ఞములు. ఈ శ్లోకములందు ఆమె తుమ్మెదలను సంబోధించుచు మగనిని ఎత్తిపొడిచినతీరు తీపారుచు గమనింపఁదగియున్నది.

'వనాంతరములందు నవనవప్రసవగుచ్ఛంబుల సంచరించు తేఁటి చంపకపుష్పముచెంతకు రాదు. అంతమాత్రమున చంపకపుష్పము సుగంధసంవాసితము కాదనఁగలమా? పుష్పంధయము రసికత్వము లేనిదనఁగలమా? ఈ వియోగము కేవలము ఈశ్వరాజ్ఞయే:' అనుభావముకల మొదటిశ్లోకము మూలమున ఆమె రాజుతోనైన తనవియోగమునకు, తనఅప్పటి అవస్థావిశేషమునకు ఈశ్వరాదేశమే కారణము అను సంగతిని

అన్యాపదేశమిషమున వెల్లడిచేసికొనినది.

అన్యాపదేశమిషముననే మూడవశ్లోకములో ఆమె ఆత్మ సౌభాగ్యప్రకటనమును ఇట్లు కావించుకొనినది. 'ఓ తుమ్మెదా! దిగంతరములయందు దివ్యపుష్పములపై పొలసాడు నీవు జాజి పూవునకు సాటియైన పువ్వును వేఱొకదానిని ఎందైన చూచి తివా? పొందితివా? లేక కనీసము అట్టిపూవునుగుఱించి విననైన వింటివా? పక్షపాతమును పరిత్యజించి సత్యము పలుకుము' అని ఆమె ముదలకించుచున్నది.

ఈ భృంగపంచకశ్లోకములు తుకా్కపంచకములుగా ప్రసిద్ధములు. అయినను ఇవి ఆమె రచించినవి కావు. ప్రాచీనకవుల రచనములనుండి ఏర్చి కూర్చినవి. ఇట్లనుటచే ఆమె కవయిత్రి కాదని తేలును. కవయిత్రి కాకపోయినమాత్రమున ఆమె విదుషి కాదని చెప్పుటకు వలనుపడదు.

ఈ ఐదుశ్లోకములలో రెండు వల్లభదేవుని సుభాషితా వళిలోను, మఱియొకటి ముకుళభట్టు అభిధావృత్తిమాతృక అను గ్రంథములోను ఉదాహరింపఁబడి యున్నవి. వల్లభదేవుఁడును, ముకుళభట్టును తుకా్కదేవికి శతాబ్దులు పూర్వులు. బహుద్రష్ట కావుట ఆమె ఈ శ్లోకములను సంకలనము చేసి ప్రకరణశుద్ధిగ పొదగి తనవైదుష్యమును ప్రకటించినది.

మదాలస చరిత్ర, సత్యావధూప్రీణనము, సకలకథా సారసంగ్రహము, జ్ఞానచింతామణి, రసమంజరి, జాంబవతీ కల్యాణనాటకము మున్నగు సంస్కృతకావ్యములను రచి యించినవాఁడును- ప్రతాపరుద్రగజపతి ఆస్థానమునుండి వచ్చిన లొల్ల లక్ష్మీధరుఁడు, లక్ష్మీనారాయణుఁడు మున్నగు సంస్కృత పండితులను పోషించినవాఁడును అగు కృష్ణరాయలు తుకా్క

దేవికి సంస్కృతసారస్వతమునఁగల ఈ పరిచయమునకు, ఈ సంకలనసామర్థ్యమునకు, ఈ బహుద్రష్టత్వమునకు, ఈ వైదుష్యమునకు ఎంతయో మెచ్చిఉండును.

మెచ్చిఉండుటయే కాదు ఆమీఁద ఆమెను తిరిగి రాయలు స్వీకరించినాఁడని లోఁగడ ఉదాహరించిఉన్న కథ చెప్పుచున్నది.

ఈ సందర్భమైన చరిత్ర ఎంతయో మఱుఁగుపడి ఉన్నది.

కృష్ణరాయలు అసలు గజపతి కూఁతును వివాహము కానే లేదనువారును కలరు.

ప్రతాపరుద్రగజపతిని పరాజితునిచేసి అతని సుతను కృష్ణరాయలు పెండ్లియాడి ఉండుట కుమారధూర్జటి కృష్ణరాయవిజయములోని క్రిందిపద్యమువలన రూఢము అగుచున్నది, ఈపద్యమునందలి విషయము గజపతి రాయలతో చెప్పినట్లు గ్రంథమున కలదు.

ఉ. నీ రణ మెందుఁ దీర్చుకొన నేర మదీయకుమారిఁ జారుశృం
గారమణిన్ గుణోన్మణిని గైకొను మిచ్చితి నీకుఁ గీరతు
క్షారసమానరూప! హిమకైరవబంధు యశః కలాప! ల
క్ష్మీరమణా! ప్రతాపనరసింహకుమార! కుమారవిక్రమా!

కృష్ణదేవరాయల మంత్రిమాణిక్యము ఐన తిమ్మరుసుకు మేనల్లుఁడును కొండవీటివిజయానంతరము కొండవీటిప్రాంతరాజ్యమునకు రాజప్రతినిధియు అగు నాదిండ్ల గోపన్న ప్రతాపరుద్రగజపతి కూఁతును కృష్ణదేవరాయలు పెండ్లాడెనని తాను రచించిన ప్రబోధచంద్రోదయవ్యాఖ్యాన పీఠికయందు క్రింది శ్లోకములో చెప్పుచున్నాఁడు:

ప్రతాపరుద్రస్య గజేశ్వరస్య
పుత్రీం పవిత్రీకృత భూతధాత్రీమ్

ప్రత్యగ్రహీద్యః ప్రకటప్రతాపో
భద్రాం సుభద్రామివ పాండవేయః.

ఇంతియేకాక కృష్ణరాయుల ఆస్థానమందు ఉండిన కుమారసరస్వతి అను ద్రావిడకవికూడ గజపతి కూఁతును రాయలు వివాహమగుట గ్రంథస్థము చేసియున్నాఁడు. ఆ ద్రావిడకవి వర్ణనమున కళింగరాజు ఆత్మజకును, అతని రాజ్యలక్ష్మికిని ఐక్యము కల్పింపఁబడి ఇరువురును కృష్ణదేవరాయలను పతిగా పరిగ్రహించినట్లు చమత్కారముగ చెప్పఁబడినది.

ఇట్లు ఒక ఆంధ్రప్రబంధము, ఒక సంస్కృతగ్రంథము, ఒక తమిళకావ్యము ఈ వివాహమును లేఖ్యాధారము చేయుచున్నవి.

ఈ నిదర్శనములకు తోడుగా అల్లసాని పెద్దనార్యుని చాటువు, విశ్వనాథనాయకుని స్థానాపతి వ్రాసిన రాయవాచకము, ఉత్కలచరిత్రముకూడ ఈ వివాహవిషయము నిశ్చయము అని నిరూపించుచున్నవి.

వివాహవిషయమునఁగల ఈ నిశ్చయభావము ఆమె నామవిషయమున కనిపించదు.

తుక్కాపంచకగాథనుపట్టి ఆమె నామము తుక్కాదేవి అని అనుకొనవలసి ఉన్నది తుక్కాదేవి అనునది కొంత వఱకు అపూర్వనామమే. తుకారాము, తుకోజీ మున్నగు సాదృశనామధారులు కొందఱు చరిత్రలో కనుపించుచున్నారు. అయినను గజపతిసుతనామము తుక్క అనుటకు గ్రంథస్థమైన ఆధారములు ఏమియు లేవు. కృష్ణరాయవిజయమునుండి ఎత్తి పైన ఉదాహరించిన పద్యములోని 'కీరతుక్ఖారసమానరూప!' అను పదమును దృష్టిలో ఇడుకొని కొందఱు ఒకరు కృష్ణ

రాయవిజయమున ఆమెనామము తుక్కాంబ అను స్ఫోరకము కలదనుచున్నారు. తెలిచగా ఈవాదము నిలవఁజాలనిది అగుట తెలిసివచ్చును. కీరతుక్కారసమానరూప అనగా చిలక రౌతు తో (మన్మథునితో) సమానమైన రూపముకలవాఁడా అని అర్థము. ఇది కృష్ణదేవరాయలనుగుఱించి గజపతి చేసిన సంబుద్ధి. దీనినిపట్టి గజపతిసుత నామము తుక్కాంబఅని కృష్ణరాయవిజయమున స్ఫోరకము కలదనుట పొసఁగుపాటులేనిది.

అగుచో ఇఁక ఆమెపేరు ఏమిటి అనుప్రశ్నము పొడసూపును. పైన ఉదాహరింపఁబడిన నాదిండ్ల గోపన్న శ్లోకమునుపట్టి ఆమె నామము భద్రయో, సుభద్రయో కాఁదగునని కొందఱు అనుచున్నారు. కాని శ్రీరంగస్వామిసరస్వతిగారు దీనికి ఒప్పుకొనక భారతిలో (1924. నవంబరు) ఇట్లు వ్రాయుచున్నారు: ‘నాదిండ్ల గోపన్న వ్యాఖ్యానశ్లోకమునందలి భద్రాం అను సుభద్రావిశేషణమును జూచి పొరపడి ప్రతాపరుద్రుని కూఁతురిపేరు భద్రయగునని వ్రాసిరి. అయిన నాశ్లోకమును జక్కఁగాఁ బరిశీలించిన నందామెపేరు లేదనియే స్పష్టమగును.’

శ్రీరంగస్వామిసరస్వతిగారి ఈవ్రాఁతను ఖండించుచు శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు భారతిలో (1925: జూన్) ఇట్లు వ్రాయుచున్నారు: ‘...అను శ్లోకమువలననే గజపతి కూఁతురు ‘తుక్కా’ కాదనియు భద్రాదేవియో లేక సుభద్రాదేవియో యని యేర్పడును. కళింగరాజులకుఁ గులదైవములు జగన్నాథములోని కృష్ణుఁడును, సుభద్రాదేవియుఁ గావున వారిబిడ్డలకు సుభద్రయని నామముంచుట యాశ్చర్యము కాదు. సరియైన యన్వయమును వదలి పేరుచెప్పక కవిపక్షపాతముగా ననుట యంత సమంజసము కాదు.’

శ్రీ రామకృష్ణకవిగారు ఇట్లు ఆమెనామము సుభద్ర అనునది కానగునని సూచించి తుక్కా నామము ఆమెకు దాదులో, విదూషకులో పెట్టిఉందురేమో అని ఊహించుచున్నారు.

రాయవాచకము ఆమెనామము జగన్మోహిని అనుచున్నది.

కన్నడగ్రంథము ఒకటి ఆమెనామము లక్ష్మీదేవమ్మ అనుచున్నది.

ఒక క్రైఫియత్తులో ఆమెపేరు 'లుఖ' అని కలదు. తూఖ అనుటకు ఇది వ్రాఁతకాని పొరపాటా?

మెకంజిస్థానికసంపుటములలోని చారిత్రక విషయములను కొన్నిటిని సంగ్రహముగ ఆంగ్లభాషలోనికి అనువదించిన శైలరు మున్నగు కొందఱు పాశ్చాత్యచరిత్రకారులు ఆమె నామమును రుచీదేవిగ పేర్కొనుచున్నారు.

ఆమె ప్రవాసకాలమున కరివరదునివలె ప్రజల అభీష్టములను తీర్చుచుండుటచేత ప్రజాసామాన్యమున వరదరాజేశ్వరి నామమును అందినది.

నిరతాన్నప్రదాత్రియై ఆమె అన్నపూర్ణ నామమును ఆర్జించుకొనినది.

అన్నపూర్ణాభిధానమును ఆర్జించుకొని ఆమె గుణోన్నతి అయిన తరువాత ఆమెను రాయలు తిరిగి చేపట్టినాఁడేమో అను అనుమానమును పొందుటకు గ్రంథస్థమైన ఆధారము ఒకటి కనిపించుచున్నది.

పారిజాతాపహరణమునందు, మనుచరిత్రమునందు కృష్ణదేవరాయలకు తిరుమలదేవి, చిన్నాదేవి అను ఇరువురుభార్యలు

కలరని కలదు. ఈరెండు ప్రబంధముల తరువాత రచియింపఁబడిన ఆముక్తమాల్యదయందు చిన్నాదేవిపేరు చెప్పఁబడక తిరుమలదేవి, అన్నపూర్ణాదేవి అనువారలు కృష్ణరాయల భార్యలుగా పేర్కొనఁబడినారు.

ఆముక్తమాల్యద కృష్ణదేవరాయల రచనముకదా! ఇందు పేర్కొనఁబడిన అన్నపూర్ణాదేవివిషయము ఏమి?, చిన్నాదేవికే అన్నపూర్ణాదేవి అనునది పర్యాయనామమా! లేక, తుక్కాదేవి గుణోన్నతయై అన్నపూర్ణాభిధానసంపాదనముతోఁబాటు భృంగపంచకప్రస్తావనమువలన వైదుష్యప్రాభవమును చూపి కృష్ణరాయల కూర్మిని కూర్చుకొని ఆముక్తమాల్యదలో లేఖ్యారూఢ ఐనదా?

అవునని కాని, కాదని కాని చేయెత్తి చెప్పలేము. చేయెత్తి చెప్పఁగలవిషయము ఒక్కటే ఉన్నది. అది ఆమె విదుషిఅగుట.

ఈ తెలుఁగువారి ఇంటికోడలు పేరు విషయమై అభిప్రాయభేదములు ఉన్నను విదుషిగా ఆమె పేరుకెక్కిన విషయమున అభిప్రాయభేదములు ఉండఁజాలవు, ఉండఁగూడదు.

'శతశ్లోకేన పండితః' అని ఆర్యోక్తి ఉన్నప్పటికిని శతశ్లోకములు ఎఱిఁగిఉండినంతమాత్రముననే పాండిత్యము ప్రతిష్ఠితము కాదు. సమయోపస్థితి ఎఱిఁగి వానిని సేకరించి చెప్పుటచేతనైన, వానిని సంకలనముచేసి చదువుటచేతనైన వైదుష్యము వెల్లడిఅగును. భృంగపంచకము మూలమున ఇట్టి వైదుష్యము తుక్కాదేవికి ఉండుట నిరూపితము అగుచున్నది. భృంగపంచకము తుక్కాపంచకమై తుక్కాదేవి వైదుష్యమునకు బూరగొమ్ముగా ఉన్నది.

౫

# తిరుమలాంబ

ఇంతవఱకు విజయనగరసామ్రాజ్యమునకు చెందిన ఇరువురు విదుషీమణుల జీవితములను తెలిసికొని ఉన్నాము. ఆ ఇరువురును గంగాదేవియు, తుకా్కదేవియు. ఇప్పుడు తెలిసికొనఁబోవునది విజయనగరసామ్రాజ్యమునకు చెందిన మఱియొక విదుషీమణి విషయము. ఆమె పేరు తిరుమలాంబ.

విజయనగరసామ్రాజ్యమునకు చెందిన మొదటి ఇరువురు విదుషీమణులలో మొదటిఆమె గంగాదేవి రాజవంశజుని దేవేరి; రెండవఆమె తుకా్కదేవి రాజ్యాధిపతిభార్య. మన ప్రస్తుతకథకు నాయకురాలైన తిరుమలాంబ- గంగాదేవివలె రాజకుమారుని దేవేరి కాక, తుకా్కదేవివలె రాజ్యాధిపతి రమణి కాక- సామాన్యురాలై ఉన్నది

అంతస్తున వారు రాణులు; ఈమె సామాన్యురాలు. అగుఁగాక! వైదుష్యసామ్రాజ్యమున వారితో ఈమె ఈడు రాఁగలదని చెప్పనగును.

మధురావిజయమును రచియించి గంగాదేవియు; ప్రాక్తనకవిగ్రామణుల శ్లోకరాజములను ప్రసక్తానుప్రసక్తిగా ఎత్తిచూపి తన బహుద్రష్టత్వమును, సహృదయస్ఫూర్తిని పరువముగ ప్రదర్శించి తుకా్కదేవియు తమ వైదుష్యమును ప్రకటించినట్లు తిరుమలాంబ వరదాంబికాపరిణయము అను సంస్కృతకావ్యమును రచియించి తనవైదుష్యమును లోకమునకు చాటినది.

వరదాంబికాపరిణయము గద్యపద్యాత్మకమైన (చంపువు) కావ్యము. గంగాదేవి మధురావిజయమువలె ఇదికూడ చారిత్రకగ్రంథము. సమకాలికచారిత్రకాంశములను తెలిసికొనుటకు ఈ కావ్యము ఎంతయో ఉపయోగించుచున్నది.

కృష్ణదేవరాయలకు సవతితమ్ముఁడు, అతనితరువాత విజయనగరసామ్రాజ్యమును పాలించినవాఁడు అగు అచ్యుతరాయలకు వరదాంబిక అనుఆమె పట్టమహిషి. వరదాదేవి, వరదరాజమ్మ, వరదాజమ్మ అనునవి ఆమె పర్యాయాభిధానములు.

వరదాజమ్మ సలకరాజు కూఁతురు. అచ్యుతరాయల సచివులు, సేనాధిపతులు అగు సలకము పెద్ద, చిన తిరుమల దేవుల తోఁబుట్టువు. వరదాజమ్మకును, అచ్యుతరాయలకును జరిగిన వివాహము తిరమలాంబకావ్యమున ప్రధానవిషయము. అగుటనే ఆ కావ్యమునకు వరదాంబికాపరిణయము అను నామము ఈయఁబడినది.

అవసరసమయములలో రాజ్యపాలనమున జోక్యము కలిగించుకొనుటకు జంకి ఉండని విజయనగరరాజ్ఞీమణులలో వరదాజమ్మ ఒక తెగా కనిపించుచున్నది. విజయనగరము సమీపమున వరదాజమ్మపేట అను జనపదము ఈమె పేరిటనే నిర్మింపఁబడినది. కంబముతటాకము ఈమెనిర్మితమేమో అని కొందఱు చరిత్రకారులు ఊహించుచున్నారు. క్రీస్తుశకము 1532 లో ఈమెభర్త అచ్యుతరాయలతో, కుమారుఁడు వెంకటాద్రితో కంచి వరదరాజస్వామి ఆలయమున ముత్యాలతో తులాభారము తూఁగి భూరిదానములు చేసినది. పతి మరణానంతరము రాజ్యము తనపుత్రునకు స్థిరపడుటకై బీజపురమునందలి ఇబ్రహీమ్ ఆదిల్‌షాతో రాయబారములు నెఱపినది.

ఇట్లు ప్రజ్ఞామతి, తటాకనిర్మాత్రి, దాత్రి, గ్రామస్థాపకురాలు ఐ కీర్తికెక్కిన విజయనగరరాజ్ఞి వరదాంబిక పరిణయాదికములైన జీవితప్రారంభవిషయములను ప్రస్తరించు వరదాంబికాపరిణయరచనము స్త్రీ చేతులలో సాఁగిఉండుట ఒక విశేషముగా పరిగణింపక తీరదు.

అట్టి విశేషవిషయమునకు తావలమైన విదుషీమణి తిరుమలాంబ వరదాంబికాపరిణయకావ్యగద్యమున తన్నుగుఱించి ఇట్లు చెప్పుకొన్నది:

"ఇత్యేకవాదాకర్ణనమాత్ర దృఢావధారిత నవ్యకావ్య... నాటకాలంకార పురాణాగమ రహస్యసారస్యానుబంధ సమింధన స్వాభావిక ప్రతిభానుభావయా; విద్యావిశేష నిరవద్య విద్వద్వర సకల కవికుల శ్రవణానంద చింతితానంతాభీష్టఫలా శ్రయణ విశ్రాణ కామగవీభవదశేషభాషా విషయా, సవిశేషోన్మేష, చతురిమగర్భిత, సరసప్రబంధ సందర్భయా; వివిధవిద్యా ప్రగల్భ రాజాధిరాజాచ్యుతరాయ సార్వభౌమప్రేమ... సర్వస్వ విశ్వాస భువా, నిరుపాధికతా మహోపకార నిర్మాణధర్మ నిర్మలహృదయయా; నిఖిల లిపివిలేఖన, నియత వితరణ కృతకస్త హస్తారవిందయా; విరించి చంచలనయనానఖాంచల, సముదంచిత విపంచీప్రపంచిత పంచమ మధురిమోదంచన వికస్వర కంఠస్వరయా; విపులాతులాతుల వినోద వినోద సాకారావతీర్ణ శతపత్రాసన వరవర్ణినీ మతనిర్మాయికయా; నానాదేశ ప్రతిష్ఠితా, విరచిత వాజపేయ పౌండరీక సర్వతోముఖ మహాధ్వర ద్విజవర, వితీర్యమాణాశీర్విశేషపరితోషిత, భాగ్యసౌభాగ్యయా; నియతతత్కృత(?)... కవికుటుంబయా; తిరుమలాంబయా నిర్మిత వరదాంబికాపరిణయం నామ చంపూకావ్య మాచంద్రార్క మభివర్ధతామ్."

ఈ గద్యమువలన ఆమెనుగుఱించి క్రింది విశేషములు తెలియనగుచున్నవి:

> ఒకపర్యాయము వినినంతనె నవ్యకావ్యములను అవగాహనము చేసికొనఁగలది. నాటకాలంకార పురాణాగమ రహస్యములందు అనుభవముకలది. విద్వద్వరులయిన కవులను పోషించుటయందు ఉత్సాహముకలది. సరసప్రబంధములు కూర్పఁగలది. అనేకవిద్య లందు ఆరితేరినవాఁడును, రాజాధిరాజును ఐన అచ్యుతదేవరా యల ప్రేమను సమస్తవిషయములందును పొందినది. ధర్మనిర్మల హృదయముకలది. అనేక లిపులు వ్రాయుటయందు సిద్ధహస్తము కలది. వీణానాదమువలె వినసొంపగు కంఠస్వరముకలది. భూ లోకసరస్వతి అనఁదగినది. వాజపేయ పౌండరీకాది యాగములు చేసి సోమయాజులైన ద్విజవరుల ఆశీర్వాదములను అందినది.

చారిత్రకదృష్టితో కాక కేవలము కావ్యదృష్టితో చూచి నచో వరదాంబికాపరిణయము మధురావిజయమునకు తీసిపోవు చున్నదని ఒప్పుకొనక తప్పదు. కావ్యనామము వరదాంబికా పరిణము అని. కాని కావ్యమున వరదాంబిక భర్తఅగు అచ్యుతరాయల తాతతండ్రుల వీరవిక్రమములు విపులీకృతము లైనవి. అంతియకాదు. వరదాంబిక పరిణయముతో ఐనను కావ్యము పర్యవసితము అగుటలేదు. పరిణయానంతరము అచ్యుతరాయలు, వరదాంబిక దాంపత్యధర్మమును అవలంబించి వెంకటాద్రి అను పుత్రునిబడసి అతఁడు పెరిగి పెద్దవాఁడు అగు వఱకు కావ్యకథ నడుచుచున్నది.

కావ్యమున* అచ్యుతుని వంశవర్ణనము విపులముగ కలదు. చంద్రవంశమున తిమ్మరాజు పుట్టువుపొందినాఁడు. అతనిభార్య దేవకి. వారికుమారుఁడు ఈశ్వరరాజు. ఈశ్వర

రాజు బుక్కమ్మను వివాహమై నరసరాజును పడసినాఁడు. నరసరాజు యుద్ధాదికముల వర్ణన విస్తరించి కలదు. వీరవిక్రమములు నెఱపి అతఁడు విద్యానగరమునకు తిరిగివచ్చి ఓబమాంబను వివాహమగును. నరసరాజువలన ఓబమాంబకు పుట్టినవాఁడు అచ్యుతరాయలు. [నరసరాజు అంతకుపూర్వము పరిణయమాడిన తిప్పాంబ (వీరనరసింహముతల్లి), నాగమాంబ (కృష్ణదేవరాయల తల్లి)ల ఉదంతము ఈకావ్యమున పేర్కొనఁబడనేలేదు.] అచ్యుతరాయలు పెరిగి పెద్దవాఁడు ఐనపిమ్మటనే నరసరాజు మరణించినాఁడు. అచ్యుతుని యౌవనకాల విశేషములను వివరించినపిమ్మట తిరుమలాంబ వరదాంబికతో అతని వివాహమును వర్ణించుచున్నది. ఆ దంపతులకు వెంకటాద్రీశ్వరుని దయవలన ఒకకుమారుఁడు పుట్టినాఁడు. ఆ పుత్రునికి చినవెంకటాద్రి అనుపేరు పెట్టినారు. చినవెంకటాద్రి గుణగణములకు మెచ్చి అచ్యుతరాయలు అతనిని యౌవరాజ్యమునకు పట్టముకట్టినాఁడు. ఈ విషయములు అన్నియు చెప్పినమీఁదట తుదిని తిరుమలాంబ తనపోషకుఁడైన అచ్యుతరాయలను, అతని రాణి అయిన వరదాంబికను అరసి రక్షింపవలసినది అని వేంకటరమణమూర్తిని ప్రార్థించుచున్నది.

ఇది కావ్యవిషయసంగ్రహము. ఇఁక కావ్యమునందలి శైలి యున్నగునది తెలియుటకై నాలుగు శ్లోకములను పరామర్శించుకొందము.

అచ్యుతరాయల తండ్రిఅగు నరసరాజు మృతిని తిరుమలాంబ ఇట్లు చెప్పుచున్నది :

శ్లో. కాలాద్వహోరథమహీం విరహా సహిష్ణు
మాశ్వాసవ్యవశ్య నిజకాశ్వత కీర్తిమూర్త్యా

నానాగుణ శ్రవణ కౌతుకినాం గుణానాం
నాథేన సఖ్య మభజన్నరసక్షితీశః,

చిరకాలమునుండియు భూకాంతావిరహమును సహింపలేకుండిన ఆ నరసరాజు భూకాంతను నూతనమును, శాశ్వతమును అగు తన కీర్తిమూర్తిచే ఓదార్చి తనవిశేషమైన గుణములను వినుటయందు ఆసక్తిగల పరమేశ్వరునితో సఖ్యము చేసెను.

అచ్యుతరాయలు వరదాంబికను పెండ్లాడిన విషయమున కవయిత్రి ఇట్లు కథించుచున్నది.

శ్లో. ప్రవిశ్య తస్మిన్ ప్రమనా నృపాలః
తాం రాజకన్యాం విధినోపయేమ్య
శ్రియం పయోధేరివ శేషశాయీ
సమానయత్తాం సదనం స్వకీయమ్.

సంతోషముగు మనముతో ఆ యచ్యుతరాయలు ఆ రాజనగరము ప్రవేశించి భగవంతుఁడగు ఆ విష్ణుమూర్తి క్షీరసాగరకన్య అగు లక్ష్మినివలె శాస్త్రోక్తముగా వివాహమాడి తనగృహమునకు వెళ్ళెను.

'(శ్రీ)వేంకటాద్రిపతి సేవన పుణ్యపాకమున' వరదాంబికకును, అచ్యుతరాయలకును పుట్టిన పుత్రుని నామకరణ విషయమై తిరుమలాంబ ఇట్లు వర్ణించుచున్నది:

శ్లో. శ్రీ వేంకటాద్రీశ వరప్రసాదాత్
జాతం కుమారం జగతీసుధాంశుః
అముం హరేరంశభవం విధిత్వా
నామ్నా వ్యతానీత్ చినవేంకటాద్రిమ్.

ఆ భూలోకచంద్రుఁడగు అచ్యుతరాయలు శ్రీవేంకటాద్రీశ్వరుని అనుగ్రహమువలనఁ బుట్టిన తనపుత్రుఁడు శ్రీవేంకటేశ్వరాంశ సంభూతుఁడని తెలిసికొని తదనురూపముగు చినవేంకటాద్రి యను పేరును పెట్టెను.

ఇఁక ఆశీర్వాదపూర్వకమైన వేంకటేశ్వర ప్రార్థన శ్లోకమును పరికింపుడు.

శ్లో. అత్యాదరాత్ అచ్యుతదేవరాయం
వరేణ్యశీలాం వరదాంబికాంశ్చ
శ్రేయోనిధించ చినవేంకటాద్రిం
శ్రీవేంకటేశ శ్చిరకాల మవ్యాత్.

అచ్యుతదేవరాయలవారిని, సత్స్వభావముగల వరదాంబికను, శుభములకు ఆకరుఁడయిన చినవెంకటాద్రిని అతిప్రేమతో శ్రీవేంకటాద్రీశ్వరుఁడు చిరకాలము రక్షించునుగాక!

ఈ శ్లోకమునుపట్టి చూడఁగా ఈ కావ్యరచనా కాలము నాఁటికి అచ్యుతరాయలు విజయనగరసింహాసనమును పొందనట్లు ఊహింపనగుచున్నది. కృష్ణదేవరాయలు 1530 వ సంవత్సరమునకదా చనిపోయినది. అతని మరణానంతరము అచ్యుతరాయలు రాజు ఐనాడు. అచ్యుతరాయలు రాజు కాకపూర్వమే అనఁగా కృష్ణరాయలు గాకుండగనే (1530-వ సంవత్సరమునకు పూర్వమే) తిరుమలాంబ వరదాంబికాపరిణయమును రచియించి ఉండును.

గద్యమునందలి కొన్ని పదములనుపట్టి తిరుమలాంబ అచ్యుతరాయల ప్రేమకు పాత్రురాలై అతని అంతఃపురమున చనవుకలిగి మెలఁగినదని ఊహింపనగుచున్నది. ఆమె అచ్యుతరాయల అర్ధాంగులలో ఒకతె అని కొందఱు చెప్పుచున్నారు. ఈ విషయమును పరమప్రామాణ్యముగా చేకొనలేము. అగుఁగాక! సన్నిధినుండి చెప్పినవగుట వరదాంబికాపరిణయములోని చారిత్రకాంశములు మాత్రము హెచ్చుప్రామాణ్యమును సంతరించుకొనుచున్నవి

క్రీ. శ. 1527-వ సంవత్సరప్రాంతమున సువర్ణమేరు దానసందర్భమున వీరప్రతాప అచ్యుతదేవమహారాజు హంపిలోని విఠలస్వామి దక్షిణగోపురద్వారముచెంత వేయించిన శాసనము ఒకటి ఉన్నది. ఆశాసనము సంస్కృత కర్ణాటభాషలందు కలదు. అందలి ఒక సంస్కృతశ్లోకము ఓదువ తిరుమలమ్మ రచించినట్లు చెప్పబడినది.

ఓదువ కర్ణాటపదము. ఆ పదమునకు విద్యార్థి అని అర్థము. అంతిపురమున పురాణాదుల చదువుచుండునది కావుట తిరుమలాంబ ఓదువతిరుమలాంబ ఐనది. మైసూరురాజు చిక్కదేవరాయలవద్ద సంచిపట్టుచుండిన కారణమున కర్ణాటక కవయిత్రి హొన్నమ్మ సంచి హొన్నమ్మగా ప్రసిద్ధమై ఉండుట మనము ఈసందర్భమున జ్ఞప్తికి తెచ్చుకొనవచ్చును.

నామసాదృశ్యమునుపట్టి వరదాంబికాపరిణయకావ్యకర్త్రి ఐన తిరుమలాంబయు, పయిశాసనపద్యకర్త్రిఐన తిరుమలమ్మయు ఒకరేకానగునని కొందఱు చరిత్రకారుల ఊహ. ఈ ఊహయే నిజమగుచో కర్ణాట శాసనసంబంధమును పట్టియు, కర్ణాటభాషాపదమైన 'ఓదువ' అనునది విశేషణముగ వాడబడుటను పట్టియు తిరుమలాంబకు కర్ణాటభాషాపరిచయము ఉండుట సూచితము కాఁగలదు.

పై విషయములనుపట్టి ఆమె ఒకవేళ కర్ణాటస్త్రీయేమో అను అనుమానమును కలుగవచ్చును. అట్టి అనుమానమునకు అడ్డుతగులఁగల విషయములు కొన్ని కలవు.

నాఁటి విజయనగరరాజులు పూర్తిగ తెనుఁగువారును, ఆంధ్రదేశస్థులఁైన వేంకటేశ్వరస్వామి భక్తులును ఐయుండిరి. నాఁటి ఆ రాజసంబంధులలో వేంకటేశ్వరస్వామి నిలయమైన

తిరుమలనామము స్త్రీపురుషులు విశేషముగ ధరించుచువచ్చిరి. ఇందుకు కొన్నినిదర్శనములు చూడనగును: కృష్ణదేవరాయల భార్యలలో ఒకఆమె పేరు తిరుమలదేవి; అతని కొడుకు పేరు తిరుమలదేవుఁడు; అతని కూఁతురు పేరు తిరుమలమ్మ. అచ్యుత రాయల భార్యలలో ఒకఆమె పేరు తిరుమలమ్మ. అతని బావలు తిరుమలదేవులు. అళియరామరాయల సోదరుఁడు తిరుమలుఁడు. వరదాంబికా కావ్యకర్త్రి అగు తిరుమలాంబిక నామమును, స్వర్ణమేరుదానశాసనకర్త్రి తిరుమలమ్మ నామమును ఇట్టి సంప్రదాయముతోడనే ఏర్పడి ఉండుట కాదనలేము.

విదుషీమణి ఓదువ తిరుమలాంబకు పూర్వోత్తరకాలము లందు విజయనగరసామ్రాజ్యసంబంధము కల ఆంధ్రమహాశయులు తిమ్మరసు, అళియ రామరాయల నామముల విషయమును మనము ఇక్కడ ఒకసారి తడవవలసి ఉండును. ఓదువ, అరసు, అళియ శబ్దములు కర్ణాటక భాషాపదములు.

ఓదువ అనఁగా చదువరి, అరసు అనఁగా రాజు, అళియ అనఁగా అల్లుఁడు. ప్రాంతీయమైన కర్ణాటభాషా ప్రాబల్యమునుబట్టి ఈ పదములు ఆయా నామములకు ఉట్టంకితములు ఐనవి.

ఈ యుట్టంకితములు జాతినిర్ణయమునకు సమర్థమైన సాధనములు కాఁజాలవు.

అరసు శబ్దము ఉండుటనుబట్టి తిమ్మరసును, అళియ శబ్దము ఉండుటనుబట్టి అళియరామరాయలును ఎట్లు కర్ణాటకులు కాఁజాలరో ఓదువశబ్దమునుబట్టి ఓదువతిరుమలాంబయు కర్ణాటజాతీయురాలు కాఁజాలదు.

అగుట ఇంకను ప్రబలమగు ఆధారములు అగపడిననే

తప్ప ఉన్న ఉపపత్తులతో తిరుమలాంబను కర్ణాటస్త్రీ అనుటకు అస్కారము ఆవంతయు లేదు.

ఇంతకును ఓదువశబ్ద పాఠమునుగురించి చరిత్రకారులలో అభిప్రాయభేదములు ఉన్నవి. ఆ శబ్దము ఓదువ కాక యు, ఓడూరు అగునను స్ఫోరకము కలుగునట్లుగా శాసన పాఠకులగు చరిత్రకారులు ఒకరిద్దరు వ్రాయుచున్నారు. ఈ పాఠము సరియగుచో ఓడూరు అనునది ఆమె గృహనామము కావచ్చునేమో!

ఓదువ తిరుమలమ్మయినను, ఓడూరు తిరుమలమ్మయినను ఆమె వరదాంబికాపరిణయకావ్యకర్త్రియగు తిరుమలాంబయే అని చెప్పుటకు ప్రబలమగు ఆధారము కనిపించదు.

ఈ పరిస్థితులలో వరదాంబికాపరిణయకావ్యకర్త్రియగు తిరుమలాంబ ఆంధ్రజాతిత్వవిషయమై అన్యథాభావము పొందుటకు వరిముల్లువాసికూడ వసువు కనిపించదు.

## ౬

# రామభద్రాంబ

ఆంధ్రభోజుఁడగు కృష్ణదేవరాయల అనంతరము తంజా పురమున ఆంధ్రనాయకరాజ్యము వెలసి విలసిల్లినది.

తంజనగరము రాజధానిగా చోళదేశమును పరిపాలించిన నాయకరాజులు ఆ పరభాషాప్రాంతమునకు తెలుఁగుదేశము నుండి మంత్రులను, దండనాథులను, పండితులను, కవులను, గాయకులను, వేశ్యలను ఇతర కళాకోవిదులను తీసికొనివెళ్ళి యుండిరి.

తంజాపురి ఆంధ్రనాయకరాజులలో రఘునాథభూపా లుఁడు సుప్రసిద్ధుఁడు; సుశ్లోకుఁడు. విశేషించి సంస్కృతాం ధ్రములందు కవనము చెప్పఁగల గొప్పపండితుఁడు.

వీనుమిగిలిన విద్యావినోదియగు అతని ఆస్థానమున సంగీతసాహిత్యములందు పేరుమ్రోగిన పండితులు అనేకులు ఉండిరి. వారిలో కొందఱుస్త్రీలు. అట్టి విదుషీమణులలో రామభద్రాంబ, మధురవాణి ముఖ్యులు. అందు ముందుగ రామభద్రాంబ గాథను తెలిసికొందము.

రామభద్రమ్మ వారాంగన అని ప్రతీతి.

రాజగోపాలవిలాసము మున్నగు పెక్కు ఆంధ్రకావ్య ములు రచియించిన చెంగల్వకాళయ అను పాకనాటి ఆర్వేల నియోగి బ్రాహ్మణపండితుఁడు ఈమె విద్యాగురువు.

గంగాదేవి తనభర్త వీరవిక్రమములను, విద్యావినోదములను కీర్తించుచు వీరకంపరాయచరిత్రను రచియించినట్లే రామభద్రమ్మ తనయేలికయగు రఘునాథరాయల వీరవిక్రమములను, విద్యావినోదములను కీర్తించుచు 'రఘునాథాభ్యుదయము' అను నామముతో సంస్కృతమున నొక కావ్యము వ్రాసెను. అది ద్వాదశసర్గములు కల మహాకావ్యము.

ఈ కావ్యమునందలి శ్లోకముల సంఖ్యనుగూర్చి, ఈ కావ్యమున వాడఁబడిన వృత్తములనుగూర్చి శ్రీ నిడదవోలు వేంకటరావు (ఎం.ఏ) గారు ఇట్లు వ్రాయుచున్నారు :

"ఇందులో తొమ్మిదివందల శ్లోకములు కలవు. తృతీయ, దశ, మైకాదశ సర్గాంతములలో శార్దూల, మాలిని వృత్తములు; ద్వాదశమున స్రగ్ధరయుఁ గలవు. తక్కిన భాగములయందెల్ల రఘువంశమువలె నొకేవృత్తము వాడఁబడినది."

ప్రథమసర్గమున రామభద్రాంబ రఘునాథరాయుల కవితాశక్తిని, స్త్రీ విద్యాప్రియత్వమును ఇట్లు వర్ణింపుచున్నది :

"చింతా సమస్యా శతమేకధైవ
తత్కీర్తి వార్తా నహి వర్ణనీయా
అశేష లోకాశయవృత్త భేద
ప్రస్తార విద్యాప్రథితస్య యస్య
అన్తఃపురాన్తర్హరిణేక్షణాసు
త్రిహాయణీ నామపి దీప్యమానాన్
విలోక్యవిద్యావిభవా నజస్రం
వశంవదాం యస్య వదంతి వాణీమ్."

అతఁడు క్షణమునకు నూఱు సమస్యలను పూర్తిచేయఁగల సమర్థుఁడు. అతనికీర్తి వర్ణింపరానిది. భిన్నభిన్నములైన లోకుల మన

స్తత్త్వములను పరిశీలించి తెలియఁగల నేర్పు కాఁడు. అతని యంతఃపురములోని మాతేండ్ల బాలికలుకూడ విద్యచే విభూషిత లై యుందురు. అందుచేతనే విద్యలదేవియైన సరస్వతియే అతనికి వశంవదయై యున్నదని చెప్పనగుట.

కవిరాజును, రాజకవియునగు రఘునాథరాయలను కవితలు చెప్పి మెప్పించుట సామాన్యమగు పనికాదు. అయినను కవిత్వముచెప్పి రఘునాథరాయలను మెప్పించుటకు ఆ విదుషీమణి దొరకొన్నది. ఈ పరిస్థితులలో ఆ మెమనము ఆందోళిత మగుట సహజము. కావుననే ఆమె కవితారచనమున తన ఏలిక, కవి, పండితుఁడు అగు రఘునాథరాయల సాయమును కృత్యాదిని ఇట్లు కోరుచున్నది :

"రసప్రధానాన్ రఘునాథ నేతుః
ప్రబంధ భేదాన్మమ భావ యంత్యాః
ప్రాజ్నిర్మితానేక కవిప్రబంధ
ప్రస్తావనాయాం ప్రభవేన్మతిః కిమ్.
శబ్దార్థయోర్మగ్మ సమప్రధానాం
వశంవదాం యస్య వదంతి సర్వే,
కృతీ స యేవాత్ర కృతౌ సహాయో
నాథో మమ శ్రీరఘునాథ నేతా ॥"

రఘునాథప్రభువు రచియించిన రసమే ముఖ్యముగా కలిగిన వివిధములైన ప్రబంధభేదములను చూచినటువంటి నాకు పూర్వము నిర్మింపఁబడిన వివిధములైన ప్రబంధప్రస్తావన కొఱకు బుద్ధి ఏల పుట్టును ? సమతాగుణప్రధానములైన శబ్దార్థములు ఎవనికి అధీనములై ఉన్నవని సర్వజనులు చెప్పుచున్నారో అట్టి నా నాథుఁడగు రఘునాథరాజే ఈ నా కావ్యమునకు సహాయభూతుఁడు. ఈ నా కావ్యము అతని పేరనే వెలసినది.

పై శ్లోకమున రామభద్రాంబ రఘునాథరాయలు తన నాథుఁడనుచున్నది. ఈసందర్భమున శ్రీ కురుగంటి సీతారామయ్యగారు వ్రాసిన క్రింది పంక్తులు చదువఁదగి ఉన్నవి :

'ఇందు నాథ శబ్దమున కర్థ మాయన తనకు భర్తయనియా? కాని తనకావ్యమందు ౧౧ సర్గయందు రఘునాథనాయకుని భార్యల పేర్కొనుచు తనను పేర్కొనియుండలేదు. అందుచే నీమె రఘునాథుని వివాహమాడినభార్య కాదేమో యని యూహింపఁదగియున్నది. మధురవాణివలెనే యీమెయు రఘునాథుని యుంపుడుకత్తెయేమోయని చదువరులకు తోఁచక మానదు. కాని యిట్లు నొక్కి చెప్పుట కెట్టి ప్రబలాధారమును లేదు. రాజునకు పెక్కురు భార్యలుండవచ్చును. ఈమె యెన్నికలేని భార్యగానుండవచ్చును. మఱియు పేరునకు తుది గల 'అంబ' యను శబ్ద మీమెభార్యయేయేమో యని సందలించుచున్నది. లేక ప్రతిస్త్రీనామము తుదినుండు 'అమ్మ' శబ్దమువంటిదియైకూడ నుండవచ్చును.'

వేశ్యాంగన అనియు, ఈమె రఘునాథరాయల యుంపుడుకత్తె అనియు ప్రతీతికలదు. తనకావ్యమున రఘునాథుని ఐదుగురు భార్యల పేర్కొని తన్ను పేర్కొనకపోవుటచేతను, పై శ్లోకమున రఘునాథుడు తననాథుఁడని చెప్పుటచేతను ఈమె ఆయన ఉపస్త్రీ కానగునని ఊహింపవచ్చును. ఉపస్త్రీ ఐనను విద్వాంసురాలగుట ఈమెను అతిగౌరవభావముతో ఆనాఁటి వారు చూచినట్లు కన్పట్టుచున్నది. రఘునాథరాయల కుమారుఁడు విజయరాఘవనాయకుఁడు ఈమెను 'రామభద్రమ్మవారు' అని గౌరవపూర్వకముగ పేర్కొనినాఁడు.

పై శ్లోకమువలన మఱియొక విషయము తెలియు

చున్నది. రఘునాథరాయలు గ్రంథరచనమున మధురవాణి నెట్లు సుశిక్షితగా నొనర్చెనో రామభద్రాంబనుకూడ నట్లె సుశిక్షితగా నొనర్చెను తనకావ్యమున నామె రఘునాథునే నాయకునిగాఁజేసి, ఆకావ్యమును ఆయనకే అంకితమిచ్చెను.

లక్ష్మీవిలాసమను నామముకల కొలువుకూటమున కొలువుతీరియుండఁగా ఇద్దఱు మాగధులువచ్చి రఘునాథ రాయల వంశాభివర్ణనము చేయుటతో రఘునాథాభ్యుదయ కావ్యవృత్తాంతము ప్రారంభమగుచున్నది.

> తతః సభాంతాం మగధౌ సమేత్య
> లక్ష్మీవిలాసాభిధయా లసంతీమ్
> వంశానుపూర్వీం వసుధాసుధాంశో
> రశంసతాం వాగ్భిరతి ప్రగల్భ్యమ్ ॥

లక్ష్మీవిలాసమను నభిధానముకల ఆతని కొలువుకూటమునకు ఇరువురు వందిమాగధులువచ్చి తెలివితో ఆరాజువంశవృత్తమును అభివర్ణింతురు.

వంశవృక్ష వివరణ ఐన తరువాత యువరాజుగా రఘునాథరాయలు నెఱపిన వీరవిక్రమములు వివరింపఁబడినవి.

పెనుగొండ రాజధానిగా విజయనగర సామ్రాజ్యమేలు చుండిన వేంకటపతిరాయలు పారశీకులతో (గోలకొండ నవాబులతో) చేసిన యుద్ధమున రఘునాథరాయలు విజయనగర రాజ్యపక్షము వహించి పారశీకులను పారఁద్రోలును. వేంకటపతిరాయలకు పెక్కుదుర్గములు, పెక్కుప్రదేశములు జయించి పెట్టును. వేంకటపతిరాయలతో చెప్పి తుండీరమండలాధిపతి కృష్ణప్పనాయకుని చెఱవిడిపించును; కృష్ణప్పనాయని సోదరిని వివాహమగును.

వీరవిక్రమములు నెఱపి వివాహితుఁడై తంజాపురికి తిరిగివచ్చిన రఘునాథరాయలను తిలకించి తండ్రి అచ్యుతప్ప నాయకుఁడు అనంతముగా సంతోషించును. ప్రాజ్ఞుఁడై యౌవరాజ్యపట్టాభిషిక్తుఁడై యున్న కుమారునకు సమస్త రాజ్యాధికారములు అప్పగించి అచ్యుతప్పనాయకుఁడు శ్రీరంగమునకు పోయి శ్రీరంగేశుని గొలుచును కాలము వెళ్ళఁ ద్రోయును

కొంత కాలమునకు పిమ్మట అచ్యుతప్పనాయకుఁడు శ్రీరంగమున కాలధర్మమునొందును. తంజనగరమున రఘునాథరాయలు ఆంధ్రనాయకరాజ్యమునకు పట్టాభిషిక్తుఁడగును.

అటుతరువాత ఆతనిరాజ్యములోని బ్రాహ్మణులు కొందఱువచ్చి చోలగుఁడనురాజు ప్రబలి పతిదేవతలైన పరవధువుల ఎందఱి మానములనో దినదినము భంగముచేయుచున్న తీరు చెప్పి ఆదుష్టుని శిక్షింపవలసిన ఆవశ్యకమును అతనికి వినిపింతురు.

ఇంతలో నేపాళ (జాఫ్నా) రాజువచ్చి తన్ను పరంగీల (బుడతకీచుల : పోర్చుగీసుల) బారినుండి కాపాడుమని కోరును.

ఆ తరుణముననే చంద్రగిరిలో రాజ్యవిక్రాంతి జరుగగా రాజద్రోహియగు జగ్గరాయలను జయించి అసలు రాజైన రామరాయలను సింహాసనమెక్కింపవలసిన బాధ్యత కూడ రఘునాథరాయలపైఁబడును.

అంతట రఘునాథరాయలు దిగ్విజయార్థము వెడలి చోలగుని శిక్షించి, పరంగీలను పారఁద్రోలి నేపాళమును (జాఫ్నాను) అసలు రాజునకు ఇప్పించి తోపూరు యుద్ధమున

జగ్గరాజును జయించి రామరాయలను చంద్రగిరి సింహాసనము మీఁద కూర్చుండఁ జేసి తంజనగరమునకు తిరిగి వచ్చెను.

రఘునాథరాయల ఈ పరాక్రమములను రసోదంచితముగ వర్ణించి ఆమీఁద రామభద్రాంబ ఆతని విద్యావినోదములను వివరించుచున్నది.

రఘునాథాభ్యుదయమున ఏకాదశ ద్వాదశ సర్గములందు రామభద్రాంబ తన యేలిక విద్యావినోదములను వివరముగ వర్ణించి యున్నది. తిలకింపుఁడు.

రఘునాథుఁడు రణరంగమునుండి విజయలక్ష్మీపాణి గ్రహణ మొనరించి వచ్చినపిదప తంజపుర మహిళలందఱు అగరు, ధూప, పుష్పాదులతో అతనిని గౌరవింప నతఁడు ప్రకాశమానుఁడై యొప్పెను.

సుగంధి మాదాశ్రిత సూనమాలికా
వలీమిలిందారవ వన్ది నిస్వనః
విశామధీశో విజయోత్తరం తతః
ప్రమోదమానో భవనం సమాసదత్.

శిరోజములందలి పుష్పమాలికావళిలోని మిళిందముల రవమును, వందిజననిస్వనమును చేరి తనవిజయమును ప్రస్తుతించుచుండఁగా ప్రమోదమానుఁడై రాజు భవనము చేరెను.

మహీభుజాం తన్మణిజాలకాంతికే
సహస్రధా మూర్తి యతీవ శారదా
అశేష విద్యావిభవాభి లక్షితాః
సహర్ష మైక్ష్యంతి సరోజలోచనాః.

మూర్తిభవించిన సరస్వతులును, అశేషవిద్యావిభవాభిలక్షితలును వి ఆ భవనమునందు ఆసీనురాండ్రై యున్న విదుషీమణులు ఆ మహీపాలుని సహర్షముగా సమీక్షణ చేసిరి.

అటుపిమ్మట ఆ మహారాజు ఆ విదుషీమణుల సదస్సులో జరిపిన విద్యావినోదములను రామభద్రాంబ ఇట్లు వివరించుచున్నది.

"తతస్స తాసాం ధరణీపురందరః
చతుర్విధోద్దామ కవిత్వచాతురీమ్
అశేషభాషానుగుణ ప్రపంచిత
ప్రబంధ సందర్భ విశేషపాటవమ్.

సమప్రధానం శతలేఖినీ సమ
ప్రక్లృప్త నానావిధ పద్యపూరణమ్
సలీల జాగ్రద్ఘటికా శతోచిత
క్రమాష్టభాషా కవితా విజృంభణమ్.

కవిప్రణీతాఖిల కావ్యనాటక
ప్రబంధ తత్త్వప్రతిపాదనక్రమమ్
కర్ణాటదేశాదిమ కల్పిత శ్రుత
ప్రగల్భ గూఢార్థ వివాదపాటవమ్.

సుధారసస్యంది సుగీతి చాతురీ
ప్రవీణ వీణాప్రతిమానవాదనమ్
స్వరానుకూల స్వరమండలక్రమం
స్వతానమానాంచిత కిన్నరస్వనమ్.

అనేకధారావణహస్త పూర్వక
ప్రసిద్ధయంత్ర స్వనరక్తిపాటవమ్
యథాక్రమ ప్రాపంచిత మధ్యరాగ స
త్పదాద్యపద్య ద్విపద ప్రపంచనమ్.
పరీక్ష్యసమ్యక్ ప్రతిబోధ్యచాధికం
విశేష మూర్వీవిభు రత్యుదారధీః ॥"

అనంతరము అతఁడు తన ఆస్థానమున ఉన్న విదుషీమణుల ప్రజ్ఞాపాండిత్యములను పరిశీలించుటకు దొరకొనెను.

ఆ విదుషీమణులు వివిధ భాషలను నేర్చినవారు; చిత్ర, బంధ, గర్భ, ఆశువులు అను చతుర్విధకవిత్వములను చెప్పఁగల చతురలు; శతలేఖినీ విద్యయందును, సమస్యాపూరణమునందును ప్రవీణలు; గంటకు నూఱుపద్యములను రచియింపఁగల ప్రోఢలు; సంస్కృతమునందును, తెలుఁగునందును, మిగిలిన ప్రాకృతభాష లాఱింటియందును కవితల్లఁగల సమర్థలు; సుప్రసిద్ధ కవిపుంగవులు రచియించిన కావ్యనాటకములకు సునాయాసముగ అర్థమును విడఁదీయఁగల విద్వాంసురాండ్రు.

ఒక్క సాహిత్యజ్ఞానముననే కాక వారు సంగీతజ్ఞానమునకూడ కడుదిట్టలు. దేశీ కర్ణాట రాగరహస్యములు వారికి హృత్కవిలలు. వీణ, రావణహస్తము మొదలగువాని సాయమున వారు మృదుమధుర గాన మొనర్పఁగల నేర్పరులు.

సంగీతసాహిత్యములందలి ఈ విదుషీమణుల పాండిత్యమును పరీక్షించి రఘునాథరాయలు వీరికి కనకాభిషేకము చేసెను.''

కావ్యగీతి ప్రియుఁడైన రఘునాథరాయల లలితాకళాగోష్ఠిని వివరించు ఈఘట్టమునఁదలి నాఱిరెండు శ్లోకములను పరికింపుఁడు :

ప్రభోః పురస్తాత్ప్రసవాంజలిః పరా
సమర్ప్య నాట్యముఖే సవిభ్రమమ్
అనేక విద్యార్చిత మాత్మనాయకం
నివేదయంతీవ నితంబినీ మణిః.

నాట్యారంభమున ప్రభువు ఎదుట ఒక స్త్రీరత్నము విభ్రమముతో పుష్పాంజలిని పూని అనేకవిద్యలచే సేవింపబడిన ఆత్మనాయకునికి నివేదించుదానివలె సమర్పించెను.

విలాసినీ లాస్యవిలాస లాలనమ్
మృదంగసంగీత నినాదమేదురమ్
అథేందిరా మందిర మాసదన్ముదా
మహీశ్వరః సంతత మంగలాస్పదమ్.

విలాసినుల లాస్యవిన్యాసశోభితము, మృదంగసంగీతాది శబ్ద ముఖరితము, సతతమంగళాస్పదము, ఇందిరామందిరము ఐన భవనము మహారాజు సంతోషముతో ప్రవేశించెను.

రామభద్రాంబ చేసిన ఈ వర్ణనమువలన రఘునాథరాయల ఆస్థానమున సంగీతసాహిత్యములందు అపరసరస్వతులు అనఁదగిన స్త్రీలు ఎందఱో ఉండి రాజుమన్ననలను పడయుచుండిరని తెలియుచున్నది.

నాఁటి స్త్రీల సంస్కారవైశిష్ట్యము, సంగీత విద్యాపాటవము, నృత్యవిశేషములు, రాగవిజ్ఞానము, నాటకరచనా సామర్థ్యము, విద్యావినోదములు తెలుపు ఈవర్ణనము చదువుటలో స్త్రీ విద్యాభిమానులకు ఒడలు పులకరించును.

రఘునాథాభ్యుదయమునందు ఈ విద్వాంసురాలి గద్య ఇట్లున్నది.

ఇతి శ్రీరామభద్ర కరుణాకటాక్ష లబ్ధసారస్వత ప్రవర్ధమాన శతలేఖినీ సమయలేఖినీ యాష్టభాషా కల్పిత చతుర్విధ కవితానుప్రాణిత సాహిత్య సామ్రాజ్య పదపీఠారూఢ రామభద్రాంబా విరచితే రఘునాథాభ్యుదయే మహాకావ్యే ద్వాదశస్సర్గస్సమాప్తః ॥

దీనినిబట్టి రామభద్రాంబనుగూర్చి ఈ క్రింది విషయములు తెలియుచున్నవి :

"శ్రీరామచంద్రమూర్తి కరుణాకటాక్షమున రామభద్రమ్మ కవిత్వము చెప్ప నేర్చినది. ఆమె శతలేఖినీ విద్యయందును, సమయ

లేఖినీ విద్యయందును చదురాలు. సంస్కృతము, ఆంధ్రము, ఆఱుప్రాకృతములు— ఈ ఎనిమిదిభాషలయందును చతుర్విధ (గర్భ, బంధ, చిత్ర, ఆశు) కవిత్వము చెప్పఁగల ప్రజ్ఞాధురీణ. అగుటచే ఆమె సాహిత్యసామ్రాజ్యపదపీఠారూఢ.”

ఈ గద్యమువలన ఈమె సంస్కృతాంధ్రాది అష్టవిధ భాషలయందు అభిజ్ఞురాలని తెలియుచున్నది. ఈమె సంస్కృత భాషావైదుష్యమునకు రఘునాథాభ్యుదయ కావ్యము అమోఘనిదర్శనము.

‘కొందఱు తంజావూరు కవులు’ అను గ్రంథమున శ్రీ కురుగంటి సీతారామయ్యగారు ఈమె కవిత్వమును గుఱించి యిట్లు వ్రాయుచున్నారు:

‘ఈమె రచించినకావ్యము చరిత్రాత్మకము. కాని కావ్యధోరణిలో వ్రాయఁబడినది. ...మధురవాణి కవిత్వముతో నీమె కవిత్వమును పోల్చినయెడల నీమెది కొంచెము లొంగునేమో కాని, యంతమాత్రమున నీమెను చులుకన చేయరాదు. ఒక్కొక్కచో నామెకు సాటియా యనికూడ ననిపించును. మధురవాణి రామకథను సరసవాక్యములతో చెప్పెను. రామకథ యెట్లుచెప్పినను శ్రోత్రపేయమే యగును. ఇతివృత్తమునందలి భక్తిభావముచే విషయవిమర్శకు మనము గడంగము. కాని రామభద్రాంబ రాజును నాయకునిగాఁ జేసి చదువరులు మెచ్చుకొనునట్లు రస ముప్పతిలఁజేసెను. చారిత్రక కావ్యమును వ్రాసి యీమె యొక నూతనమార్గమును త్రొక్కెను. నాయకరాజ్యచరిత్రమునకు గ్రంథస్థమైన పునాది వేయు గౌరవము ఈమెకుకూడ దక్కెను. ...రఘునాథుని జీవితములో నాయన చేసిన కార్యములను చెప్పుటలో నీమె

మిక్కిలి శక్తిని చూపెను. ఈయమ కవిత్వముకూడ ధారావాహికగా నడచుచు, నలంకారభూయిష్ఠమై యొప్పారుచుండును. కథాకథనములో నీమెకు శక్తిమెండు. విసిగించకుండ విషయముల నల్లుచుండును. యుద్ధాదులను వర్ణించు సందర్భమున స్త్రీయైనను మిక్కిలి ప్రజ్ఞచూపెను. ఈమె శైలి మనోరంజకమై నాతికఠినమై రసవంతముగ నున్నది... ఈమెకూడ మధురవాణివలెనే యాంధ్రయువతి యనితోఁచుచున్నది. ఈయమకూడ సమస్యాపూరణ సామర్థ్యమును, నవధానకరణ పటిమయు కల యువతియే యని విజయరాఘవనాయక రచిత 'రఘునాథాభ్యుదయ నాటకమున చెప్పఁబడియున్నది. మధురవాణియు నీయమకూడ విశిష్టాద్వైతమతమునం దభినివేశము కలవారైనట్లు కన్పట్టుచున్నది.'

ఈమె ఆంధ్రభాషావైదుష్యవిషయమై శ్రీ నిడదవోలు వెంకటరావు (ఎం.ఏ) గారు ఇట్లు వ్రాయుచున్నారు :

"తెలుఁగున నీమె కవిత్వము కానరాకపోయినను, సంస్కృతకవిత్వమం దీమె యతిప్రాసలు మొదలగు ఆంధ్రభాషాకవిత్వప్రత్యేకలక్షణములు పాటించుటచే నీమె తెలుఁగు కవయిత్రియని చెప్పనగును. ఎట్లనగా :

"కటాక్ష శాతా కరణా రసోన్నయే
నకేవలం తే నతతాపహారిణః
ప్రవర్ధయంతే ఫలభారసంగతః
సమస్త సంపత్ సవలీశ్చ సంతతమ్.

దళత్ప్రసూనాంకిత దామసౌరభీ
ర్మిళన్మిళిం దారవమేదురోదరామ్

సలీలలాస్యాక్రమ చంక్రమోచిత
......పరాగ భాసురామ్."

—ద్వాదశస్సర్గము,

పైన ఉదాహరింపఁబడిన మొదటి శ్లోకమున యతిని, రెండవ శ్లోకమున యతిప్రాసలను రెంటిని రామభద్రాంబ పాటించిఉన్నది. ఆంధ్రభాషాసంప్రయుక్తమగు విశ్రామాది నియమములు పాటించియుండుటనుబట్టి రామభద్రాంబ ఆంధ్ర భాషాకవయిత్రికూడ అని ఊహింపవచ్చును.

కేవలము ఇట్టిఊహ ఎందుకు? ఆమె కవితాగురువైన చెంగల్వ కాళకవి ఏమిచెప్పుచున్నాఁడో తిలకింపుఁడు. కాళకవి రఘునాథరాయల కాలమున ఉండిన కవయిత్రి రామభద్రాంబకును, రఘునాథరాయల పుత్రుఁడు విజయరాఘవనాయకుని కాలమున ఉండిన కవయిత్రి కృష్ణాజమ్మకును కవితాగురువు. కాళకవి వ్రాసిన రాజగోపాలవిలాసముయొక్క కృత్యాదిని ఆ కవి కవిత్వమును ప్రశంసించుచు విజయరాఘవనాయకుఁడు ఇట్లు చెప్పినాఁడు :

సీ. ఘటికా శతగ్రంథ ఘటనోత్కటనవీన
పాండిత్యగరిమలు భళియనంగ
నోష్ఠ్య నిరోష్ఠ్యాదికోద్దామ రసగర్భ
సందర్భమానని సన్నుతింప
మాకంద మంజరీ మధురుచీ మాధుర్య
రచనా విశేషమౌరా యనంగ
పరిహృతేతరయుక్తి భాగ నూతనకథా
చాతుర్యధుర్యత సన్నుతింప

గీ. అయ్యాదినముల రామభద్రాంబవారు
నేఁడు కృష్ణాజి కవితచే నేర్పుమెఱసి
కవితసేయుట లెల్ల మీ ఘనత కాదె
కవివినుతచర్య! చెంగల్వ కాళనార్య!

ఈపద్యము నడచిన ధోరణివల్లను, కేవలము ఆంధ్ర భాషాకవయిత్రియైన కృష్ణాజమ్మతో జతచేసి పేర్కొనఁబడుట వల్లను రామభద్రాంబ తెనుఁగునకూడ కవిత్వము చెప్పఁగలిగి యుండెడిదని సూచితము అగుచున్నది.

సూచితము అగుచుండునుగాక! ఆమె తెనుఁగురచనము లేవియు నేఁడు కానరావు.

రఘునాథాభ్యుదయ కావ్యగద్యమున రామభద్రాంబ తాను చతుర్విధకవిత్వములందు చదురాలనని చెప్పుకొని ఉన్నదికదా! చతుర్విధకవిత్వములలో ఒకటైన ఆశుకవిత్వమున ఈమె చెప్పినశ్లోక మొకటి నేఁటికిని నిలిచియున్నది.

రఘునాథనాయకుఁడు ఒకనాఁడు విలాసగోష్ఠిలో ఉండి రామభద్రాంబకు 'కింతే సంతానపాదపాయంతే' అను సమస్యను ఇచ్చినాఁడు. ఆసమస్యను వెంటనే రామభద్రాంబ అత్యాశువుగా ఇట్లు పూరించినది.

"కతి కతినః క్షితి పతయః
కింతే రఘునాథ నాయకాయన్తే
భువి బహవః కిలతరవః
కింతే సంతాన పాదపాయంతే,"

క్షితిపతులు ఎందరెందరో కలరు. ఐనను రఘునాథనాయకుని పోలినవారెవరున్నారు? ప్రపంచమున వృక్షములు పెక్కులున్నవి. ఐనను సంతానవృక్షము వంటిది ఏదొట్టున్నది?

ఆంధ్రస్త్రీల సంస్కృత వాగ్విలాసమును లోకమునకు చేకూర్చిన విదుషీమణులలో నొక తెయైన రామభద్రాంబ కవితాశైలి తెలియుటకై కొన్ని ఉదాహరణము లీయఁబడు చున్నవి :

ఈ కవయిత్రి కల్పనాచాతుర్యమునకు :

వేలాపథే తస్య విభోర్గజానాం
కర్ణానిలైః కేతక గర్భరేణుః
ప్రసారిత స్తత్రపయః పయోధిం
అకల్పయన్ తం లవణాంబురాశిమ్.

సముద్రతీర మార్గమున పోవుచున్న ఆ రఘునాథరాయల ఏనుఁగుల కర్ణానిలములచేత ప్రసారితములైన కేతకీగర్భరేణువులు పాలసముద్రమును లవణసముద్రముగాఁ జేసినవి.

ఈ రచయిత్రి యుద్ధవర్ణనాప్రాగల్భ్యమునకు :

అయోమయీభిర్గలికావళీభి
రహాంగశోణైరపి రోషశోణైః,
అవాకిరం స్త్వగ్నికణా న్విపక్షాః
భూపాలసైన్యేషు పురఃస్థితేషు,

తుపాకిగుండ్లతో, రోషముతో గూడిన ఎఱ్ఱని చూడ్కులతో శత్రువులు ఎదుట నిలచిన మహారాజు (రఘునాథుని) సైన్యములపై అగ్నికణములను వెదజల్లిరి.

ఈ కావ్యకర్త్రి కథాకథనపద్ధతికి :

"అతి ప్రగల్భై రథపారసీకైః
సమం ప్రవృత్తే సతిసాంపరాయే
కర్ణాటరక్షా కరణే నితాంతం
విచారవాన్ వేంకటదేవరాయః,

గంధాంధ భూమీధవ గంధనాగ
కంఠీరవం శౌర్యకథా నిదానం
రణే సహాయం రఘునాథదేవం
ఆయాచతోర్జ స్వల మచ్యుతేంద్రం.
గురోర్నిదేశా ద్గురు రాజ్యకార్య
నిర్వాహకో నీతి పరాధ్వనీనః
సామంతభూపాల శతానుయాతో
జయప్రయాణాయ సముద్యతోభూత్
గంధార్వణో ద్యన్మృదుగంధవాహైః
అధ్వశ్రమం సైన్యభరం హరంతీం
సమాసద చ్చంద్రగిరి ప్రతీతాం
పురీం నృపాలః పురుహూతకల్పః.”

అతి ప్రగల్భులైన పారశీకులతో (గోలుకొండ నవాబుసైన్యములతో) యుద్ధము హెచ్చుతగ్గులు లేకుండ సమముగా జరుగుచుండుటచేత వెంకటపతి దేవరాయలు కర్ణాటరాజ్య రక్షణ విషయమై విచారపరాధీను డయ్యెను.

శత్రురాజులను ఏనుఁగులకు సింహమైనవాఁడును, శౌర్యవిలసితుఁడును ఐన రఘునాథరాయలను రణమునకు సహాయునిగా అచ్యుతేంద్రుని (రఘునాథరాయల తండ్రిని) వేంకటపతి దేవరాయలు వేడెను.

రాజ్యకార్య నిర్వాహకుఁడు, నీతిమార్గమున చరించువాఁడు అగు రఘునాథరాయలు గురునిదేశమును పొంది సామంతరాజులతో కూడి జయప్రయాణమునకు ఉద్యమించెను.

సుగంధ సంవాసితములైన వాయువులు వీచుచు పథశ్రమమును పోకార్చుచుండఁగా ఇంద్రతుల్యుఁడైన రఘునాథుఁడు ససైన్య

ముగ చంద్రగిరి పట్టణమును (వేంకటపతిరాయల రాజధానిని) చేరెను.

ఆంధ్రకీర్తికి అభ్రంకషస్థానమును గూర్చిన మహారాజ వర్గమునకు చెందిన రఘునాథరాయలు బాల్యముదొట్టి ప్రౌఢ నిర్భరవయఃపరిపాకము ముట్టువఱకు నెఱపిన ఘనకార్యము లను కీర్తించు చరిత్రాత్మక సంస్కృత కావ్యమును రసోదంచి తముగ రచియించి రామభద్రాంబ ధన్యయైనది.

క్రీస్తుశకము 1640 ప్రాంతమున మరణించిన రఘు నాథరాయలకు సమకాలికురాలగుటచే ఈ ఆంధ్రవిదుషీమణి యిహలోకమును వీడి యిప్పటికి మూడువందల సంవత్సరము లకు పైగా నైనదని చెప్పనగును.

## ౭

# మధురవాణి

మధురవాణి వేశ్యాంగన అని ప్రసిద్ధి. రఘునాథాభ్యుదయ కావ్యకర్త్రియగు రామభద్రాంబకు ఈమె సమకాలికురాలు. ఆమెవలెనే ఈమెకూడ విద్యావినోది అగు తంజావూరి రఘునాథరాయల సంసద్భవనమును అలంకరించిన విదుషీమణి.

ధాత మార్గశీర్షపు 'భారతి' సంచికలో శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు వ్రాసిన క్రిందిపంక్తులు ఈ సందర్భమున చదువఁదగి యున్నవి.

"భోజ విక్రమార్కాదుల సభలందువలె నితని యాస్థానమునఁ బెక్కండ్రు స్త్రీలు సంగీతసాహిత్యనృత్యవిద్యలలోఁ బ్రౌఢిమ చూపుచుఁ బురుషప్రకాండులకు సమానముగా గోష్ఠీప్రసంగములఁ జొచ్చి కనకరత్నాభిషేక గౌరవముల వడసి సంస్కృతాంధ్రములఁ గావ్యసంతానము చేఁ దమ వంశకీర్తులఁ బవిత్రతరములుగాఁ జేసికొనిరి. వీరిలో మిన్నలని యెన్నఁదగిన యన్నులు రఘునాథచరిత్రము రచించిన రామభద్రాంబయు, రామాయణసారసంగ్రహము విరచించిన మధురవాణియుఁ గాఁదగుదురు. రామభద్రాంబ తాను రఘునాథుని దేవియని చెప్పుకొన్నదిగాని మధురవాణి రాజుతోఁ దనకుఁగల సంబంధబంధముల వర్ణించుకొన్నది కాదు."

సరసశ్లోకములు రచియించుటయందును, ధీవిశేషమునందును మధురవాణి ఆ రాజాస్థానమందలి విదుషీరత్నముల యందఱికంటెను అధికురాలై యుండెను. విద్యారసికుఁడగు రఘునాథనాయకుఁడు ఆమె వాఙ్మాధుర్యమునకు మెచ్చి ఆమెకు 'మధురవాణి' అని బిరుద మొసఁగెను.

మధురవాణి రచియించిన సంస్కృత రామాయణములోని క్రిందిశ్లోకము ఆ విషయమును తెలుపుచున్నది :

"చతుర మధురవాణీం
సమ్యగాకర్ణ్యయస్యా
స్సదసి మధురవాణీ
నామ దత్తం త్వయైవ
సరసకృతి విధాయాం
సాధుమేధా విశేషా
స్వధిక పటురశేషా
స్వాంబుజాక్షీషు సైషా.
[ప్రథమ సర్గః 90]

మధురవాణి అనునది బిరుదనామము. ఆమె అసలు పేరు ఏదియో తెలియరాదు. తాను రచించిన రామాయణ మహాకావ్యమునందంతటను ఆమె తన బిరుదనామమైన మధురవాణి అను అభిధేయమునే చెప్పుకొన్నది. కాని నిజనామమును పేర్కొనియుండలేదు.

మధురవాణి రామాయణమహాకావ్యము నేఁటివఱకు ముద్రితము కాలేదు. ఆ కావ్యపు తాళపత్రప్రతి ఒకటి నేఁడు బెంగుళూరికి చెందిన మల్లేశ్వరమునందలి వేదవేదాంతమందిర గ్రంథాలయమున కలదు.

ఆ తాళపత్రప్రతి తంజావూరైకూడ చాలరోజులు ఐనట్లున్నది. ఆసంస్కృతగ్రంథము తెనుగులిపిలో వ్రాయబడిఉన్నది.

ఇంతకును ఈప్రతి సమగ్రముగా లేదు. ఉపలబ్ధమై ఉన్నంతవఱకు ఈ పుస్తకమున పదునాలుగు సర్గలు పూర్తిగను, పదునేనవసర్గమున కొంతభాగమును కలవు. వరుసక్రమమున 115 తాళపత్రములు కలవు. ఇందు నడుమ నడుమ కొద్దిగా గ్రంథపాతములు కలవు. 13, 29, 30, 105 సంఖ్యలు కల తాళపత్రములు లేవు.

115-వ తాళపత్రమునకు తరువాత విశేషముగు గ్రంథపాతము అగుపడుచున్నది. 126, 129, 140 సంఖ్యలుకల తాళపత్రములు మూడుమాత్రమే 115-వ తాళపత్రమునకు పిమ్మట కనిపించుచున్నవి.

115-వ పుటతో సుందరకాండగాథ సమాప్తమైనది. హనుమత్ప్రునరాగమనమువఱకు గ్రంథము శిథిలముగాకుండనున్నదని శ్రీ కురుగంటి సీతారామయ్యగారు వ్రాయుచున్నారు. 126, 129, 140 సంఖ్యలుకల పుటలు చదివిచూడగా యుద్ధకాండగాథ ప్రస్తావితమై యుండుట తెలియవచ్చును.

ఇందువల్ల మధురవాణి రామాయణగాథను సమగ్రముగ రచించియున్నదనియే మనము ఊహింపవలసియున్నది.

ఉపలబ్ధమై ఉన్నంతవఱకు మధురవాణి రామాయణమున వివిధఛందములకు చెందిన పదునైదువందల శ్లోకములు కలవు.

ప్రథమ సర్గములోని అవతారికశ్లోకములలో (1-38) ఈ కవయిత్రి తనపోషకుడైన రఘునాథ భూపాలుని క్షేమము కోరుచు వివిధ దేవతాప్రార్థనము కావించినది.

అటుపిమ్మట మతిరాలుగు శ్లోకములలో (39, 40, 41, 42 సంఖ్యలుకలవి) ఆమె వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు, బాణుడు, మయూరుడు, మాఘుడు మున్నగు ప్రసిద్ధ సంస్కృతకవులను సంస్తుతించినది.

అమీాద (43, 44 సంఖ్యలుకల) రెండు శ్లోకములలో కుకవినింద చేసినది.

తరువాతి శ్లోకము అత్యంతప్రశంసనీయమైనది. తిలకింపుడు.

సజ్జ్ఞాన వతాం సర్వపథీన ధీభిః
సంశోధితా చేత్కవితా సభాయాం
కస్తూరికా చన్దన కుంకుమాద్యై
రువ్వర్తితాంగీ యువతీవదీవ్యేత్.

[ప్రథమ సర్గ. 45.]

పండితసభాముఖమున పరిశోధితమైన కావ్యము అలంకృతయైన సుందరాంగివలె ఒప్పారును.

స్త్రీచే కూర్పఁబడిన స్త్రీపరమైన ఇట్టి ఉపమలు సందర్భోచితములుకదా !

అటుపిమ్మట 46-వ సంఖ్యనుంచి 77-వ సంఖ్యకల ముప్పదిశ్లోకములలో మధురవాణి తనపోషకుఁడైన రఘునాథరాయలను అభివర్ణించినది; ఆతని సభయొక్క ఘనతనుకూర్చి, శోభనుకూర్చి వర్ణించినది. ఈ ముప్పదిశ్లోకములలో క్రింది ఎనిమిది శ్లోకములును ప్రత్యేకపఠనార్హములు :

యదన్తరావర్తిత వర్తనానాం
సీమన్తినీనాం శ్రమమాక్షిపన్తి

పర్యన్తయన్త్రి ప్రతిమాకరాగ్ర
ప్రకీర్ణజాతాః పవమానపోతాః.

[ప్రథమసర్గ. 51.]

ప్రాంతములందున్న యంత్రప్రతిమల కరాగ్రములయందలి వింజామరములనుండి పుట్టుచున్న పిల్లవాయువులు సభామధ్యమున నాట్యము చేయుచున్న ఆటకత్తెల శ్రమను పోఁగొట్టుచున్నవి.

హేమ్నా కృతం యత్ర మహాకటాహం
హిరణ్యగర్భాణ్డ మివ ప్రతిమః
తథా న చేత్ కిన్తు తదీయగర్భే
భూయాంసి నిత్యం భువనాని సన్తి.

[ప్రథమ సర్గ. 52.]

ఆ సభయందు నీరు ఉంచుటకు బంగారుగుండిగలను వాడిరి. ఆ గుండిగలను హిరణ్యగర్భాండములు (అనగా బ్రహ్మాండములు) అనవగును. అవి బ్రహ్మాండములు కాకపోయినచో వానియందు భువనములు (జలములు) ఎందుకు ఉండును?

మధ్యేమణీ భిత్త్యను బింబితం
స్వంమత్వా రమాం యత్ర వినన్తుకామా
కరే తదీయే కమలం తదానీమ
నీక్షమాణాత్ర పతే నతాంగీ.

[ప్రథమ సర్గ. 56.]

మణులతో నిర్మింపఁబడిన గోడలలో ప్రతిబింబించిన తనరూపమునే లక్ష్మీదేవిగా భ్రమించి మ్రొక్కుటకు చేతులెత్తి చేతులలో కమలములు లేకుండుట గుర్తించి ఆమె లక్ష్మీదేవి కాదని తెలిసికొని సుందరాంగి సిగ్గుపడెను.

బన్దీ కృతాయేన పరత్రతీశ మహా
మణీమందిర కీర్తికన్యాః

పరార్థ్యదన్తప్రతిమానిభేవస్తమ్భం
సమాలమ్బ్య చిరం వసన్తి.

[ప్రథమ సర్గ. 60.]

శత్రురాజుల మణిమందిరములలో నుండు కీర్తికన్యకలు ఈ రాజుచేత బందీకృతలై దంతపుబొమ్మలను మిషతో స్తంభమునాను కొని చిరకాలము నివసించుచున్నవి.

ముక్తశ్శుకో ముగ్ధ సువర్ణమూర్తి
ముపైతి రమ్భామితి భావగర్భమ్
యస్మిన్ వదన్తీ మపరాప్రగల్భా
విశాలనేత్రాం విదుషీతి వక్తి.

[ప్రథమ సర్గ. 62.]

విడిచిపెట్టిన చిలుక చూడనింపైన బంగారు అరటిచెట్టును పొందుచున్నదని భావగర్భముగా ఒకఆమె పలుకగా నామెను మఱియొక ప్రగల్భ నీవు విద్యాంసురాలవు అన్నది. (ముక్తుడైన శుకమహర్షి రంభను పొందెను అని భావార్థము.)

భద్రాసనం దన్తకృతం యదీయలక్ష్మ్యాశ్శ
వలీకాబ్జ మివాధిరూఢమ్
ప్రకాశయత్కాఞ్చనభవ్యకాంతిం
జనాక్షిభృఙ్గాన్ స్వవశీకరోతి.

[ప్రథమ సర్గ. 66.]

దంతములతో తయారుచేసిన సింహాసనము లక్ష్మీదేవి అధిష్ఠించిన పద్మమువలె బంగారుకాంతిని విరజిమ్ముచు జనుల కన్ను లనెడు తుమ్మెదలను తనవైపు త్రిప్పుకొనుచున్నది.

రంభాకృతం రమ్యమణీస్వహారసంగాః
ప్రాప్యలక్షం హాటికాకోటీమ్

సభూరితారోల్లసనం సదాయత్పటం
బలాకే ర్బహుధా అతిశేతే.
[ప్రథమ సర్గ. 73.]

శతాధిక రంభలతో, సహస్రాధిక మణులతో, శతసహస్రాధిక కామధేనువులతో, కోట్యధిక హరిణులతో రఘునాథరాయలసభ దేవేంద్రునిసభను మించియుండెను.

నిశమ్య దన్తాత్మ నిభద్రిపీఠే నిషణ్ణ
మస్మిన్ రఘునాథభూపమ్
తస్మిన్ జనం పుష్పక మాశ్రిత
మమన్యతాద్యం రఘునాథ మేవ.
[ప్రథమ సర్గ. 77.]

తనకు తగిన దంతపుసింహాసనమున కూర్చుండిన రఘునాథరాయలను చూచి అచటి జనము పుష్పకవిమానము నధిష్ఠించిన శ్రీరాముని గనే తలంచినది.

అటుతరువాత మధురవాణి తాను ఈసంస్కృతరామాయణము రచించుటకు కల కారణమును వివరించుచున్నది. ఈ గ్రంథము రచియింపఁబడుటకు కల కారణము, ఈ గ్రంథము రచియింపఁబడిన పరిస్థితియు మధురవాణి ఇట్లు వచింపుచున్నది :

ఒకనాఁడు రఘునాథభూపాలుఁడు సింహాసనముపై ఆసీనుఁడై కొలువుతీరి ఉండెను. అప్పుడు అతని చుట్టును ఆస్థాన విద్వాంసురాండ్రు పరివేష్టించి యుండిరి.

ఆ విదుషీమణులలో ఒకఆమె రఘునాథభూపాలుఁడు రచియించియున్న ఆంధ్రరామాయణములోని పద్యములను గానముచేసెను. అందుమీఁద మఱియొక విదుషీమణి శ్రీ

రామచంద్రమూర్తియందు రఘునాథభూపాలునకుకల అపూర్వ భక్తిశ్రద్ధలను అభినందించెను.

ఈ అభినందనముతో రఘునాథభూపాలుఁడు ఆలోచనాపరాధీనుఁడై తన చిత్తమును రామగాథలపై లగ్నము చేసెను. ఆ సమయమున ఆతఁడు తనలో తానిట్లు తలఁచెను:

హరేశ్చరిత్రం బహుతంత్ర రామ
 కథా సుధాకర్ణ రసాయనం నః
ఆస్వా ద్యమానాపి సహస్రవార
 మయా తయామైవ సుఖస్యదోగ్ధ్రి.
 [ప్రథమ సర్గ. 81.]

రసోత్తరం రామకథానుబంధి కావ్యం
 మయా కల్పిత మాన్ధ్రవాణ్యా
కార్యంకయా సంస్కృతవాగ్భిరేత
 దిత్యేవ చిత్తే గణయన్నవాసీత్.
 [ప్రథమ సర్గ. 83.]

విష్ణుగాథలు బహుళములై ఉన్నవి. వాని అన్నిటియందును రాముని గాథ నాకు అమృతప్రాయము, కర్ణరసాయనము అయి ఉండును. రామకథామృతము వేలకొలఁదిసారులు ఆస్వాదించినను అది నాకు ఎప్పటికప్పుడు సరిక్రొత్తయై అమందానందమును కలిగించుచుండును. స్వతంత్రముగా సంస్కృతాంధ్రములందు కవనము చెప్పి గ్రంథములు వ్రాయఁగల కోవిదురాండ్రు ఇక్కడ వందలకొలఁది సమావేశమై ఉన్నారు. వీరిలో నా ఆంధ్రరామాయణమును సంస్కృతములోనికి భాషాంతరీకరింపఁగల వారెవ్వరు?

ఇట్టి భావములతో రఘునాథభూపాలుఁడు నాఁటికి కొలువు చాలించి అంతిపురములోనికి పోయెను.

ఆనాఁటి రాత్రి అతనికి శ్రీరామచంద్రమూర్తి కలలో కనిపించి ఇట్లు చెప్పెను:

"నీ మనస్సున ఇప్పుడు ఉద్భవించియున్న భావమును నేను గ్రహించినాను. ఈ విషయమున నీవు ఎట్టి అలజడియు పొంద నక్కఱలేదు.

'మధురవాణి' బిరుదముతో నీవు మన్నించిన విదుషీ మణి నీ ఆస్థానమునందలి విద్వాంసులలో నెల్ల తలమానిక మని నమ్ముము. ఆమె నీవాంఛితార్థమును పరిపూర్తి నొందింపఁగలదు."

మఱునాఁడు సభ తిరిగి సమావేశమైనప్పుడు రఘునాథ భూపాలుఁడు మధురవాణిని తనవద్దకు పిలిపించినాఁడు. గత రాత్రి తనకువచ్చిన స్వప్నముసంగతి ఆమెకు చెప్పినాఁడు. పిండితార్థముగా ఇట్లు పలికినాఁడు :

అజహా దలంకృతిక్రమ
మనేక రసోల్లసితం
సరసపదార్థ సంగతి
సమగ్రగుణానుగుణం
రఘు రమణ ప్రబన్ధ
తిలకం రసికాభిమతం
సుదతి విధీయతా మితి
సుధీర గవీన్నృపతిః,

అలంకారయుక్తము, రసోదంచితము, మృదుమధురము ఐన శైలిలో సంస్కృతమున రామగాథను రచియింప ఆజ్ఞాపించి నాఁడు,

రాముని సర్వదా హృదయమున నిలుపుకొనిఉన్న

రఘునాథభూపాలుని సహాయసంపత్తితో తాను ఆకావ్యమును రచియింపఁగలుగుదునని మధురవాణి చెప్పినది.

తన సంస్కృతరామాయణకావ్యరచనాసందర్భమునకు కారణము ఇది అని మధురవాణి కావ్యమున స్పష్టముగ చెప్పుచున్నది.

ఈ విషయమునకు చిలవలు పలవలు పెట్టి జనులు ఒక కథను చెప్పెదరు. వినుటకు వినోదకరమై ఉండుటచే ఆకథ ఇచ్చట నివేదితము అగుచున్నది:

"ఒకనాఁడు రఘునాథరాయలు కొలువుతీరి విద్యావినోదములందు తేలుచుండెను. అప్పుడు ఆసభయందలి విదుషీమణులలో కొందఱు భక్తికీర్తనములను పాడఁదొడఁగిరి; మఱికొందఱు రామచరితము గానము చేయఁజొచ్చిరి.

రఘునాథరాయలు అఖండరామభక్తాగ్రేసరుఁడు. అతఁడు కుంభఘోణమున శిల్పము మెఱయ రామాలయమును నిర్మింపించెను. ఆ మహారాజునకు శ్రీరామచంద్రునియందుండు గాఢభక్తిని వివరించి వర్ణింపుచు తాను రచియించిన కావ్యమును ఒక విదుషీరత్నము అప్పుడు గానము చేయఁదొడఁగెను.

ఆ కావ్యమునందలి రామస్తోత్రము, రామగుణవర్ణనము అత్యంతమనోహరముగ ఉండెను. ఆ ఘట్టములను వినుచు సభ్యులును, రామభక్తుఁడగు మహారాజును ఆనందతన్మయులైరి.

ఆ కావ్యమును సమగ్రముగ ఆలించి సంతసించి రఘునాథ మహారాజు సభయందలి పండితబృందమును తిలకించి ఇట్లు వచించెను:

'శ్రీరామచంద్రమూర్తి పవిత్ర చరిత్రమును అనేకులు

అనేకపర్యాయములు అనేకరీతుల గానముచేయఁగా విని ఉన్నాను. కాని వానియందన్నిటను ఇట్టిదట్టిదని చెప్పరాని యేదియో ఒకలోపము చూపట్టుచునేయున్నది. అట్టి లోపము లేకుండ శ్రీరామచంద్రమూర్తి సుగుణపుంజములను కీర్తించుచు మీరెవ్వరైన రామాయణమును రచింపఁగలరా?'

ఇట్లు రాజువైచిన ప్రశ్నమునకు అచ్చటి పండితులును, పండితురాండ్రును బదులాడరైరి. సరససాహిత్యకళాభోజుఁడగు రఘునాథభూపాలుని మనసునకు ఎక్కునట్లు రామాయణమును రచింపఁగలమని చెప్పుటకు ఆ సభాస్థానమందలి విద్వాంసులును, విద్వాంసురాండ్రును సాహసింపలేక పోయిరి.

అగుటచే ఆ రాజచంద్రుఁడు విచారఖిన్నుఁడయ్యెను; వెంటనే సభచాలించి అంతిపురమునకు పోయెను.

ఆనాఁటి రాత్రి ఈ విషయమునుగూర్చి తీవ్రముగ ఆలోచించుచు రఘునాథరాయలు నిద్రించెను. అప్పుడు ఆతనికి శ్రీరామచంద్రమూర్తి స్వప్నమున కానుపించి ఇట్లు చెప్పెను:

'భక్తాగ్రణీ! విచారింపకుము. విద్యాపరదేవత అని చెప్పఁదగిన మధురవాణి నీయాస్థానమున ఉండఁగా నీవు ఈ విషయమై ఏల చింతించెదవు? ఆ కవయిత్రీమణి కవితాగానమునకు నేను మిక్కిలి ప్రియమందితిని. కావున రామాయణరచనాభారమును ఆ అపరసరస్వతి తలపై నిడుము. ఈ కార్యమును నిర్వహించి నీ మనోవైకల్యమును పాఁడ్రోలుటకు ఆమెయే తగినది.'

ఇట్లు చెప్పి శ్రీరామచంద్రమూర్తి పొడఁగానరాక చనియెను.

మఱునాఁడు వేగుటతోడనే ఆ రాజచంద్రుఁడు కబురు చేసి మధురవాణిని తనవద్దకు రప్పించెను. రప్పించి గతరాత్రి

తనకు కలిగిన స్వప్నవృత్తాంతము సమస్తమును ఆ విదుషీమణికి వివరించెను.

అది విని మధురవాణి ఇట్లు పలికెను :

'ప్రభువర్యా! శ్రీరామచంద్రమూర్తి ఆదేశమును, మీ ఆజ్ఞప్తిని మంత్రాక్షతలవలె శిరమున తాల్చుచున్నాను. సర్వసమర్థుఁడగు శ్రీరామచంద్రమూర్తి ఆశీర్వాదబలమును, సాహిత్యసముద్రులగు తమ సహాయసంపత్తియు నొంది నే నీకార్యమును నిర్వహించెదను.'

పిమ్మట మధురవాణి రామాయణమును సంస్కృతమున రచియించి తన యేలిక అగు రఘునాథరాయల మన్ననలను పొందెను.''

ఈ కథ చాలవఱకు కల్పితము అగుటలో సందేహము లేదు.

రఘునాథరాయలు తన ఇష్టదైవతమగు శ్రీరామచంద్రమూర్తి దివ్యచారిత్రమును ఆంధ్రభాషయందు రచియించి దానిని తన ఆస్థానమందలి విద్వాంసురాండ్రలో వినుతికెక్కిన మధురవాణిచేత సంస్కృతభాషలోనికి పరివర్తింపించి ఉండుటకు కల గ్రంథదృష్టాంతము మున్ముందు పేర్కొనఁబడియే ఉన్నది.

అగుటచే పైన వివరింపఁబడిన కథ చాలవఱకు కల్పితమనుట కాదనరాని విషయము అగుచున్నది.

రఘునాథరాయల ఆంధ్రరామాయణమునకు తన రామాయణము సంస్కృతీకరణమని మధురవాణి చెప్పుచున్నది. అయిన ఆమె సంస్కృతరామాయణమునకు మూలమగు రాయల తెనుఁగురామాయణము నేఁడు కానవచ్చుట లేదు.

ఈ సందర్భమున శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు వ్రాసిన క్రిందివాక్యములు ప్రత్యేకము గమనింపఁదగియున్నవి:

"మధురవాణి రఘునాథుని యాస్థానమున సమస్త విద్యాప్రసంగములఁ గలసికొని యతఁడు రచించిన రామాయణము పఠింపఁగా విని సంస్కృతమున రచించినట్లు చెప్పినది. కాని యతఁడు రచించిన రామాయణము మాకు లభించినంత పట్టు పరిశోధింపఁగా మధురవాణి రామాయణ సంగ్రహము దానికిఁ దెనిఁగింపు గాదని తోఁచెను. మధురవాణి కావ్యము సుందరకాండము వఱకు లభించును. అంతకు పదునాలుగు సర్గలు గలవు. రఘునాథుని బాలకాండములోని కొంతభాగము సైతము దానికంటెఁ బెద్దదిగా నున్నది. భావములు గలసినవి కావు. రఘునాథుఁడు చిత్రరచనపొంతపోక సరళముగాఁ బదములకుఁగాని, యతిప్రాసలకుఁగాని కష్టపడక మహావర్ణనల సైతము మృదుపదసందర్భముగా రచించుచున్నాఁడు. మధురవాణి యనేకస్థలములఁ గ్లిష్టరచనకు దిగును."

ఆంధ్రమాత్రకరామాయణమును గుఱించి శ్రీ కురుగంటి సీతారామయ్యగారు కూడ ఇట్టి అభిప్రాయమునే వెల్లడించుచున్నారు:

"ఈయమ భాషాంతరీకరించిన రామాయణ మేదియో తెలియరాకున్నది. తంజావూరు పుస్తకాలయమున రఘునాథుని రామాయణమును నొక తాళపత్రగ్రంథము కలదు. దాని యందు మూఁడాశ్వాసములు మాత్రము కలవు. మధురవాణి కావ్యముతో దీనిని పోల్చినయెడల నిదియే భాషాంతరీకరింపఁబడినట్లు తలంచుటకు వీలులేదు. ఏలన, తెనుఁగుగ్రంథము కంటె సంస్కృతకావ్యము ప్రౌఢతరముగా నున్నది."

ఈ రామాయణగ్రంథరచనాకారణసందర్భములను వివరించుటతో ప్రథమసర్గ ముగియుచున్నది. ద్వితీయ సర్గమున రామకథ ప్రారంభమగుచున్నది

రెండు, మూడు, నాలుగు సర్గలు దశరథుఁడు పుత్రులను పొందుటకై పుత్రకామేష్టియాగమును చేయుటవఱకు గల కథ చెప్పఁబడినది.

ఐదు, ఆఱు సర్గలయందు శ్రీరాముఁడు, అతని సోదరులు పుట్టుట, వారు పెరుగుట, రామలక్ష్మణులు విశ్వామిత్రుని యాగమును రక్షించుట, తాటకను సంహరించుట, అహల్యాశాపవిమోచనము వర్ణితములు.

శ్రీరాముఁడు శివునివిల్లు విఱచి సీతను పెండ్లియాడుట, పరశురాముని భంగపఱచుట మున్నగు విషయములు ఏడు, ఎనిమిది సర్గలలో వివరింపఁబడినవి.

తరువాతి రెండుసర్గలు రామపట్టాభిషేక ప్రయత్నములు, కైకేయి కానిపని, సీతాలక్ష్మణసమేతముగా రాముఁడు వనవాసమునకు పోవుట, భరద్వాజాశ్రమ వర్ణనము, చిత్రకూటమునకు రామాదుల ప్రయాణము, భరతుని రాక, అయోధ్యకు మరలుటకు రాముని నిరాకరణము ప్రస్తరించుచున్నవి.

పదునొకండవ సర్గమున విరాధుని మరణము, శూర్పణఖ ముక్కుచెవుల కోఁత, రావణుఁడు సీతను కొనిపోవుట వర్ణింపఁ బడినవి.

సీతాన్వేషణము, హనుమద్దర్శనము, రామసుగ్రీవమైత్రి, వాలివధ, సుగ్రీవపట్టాభిషేకము పండ్రెండవ సర్గమునందలి ప్రధానవిషయములు.

సుగ్రీవసైనికులు సీతాన్వేషణమునకు వెడలుట, హను

మంతుఁడు సీతను చూచుట, ఆ వార్తను అతఁడు రామునకు చెప్పుట మొదలగు విషయములు పదుమూఁడు, పదునాలుగు సర్గములందు వివరింపఁబడినవి.

ఈ గ్రంథముయొక్క ఒక్క తాళపత్రప్రతియందును ఇంతమాత్రమే కలదు. తరువాతి గ్రంథము ఇంతవఱకు ఎచ్చటను ఉపలబ్ధము కాలేదు.

రఘునాథరాయల సంసద్భవనమును గూర్చియు, అతని ప్రజ్ఞాపాండిత్యములను గూర్చియు తన కావ్యమున విపులముగ వర్ణించిన మధురవాణి తనవంశాదికములను గుఱించి ఇసుమంతయు చెప్పినదికాదు. ప్రతీతివలన ఆమె వేశ్యయని తెలియనగుచున్నదే కాని గ్రంథస్థమగు ఆధారము ఏమియు లేదు.

ఆమె ఒకానొక విద్వత్కుటుంబమున పుట్టువునొందినది అను విషయము తక్క ఆమెను గుఱించి ఇతర విషయములు ఏమియు తెలియరావు. ఆమె విద్వత్కుటుంబమున పుట్టినదని క్రిందిశ్లోకము చెప్పుచున్నది:

విద్యాన్వవాయే విహితావతారా
సుశిక్షితా సా విదుషాత్వయైవ
విద్యాపరీక్షా సమయే విశేషాత్
కాళమాన ప్రతిమానుభావా.

విద్వత్కుటుంబమున పుట్టినదనియే కాక యీమెను రఘునాథుఁడే విద్యాశిక్షణ మొనర్చి కవయిత్రిగా చేసెనని కూడ దీనివలన తెలియుచున్నది.

సంస్కృతరామాయణమునందలి ప్రార్థనశ్లోకములను పట్టియు, ఇతర ప్రస్తావనలనుపట్టియు మధురవాణి అద్వైతమత సిద్ధాంతములను అభిమానించునది అని నిర్ధరింపవచ్చును.

మధురవాణి సంస్కృతాంధ్రభాషలయందు అంచిత పాండిత్యమును అలవఱచుకొన్న విదుషి. ఆ భాషల రెండింటి యందును సరసకవిత చెప్పనేర్చిన చతుర; సంగీతవిద్యయందు అనంతకౌశలమును గడించిన కోవిదురాలు.

"చతుర్విధకవిత్వములందును చాతుర్యముకలది. వీణా వాదనమున అరితేరినది. పాణినీయవ్యాకరణమునందు మంచి ప్రజ్ఞ కలది. అనేకవిధములైన అవధానములనుచేసి తన బుద్ధి వైభవమును ప్రకటించినది" అని క్రిందిశ్లోకము మధురవాణి వైదుష్యమును, చాతుర్యమును కీర్తించుచున్నది:

చాతుర్యమేతి కవితాసు చతుర్విధాసు
వీణా కలాప్రకటనే భవతి ప్రవీణా
ప్రజ్ఞామియం నిపుణ ముంచతి పాణినీయే
మేధాం వ్యనక్తి బహుధా వివిధావధానే.

[ప్రథమ సర్గ. 92.]

తాను రచించిన సంస్కృతరామాయణమునందలి ప్రతి సర్గయొక్క అంతమునందు తన ప్రజ్ఞాపాండిత్యములను ప్రస్తావించుచు మధురవాణి శ్లోకములను చేర్చినది. చిత్తగింపుడు:

ఖ్యాత శ్రీరఘునాథ (భూపతి) దయాధారానువారోన్నమ
ద్వీణా వాదన సంస్కృతాంధ్ర కవితా సామ్రాజ్యలక్ష్మీజుషా
దివ్యోద్యత్స్మృతి సఖ్యయా మధురవాణ్యాఖ్యయా నిర్మితే
శ్రీరామాయణ సారకావ్య తిలకే......

(ద్వితీయసర్గ.)

శత్తా ద్యష్టటికార్ధ నిర్మిత శతశ్లోకీఫణిగ్రామణీ
వాణీ ప్రాకృత శాస్త్రనైపుణ సముస్సలద్యశః శ్రీజుషా

(తృతీయ సర్గ.)

ప్రస్తారాళి నవాత్త వృత్త కవితాధాటీ కథా శుక్రియా
షడ్భాషా రచనావిశేష బహుధావిఖ్యాత కీర్తిశ్రియా

(తురీయ సర్గ.)

వీణావాద కళావినోద సమయే ధృత్వా సమస్యాః శతం
సద్యస్సంసది సాధు పూరయతి యాదత్తాః కవీంద్రైస్తయా

(పంచమ సర్గ.)

ప్రఖ్యాతార్జవ యా పదార్థగమక వ్యాఖ్యాన పక్షౌన్నయా
ప్రాగల్భ్యశ్రీ స్వదనైషధ ప్రతివిధా సానంద సూరీన్ద్రియా

(షష్ఠమ సర్గ.)

స్వాద్వీ దుగ్ధసితా సుధామధురవాణ్య శ్రాన్త సన్తోషిత
ప్రౌఢ శ్రీ రఘునాథదత్త శుభవత్స్వార్థాభిధా సంభృతా

(సప్తమ సర్గ.)

సద్యో విస్మయ కృన్నిరోష్ఠ్య కవితా సన్దర్భధారాసుధా
సారోర్మి పరిపూరిత శ్రుతి సుధీ సమ్భావితాభిఖ్యయా

(అష్టమ సర్గ.)

మాధుర్యైక ధురంధరాంధ్ర కవితా నిర్మాణ సమ్మాన్యయా

(నవమ సర్గ.)

సూరిస్తవ్య కుమారసమ్భవ మహాకావ్య ప్రతిగ్రన్థన
ప్రాగల్భ్యశ్రీ ప్రకట శ్రియా పదసదః ప్రఖ్యాతవైదుష్యయా

(దశమ సర్గ.)

ప్రౌఢ శ్రీ రఘునాథ నాయక కృత స్వర్ణాభిషేక శ్రియా

(ఏకాదశ సర్గ.)

అర్థ వ్యక్తవలంబ చమ్పురచనా ధౌరన్ధరీ ధన్యయా...

(చతుర్దశ సర్గ.)

వివిధసర్గాంతములందలి ఈ శ్లోకములందలి విషయము
లను అన్నిటిని సమన్వయించి పిండితార్థముగా మధురవాణి

వైదుష్యమును గుఱించి ఇట్లు చెప్పవచ్చును:

"మధురవాణి సంస్కృతాంధ్రకవితాసామ్రాజ్యలక్ష్మి. పది ఇరువది నిముసములలో నూఱు శ్లోకములను రచియింపఁగలిగి ఉండెను. ప్రాకృతభాషలోను, శాస్త్రములలోను నైపుణిగలది. ఆశుకవిత్వమున, షడ్భాషారచనమున ఆమె చదురాలు. ఆమెను పరీక్షించుటకై ఆస్థానకవీశ్వరులు ఆమె వీణాగానవినోదములందు పర్యాప్తయై ఉండినప్పుడు నూఱేసి సమస్యలు ఇచ్చుచుండెడి వారు. అప్పుడు ఆమె ఇసుమంతయు గజిబిజినొందక సమయస్ఫూర్తి కలిగి వానిని అన్నిఁటిని పూరించుచుండెడిది. విద్వదౌషధమగు నైషధమునకుఁ బ్రతికృతిఁ గల్పించినది. స్వాధ్వియగు ఆమె వాక్కు విని రఘునాథుఁడు శ్రాంతసంతోషియై ఆమెకు బిరుదములు ప్రసాదించినాఁడు. నిరోష్ఠ్యాదినియమములతో కవిత చెప్పఁగలది. ఆంధ్రకవితానిర్మాణము కావించియున్నది. కుమారసంభవమునకు ప్రతిగ్రంథమును రచియించినది. రఘునాథ నాయకునిచే కనకాభిషేకమును అందినది. ధ్వనిప్రధానములైన చంపువులను రచించుటలో ఆమె నేర్పరి ఐ ఉండినది."

అరగడియలో నూఱుశ్లోకములు చెప్పఁగలది అనుటచే ఆమె అద్వితీయకవితాధార తెల్లమగును. వీణాగానవినోదమున పర్యాప్తయై యుండియు నూఱుసమస్యలను పూరింపఁగలుగుచుండెడిదనుటచే ఆమె శతావధానము చేయఁగల విదుషి యని తేలుచున్నది. సమస్యాపూరణము ఆమె అసదృశసమయస్ఫూర్తికి చక్కని నిదర్శనమై ఉండినది.

మధురవాణి ఈ రామాయణమునే కాక నైషధము, కుమారసంభవము అను కావ్యములనుకూడ వ్రాసెనని పై సర్గాంతశ్లోకములవలన తెలియవచ్చుచున్నది. ఈ నైషధమును, కుమారసంభవమును సంస్కృతరచనములు. ఇవికాక

ఆమె ఆంధ్రగ్రంథములుకూడ కొన్ని రచియించి యున్నట్లు సర్గాంతశ్లోకములవలన తెలియుచున్నది. కాని అవి ఏవియు నేఁడు ఉపలబ్ధములు కాకున్నవి.

మధురవాణి సంస్కృతాంధ్రములందును మఱి ఆఱు భాషలయందును రచనాసామర్థ్యము కలిగి రఘునాథభూపాలునిచే స్వర్ణాభిషేకమహాగౌరవమును అందినట్లు పై సర్గాంత శ్లోకములు వెల్లడి చేయుచున్నవి.

తాను రచించిన ఈ రామాయణమును మధురవాణి 'శ్రీ రామాయణసారకావ్యతిలకము' అను నామమున పేర్కొనుచున్నది.

రఘునాథరాయల సభను కూర్చి మధురవాణి రామాయణమునందలి ప్రథమసర్గలో ఇట్లు ప్రస్తావించుచున్నది:

విపంచికాయాం చతురాః ప్రగల్భా
శ్శాస్త్రేఽతిదక్షా స్సరస ప్రబంధే
సమీపమేతస్య సమేత్య కేఽపి
సుభ్రూజనా స్స్వస్వ కలావ్యవృణ్వన్,
[ప్రథమ సర్గ. 78.]

సర్వోత్తర స్స్వాదిమ సంస్కృతాంధ్ర
ప్రబంధ నిర్మాణ పచేళిమాని
యశాంసి భూయాం స్యవతార యస్య
స్సహస్ర శస్సంతి సరోజనేత్రాః.
[ప్రథమ సర్గ. 82.]

విపంచి మీటుటలో నిపుణురాండ్రును, శాస్త్రములను కూలంకషముగ నేర్చినవారును, సరసప్రబంధములు రచియింప సామర్థ్యము కలవారును అయిన స్త్రీరత్నములు వచ్చి రఘునాథరాయల సభలో తమతమ నైపుణ్యమును చూపుచుండెడివారు. రసవత్తర

**ములైన కావ్యములను వ్రాయుటలో పండఁబారిన తమకీర్తిని ప్రకాశింపఁజేయుచు వేలకొలఁది విదుషీరత్నములు ఆ ప్రభువు కొలువుకూటమున నుండెడివారు.**

కథా సంవిధానమున, కళాసందర్భమున మధురవాణి సంస్కృతరామాయణము ఉత్తమకావ్యమై గ్రంథకర్త్రి విశాలవైదుష్యమును ప్రకటించుచున్నది.

'కొందఱు తంజావూరు కవులు-పండితులు' అను గ్రంథమున శ్రీ కురుగంటి సీతారామయ్యగారు మధురవాణి కవిత్వమును గుఱించి ఇట్లు వ్రాయుచున్నారు:

“రఘువంశ కుమారసంభవాదులవలె నీ కావ్యము సరసమైన కవిత్వముకలదై వరలియున్నది. శబ్దములయందలి యవ్యక్తమధురమైన నాదవిశేష మీమెకు బాగుగా తెలియునని యిందలి ప్రతిశ్లోకము చాటుచున్నది. పేశలమృదూక్తుల కీమె కావ్యము పెట్టినది పేరు. భాష యీభాషాసరస్వతికి వశవర్తిని. కల్పనాశక్తి యప్రతిమానము. ఈమెను కాళిదాసాది యుత్తమకావ్యనిర్మాతలలోఁ చేర్పనగును ”

మధురవాణి కవిత్వమునుగూర్చి శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు ధాత మార్గశీర్షపు భారతిలో వ్రాసిన పంక్తులు కూడ ఈ సందర్భమున స్మరింపఁదగియున్నవి:

“పాఠకులు కాలక్రమమున నవ్యుత్పన్నులుగాఁ బుట్టఁబోవుదురని కాఁబోలుఁ గొన్ని శ్లోకములకు మధురవాణి స్వయముగా వ్యాఖ్య రచించె. పాణినీయము చక్కఁగాఁ జదివెనని చెప్పి తదాస్వాదము చూపుటకుఁగాఁబోలు 'రాజనీతిరపస్పశా' యని మాఘుఁడు చెప్పినట్లు ప్రయోగచాతురిఁ జూపును... సంగీతశాస్త్రమర్మములు సూచించునట్లు కుశలవుల గానవై

ఖరి ముప్పదితొమ్మిది శ్లోకములలో వర్ణింపఁబడియె (ఇందలి కొన్నిశ్లోకములకుఁ గవయిత్రియే వ్యాఖ్యయుఁగూర్చె.)... మధురవాణి వర్ణనానైపుణి చూపుచు సాహిత్యజ్ఞానము ప్రకాశింప నిచ్చగలది యగుటచే శ్లేషాదిచిత్రరచనలతో సర్గములు నిండించును. తంజాపురాంధ్రకావ్యములలో నచ్చటచ్చట హాసజనకములగు భావములు నిపుణముగాఁ బొందింపఁబడినట్లు తద్వాసనావాసితయగు నిదియు నట్లె హాస్యరసము సక్రుత్తుగాఁ బోషించును.'

మధురవాణి కవిత్వశైలి, వర్ణనాచమత్కృతి మున్నగునవి తెలియుటకు ఇంతదనుక ఉదాహృతములైన శ్లోకములే చాలును. ఐనను మధురవాణి భావబంధురకవితావైదుష్యమునకు నిదర్శనముగా మఱి నాలుగుశ్లోకములు ఉద్ధృతములగుచున్నవి.

రామప్రవేశ సమయ మిథిలానగర వర్ణనశ్లోకము మధురవాణి రామాయణమున శబ్దాలంకారమునకు మంచి నిదర్శనము:

"వితాన పరిలమ్బితోత్పల వితాన సన్దానితం
వినూతన నికేతనాకలిత కేతనాలంకృతమ్
మృదఙ్గ పటహార్భటీ ముఖరగోపురం తత్పురం
ప్రశస్త మవలోకయన్ ప్రముముదే రఘూణాంపతిః.

ఉత్పల పుష్పముల వరుసలచే ఒప్పుచున్న మేలుకట్లచేతను, క్రొత్తగా భవనములందు ఎత్తఁబడిన పతాకములచేతను, మద్దెల మొదలయిన వాద్యముల శబ్దములచే కూడిన గోపురముల చేతను అలరుచున్న పురమును రాముఁడు మాచి ఆనందించెను.

లంకాద్వీపమున అశోకవనమున సీతను కనుగొని ఆమెకు

రాముని అంగుళీయక మిచ్చుచు హనుమంతుఁడు చెప్పిన మాటలు మధురవాణి రచనమున ఎంతటి భావవ్యంజకము లుగా ఉన్నవో గమనింపుఁడు:

ఆ యాతమత్ర రఘువీరకరావమర్శం
త్యక్త్వేతి రాగభరమాత్మని మాకృథాస్త్వమ్
రత్నాఙ్గులీయక, వితర్క్యయ రత్నగర్భా
గర్భోదయా త్సహజరాగమనూనమేవ.

రత్నాంగుళీయకమా! రామకరస్పర్శసుఖమును వదలి ఇక్కడకు వచ్చితినని చింతింపకుము. రత్నగర్భ గర్భజాతయగు సీత యొక్క సహజానురాగముకూడ అనూనమైనదే.

సీతాసతి ఆ అంగుళ్యాభరణమును పుచ్చుకొని వెలి బుచ్చిన అభిప్రాయమును కవయిత్రి కమనీయముగ ఇట్లు వర్ణించుచున్నది:

భవ్యం విహాయభరతో మణిముద్రికే త్వాం
సామ్రాజ్యపాలనసమంజసతా ప్రకారే
పాదూద్వయం రఘుపతిం ప్రణయాద్యయాచే
కింను స్తవీమ్యహహ తత్కృతిలోపకారమ్.

ఓ రత్నాంగుళీయకమా! సామ్రాజ్యపాలనముకు ఉపయోగించు నిన్నువిడిచి భరతుఁడు శ్రీరాముని పాదుకలను తీసికొనిపోవుట మేలే ఐనది. అతనిచే చేయఁబడిన ఈ ఉపకారము ఎంతని పొగడుదును?

కుకవి దూషణము చేయుచు మధురవాణి వ్రాసిన క్రింది శ్లోకము శ్రవణసుభగములైన పదములపట్ల ఆమెకు కల అభిమానమును వ్యక్తము చేయుచున్నది:

సాహిత్య సద్వర్త్మని సంచరన్తః
సన్తః పురాఽవామగతిం సమేత్య
శబ్దాయమానాన్ శ్రవసో రసహ్యాం
న కాకవీన్ ద్రష్టుమపి క్షమన్తే.

సాహిత్యమార్గమున సంచరించు సత్పురుషులు చెవులకు అసహ్యముగా ధ్వనించు శబ్దములను వ్రాసెడి కుకవులను చూచుటకు కూడ సహింపరు.

మధురవాణి కవితావిమర్శనమును ఇఁకఁ గట్టిపెట్టి ఆమె జాతిత్వవిషయమై కొంత తెలిసికొందము.

1908 ఫిబ్రవరిమాసపు ఇండియన్ రెవ్యూలో శ్రీ యం. టి. నరసింహ అయ్యంగారు మధురవాణి కర్ణాటస్త్రీ అని వ్రాసి ఉన్నారు.

ఇట్లు వ్రాయుటకు వారు చెప్పిన కారణము మిక్కిలి హాస్యాస్పదమైనదిగా ఉన్నది. బెంగుళూరు గ్రంథాలయము లోని మధురవాణి రామాయణప్రతి ఆదిలో మైసూరు ప్రాంతమున దొరకియున్నది కాబట్టి ఆ రామాయణకర్త్రి కర్ణాటాంగన ఐ ఉండునని శ్రీ అయ్యంగారు నిర్ణయించుచున్నారు.

ఈ నిర్ణయము ఎంతమాత్రము నిలువఁజాలదు.

ఏమనిన మధురవాణి కర్ణాటస్త్రీ ఐయుండినచో ఆమెకు కర్ణాటభాషయందుకూడ విశేషపాండిత్యము ఉండి యుండవలయును. కృత్యాదిని కాని, సర్గాంతశ్లోకములందు కాని తాను కర్ణాటభాషలో పండితురాలనని ఆమె ప్రత్యేకము చెప్పుకొని ఉండలేదు. సర్గాంత శ్లోకములందు మధురవాణి తనపాండిత్య విశేషములను బహువిధములుగా చెప్పుకొని ఉన్నది. విశేష

మైన కర్ణాటభాషాపాండిత్యము ఉండుచో ఆమె ఆసంగతికూడ స్పష్టతరముచేసి ఉండును.

తనకు సంస్కృతాంధ్రములందు అంచితపాండిత్యము కలదని ఆమె స్పష్టముగ రామాయణకావ్యమున చెప్పుకొని ఉన్నది. సర్గాంతశ్లోకములలోని 'సంస్కృతాంధ్రకవితాసామ్రాజ్యలక్ష్మ్యా', 'మాధుర్యైకధురంధరాంధ్ర కవితానిర్మాణసమ్మాన్యయా' మున్నగు పదజాలమును ఈ సందర్భమున మనము జ్ఞప్తికి తెచ్చుకొనవలయును.

అసలు ఆమె సంస్కృతరామాయణమునకు మూలము రఘునాథభూపాలుని ఆంధ్రరామాయణముకదా! ఒక గ్రంథమును ఆంధ్రమునుండి సంస్కృతములోనికి పరివర్తించువారికి ఆరెండు భాషలయందును అంచితపాండిత్యము ఉండవలయును.

ఇట్టి సందర్భములో ఆ సంస్కృతాంధ్రపండితురాలు కర్ణాటస్త్రీ అనుట పొసఁగుబాటగు విషయమేనా? ఇంతకును మధురవాణి సంస్కృతరామాయణమునకు కల ఒక్క ప్రతియు తెలుఁగులిపిలో ఉన్నది.

ఈ రామాయణరచనకు కారకుఁడైన రఘునాథరాయలు తంజావూరి ఆంధ్రనాయకరాజు. మధురవాణి రచియించిన గ్రంథము అతని ఆంధ్రరచనమునకు సంస్కృతీకరణము. ఆమెగ్రంథమునకు నేఁడు కల ఒక్క ప్రతియు ఆంధ్రలిపిలో వ్రాయఁబడి ఉన్నది.

ఇన్ని నిదర్శనములు ఉదుటై ఉండఁగా మధురవాణి ఆంధ్రపురంధ్రి కాక కర్ణాటాంగన ఎట్లు కాఁగలదో ఊహించుటకు ఎడములేని విషయము.

మధురవాణి కర్ణాటవరవర్ణిని కాక తెనుఁగు తెలివయే అనుటకు ఉపబలముగా శ్రీ నిడదవోలు వేంకటరావు (ఎం.ఏ) గారు, గ్రంథస్థనిదర్శనమును మఱి ఒకదానిని ఎత్తిచూపు చున్నారు. గమనింపుఁడు:

"మధురవాణి తెలుఁగుకవయిత్రి కావున యచ్చటచ్చట యతిమైత్రి పాటించినది. మంగళశ్లోకములో

లక్ష్మీం దిశేల్లక్ష్మణ పూర్వజన్మా
వీరో రఘూణామ్ విజయం ప్రయచ్ఛేత్
ఆరోగ్యమర్కాభి జనశ్చ దద్యాత్
రతీశ మూర్తే రఘునాథ నేతుః.

ప్రకృతి మధుర కావ్య ప్రౌఢ సందర్భ విద్భి
ర్ద్యువతి జనమణీ భిర్వ్యక్త పార్శ్వద్వయోఽసౌ
అథ సవిధ ముపేతాం సౌహృదా మాహ్వయన్మా
మవని పరిబృఢానా మగ్రణీ రిత్యభాణీత్.

అజహ దలంకృతి క్రమ మనేక రసోల్లసితమ్
సరసపదార్థ సంగతి సమగ్ర గుణానుగుణమ్
రఘురమణ ప్రబంధతిలకం రసికాభిమతమ్
సుదతి విధీయతామితి సుధీరగదీ న్నృపతిః.

ఇట్లే యతులు పాటింపఁబడినవి. పై యుద్ధృతాంశ ములఁబట్టి యీమె యాంధ్రభాషాకవితాపాండిత్యము నూహింపనగును."

యతి ప్రత్యేకము ఆంధ్రకవితాలక్షణము. కర్ణాటకవిత్వమున యతి నిర్బంధము కాదు. 'కన్నడక్కె యతియిల్ల, కోణక్కె మతియిల్ల' అని కన్నడసామెత. కన్నడమునకు యతి లేదు, కోఁతికి మతిలేదు అని ఆ కన్నడ నానుడికి తెనుఁగు

అర్థము. కర్ణాటకవిత్వమున నిర్బంధము కానిది, ఆంధ్రకవిత్వమున ప్రత్యేకలక్షణమైనది అగు యతిమైత్రిలక్షణమును మధురవాణి తాను రచించిన సంస్కృత రామాయణమున పరకపాటుగ పాటించియుండుట ఆమె ఆంధ్రత్వనిరూపణకు అనువగు మఱియొక ఆధారము అగుచున్నది.

మధురవాణి జాతిత్వవిషయమై శ్రీకురుగంటి సీతారామయ్యగారు వ్రాసిన క్రిందిపంక్తులుకూడ ఈ సందర్భమున తడవఁదగి యున్నవి :

“ఈయమ యాంధ్రయువతియో యైయుండును. అప్పుడప్పుడు దక్షిణమునకు వలసవెడలిన యాంధ్రరాజాదులతో కొన్ని వేశ్యాకుటుంబములు వెళ్ళియుండెను. ఇప్పటికి తంజావూరున ననేకాంధ్రవేశ్యాకుటుంబములు కలవు. వీరిలో ననేకులు విదుషీమణులుగా నుండిరి; ఉన్నారు. వీరిలో కొందరు సంగీత నాట్యములయందేగాక యాంధ్రగీర్వాణముల గ్రంథరచన సేయుటయందుకూడ సమర్థలై యుండిరి. . . మధురవాణి యాంధ్రరాజు నాస్థానమునం దుండుటచేతను, నాంధ్రగ్రంథమును భాషాంతరీకరించుటచేతను తప్పక నామె యాంధ్రయువతియే యని చెప్పవలయును ”

ఇక మధురవాణి కాలమునుగూర్చి పరామర్శింతము.

క్రీస్తుశకము 1614-వ సంవత్సరము మొదలు 1630-వ సంవత్సరమువఱకు తంజావూరి రాజ్యమును పరిపాలించిన రఘునాథరాయల ఆస్థానము అలంకరించినది అగుటచే మధురవాణి పదునేడవశతాబ్దియందు ఉండియుండెననుట సునిశ్చయము అగుచున్నది.

మధురవాణిని పోషించిన రఘునాథరాయలు రాజకవి, కవిరాజు, అతని ఆస్థానము కవులకు, పండితులకు కాణాచి. అట్టి రాజువద్ద, అట్టి ఆస్థానమున ఆమె ఉండినది. అట్టి రాజు చేత, అట్టి ఆస్థానమునందు ఆమె కనకాభిషేకము మున్నగు మన్ననలను అందినది.

రఘునాథరాయలు రామభక్తాగ్రేసరుఁడు. అతనికి తలి దండ్రులు రామపర్యాయాభిధానమైన రఘునాథ నామము ఇడిరి. అతఁడు తన కొమరునకు (విజయ) రాఘవ నామము ఉంచినాఁడు. అతఁడు ఆంధ్రమున రామాయణము రచించి నాఁడు. అతఁడు రామసేతు, శ్రీరంగ, విజయరాఘవపుర, కుంభఘోణాది దివ్యస్థలములందు రామభద్రుని ప్రతిష్ఠించి నాఁడు. ఇన్ని విధముల రామసంబంధములు అతని తెనుగు రామాయణమును సంస్కృతమునకు అనువదించుచు కృతాద్యదిని

నిశమ్య దంతాత్మనిభదరిపీఠే
నిషణ్ణ మర్త్యా రఘునాథభూపం
తస్మిన్ జనం పుష్పకమావసంతం
అమన్యతాద్యం రఘునాథ మేవ.

అని అతనికిని, శ్రీరామునకును నొపమ్యమును కలిపించిన మధురవాణి చమత్కృతికి ఆనాఁడు రఘునాథరాయలు ఆత్మ యెంతగా అలరి ఉండునో ఈనాడు మనము ఊహింప నైన లేము.

ఆంధ్రాంగన సంస్కృతభాషా వైదుష్యమునకు అమోఘనిదర్శనమైన మధురవాణి రామాయణమునకు ఉదారులగు ఆంధ్రులు ముద్రణభాగ్యమును కలిగింతురుగాక !

౮

# లకుమాదేవి

ఆంధ్రరమణీమణులలో గంగాదేవి, తిరుమలాంబ, మధురవాణి, రామభద్రాంబ మున్నగువారు సంస్కృతమున గ్రంథములు రచియించియు; మొల్ల, వెంకమ్మ, ముద్దుపళని, సుభద్రమ్మ మున్నగువారు ఆంధ్రమున గ్రంథములు రచియించియు విదుషీత్వమును సంపాదించినారు.

మన ప్రస్తుతకథకు నాయికయైన లకుమాదేవి నాట్యవిద్యయందు అనంతకౌశలమును గడించి విదుషీత్వమును పొందినది.

గణనాతీతకాలమునుండి భారతదేశమున నాట్యము ఒక కళగా పరిగణింపఁబడి రాజాస్థానములందు మిక్కిలి గౌరవింపఁబడుచు వచ్చెను.

అగుట ఉచితజ్ఞులైన ఆంధ్రరాజులు గాంధర్వవిద్యాభిమానులై, గాంధర్వవిద్యాప్రవీణలైన ప్రమదలను ఆదరించి పోషించి ఉన్నారు. ఈ సందర్భమున ఒకటి రెండు నిదర్శనములను పరామర్శింతము.

క్రీస్తుశకము 892 మొదలు 922 వఱకు ముప్పది సంవత్సరములు వేంగీరాజ్యమును పరిపాలించిన చళుక్య భీమభూపాలుఁడు నాట్యవిద్యావేదిని ఐన చల్లవకు భూదానము చేసినట్లు శాసన మొకటి చాటుచున్నది.

క్రీస్తుశకము 1295 మొదలుకొని 1326 వఱకు ముప్పది సంవత్సరములు కాకతీయాంధ్రసామ్రాజ్యమును పరిపాలించిన

వీరప్రతాపరుద్రదేవచక్రవర్తి నర్తకియైన మాచల్దేవిని పోషించి ఉన్నట్లు క్రీడాభిరామము ఘోషించుచున్నది.

చల్లపవలె, మాచల్దేవివలె లకుమాదేవియు నర్తన వైదుష్యమున మిగిలినది; వారివలె ఆమెయు ఒకానొక మహారాజు ప్రాపునందినది.

క్రీస్తుశకము పదునాలుగవశతాబ్దినుండి కొండవీడు రాజధానిగా రెడ్డిరాజులు కొంతకాలము తెలుఁగుదేశమును పరిపాలించిరి. 1383-వ సంవత్సరము మొదలుకొని 1400-వ సంవత్సరము వఱకు రెడ్డిరాజ్యమునకు కుమారగిరి యనువాఁడు పరిపాలకుఁడుగా ఉండెను

కుమారగిరి స్వయము విద్యావంతుఁడు, విశేషించి విద్యాప్రియుఁడు. భోగైకపరాయణుఁడు కూడ. అగుటచే అతఁడు తన రాజ్యపాలనాకాలమున ప్రతివత్సరమును విశాంతవైభవముతో వసంతోత్సవములు ఒనర్చుచువచ్చెను. ఈ కారణమున జనులు అతనిని 'వసంతరాజు' అను నామాంతరమున వ్యవహరించుచు వచ్చిరి.

కుమారగిరికి నాట్యము అభిమానవిద్య. నాట్యవిద్యాభిమాని అగు ఆ ప్రభువతంసము సంస్కృతమున తనపేర 'వసంత రాజీయము' అను నొక నాట్యశాస్త్రగ్రంథమును రచియించెను. ఆ శాస్త్రమునందు తాను వివరించిన నాట్యాంశము లను అభినయింపఁజేసి పరీక్షించుటకై అతఁడు అభినయము నందు పేరుమోసిన వారాంగనలను ఎందఱినో తనకొలువు కూటమున నిలిపి పోషించెను.

కుమారగిరి ఆస్థానమును అలంకరించిన వెల్లాటకత్తెలలో నెల్ల లకుమాదేవి అనుఆమె శిరోమణియై ప్రకాశించెను.

ఆమె అభినయమున అందెవేసినచేయి. అగుటచే లకుమ అనిన కుమారగిరికి వల్లమాలిన అభిమానము కుదిరినది.

వల్లమాలిన అభిమానము కుదురుటచే ఆ నాట్యవిద్యా ప్రియుఁడు నాట్యకళాపారంగతురాలైన ఆ విదుషీమణిని తన ఆస్థానమున నిలిపికొని విశేషముగా సన్మానించినాఁడు. ఆంధ్ర చరిత్రకు తెలిసిన ఆస్థానలాసికలలో లకుమ తలమానికము.

'లకుమాదేవి కుమారగిరి కొలువుకూటమున వివిధము లైన నవనవాభినయములను ప్రదర్శించెను. ఆమె నాట్యకళాభిజ్ఞతకు మెచ్చి ఆ రసికప్రభువు ఆమెకు విశేషధనమును బహుమానము చేసెను. ఆ నాట్యకళాసుందరి ఆ ధనమును స్వార్థమునకు ఉపయోగించుకొనక ఉదారబుద్ధితో బీదజనులకు ధారపోసెను.'

కుమారగిరి ప్రధానమంత్రియు, బావమఱఁదియు అగు కాటయ వేమారెడ్డి తాను రచించిన శాకుంతల వ్యాఖ్యానారంభమున చెప్పిన ఈశ్లోకము పై విషయమును తెలుపుచున్నది:

శ్లో. జయతి మహిమా లోకాతీతః కుమారగిరి ప్రభో
స్సదసి లకుమాదేవీ యస్య శ్రియా సదృశీ ప్రియా
నవమభినయం నాట్యార్థానాం తనోతి సహస్రధా
వితరతి బహూనర్థా నర్థివ్రజాయ సహస్రశః.

## మహావాక్యము :

"పురుషవద్ యోషితోఽపి కవీ భవేయుః
సంస్కారో హ్యాత్మని సమవైతి న స్త్రైణం పౌరుషం వా
విభాగమపేక్షతే, శ్రూయన్తే, దృశ్యన్తేఽపి చ రాజ
పుత్ర్యో మహామాత్రదుహితరో గణికాః కౌతకి
భార్యాశ్చ శాస్త్రప్రహత బుద్ధయః కవయశ్చ."

— రాజశేఖరకవి కావ్యమీమాంస (దశమాధ్యాయము)

పురుషులవలె స్త్రీలును కవులు కావచ్చును. సారస్వత సంస్కారము ఆత్మనిష్ఠ మగునే గాని, అయ్యది స్త్రీపురుష వివక్ష నొనర్పదు. రాజపుత్రికలు- మహామాత్యసుతలు- గణికలు- కౌతుకవంతులగు వారిభార్యలు మున్నగువారు అనేకులు శాస్త్రప్రహత బుద్ధులై, కవులై యుండిరని వినియున్నాము. ప్రస్తుతము ప్రత్యక్షముగాఁ గనుచున్నాము.

— శ్రీ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి గారి అనువాదము.

# కృతజ్ఞత

ఈ గ్రంథరచనమున తోడ్పడిన గ్రంథములు విషయనివేదన సందర్భమున ఆయా తావులయందు కృతజ్ఞతాపూర్వకముగ చేర్కొనబడియే యున్నవి. అవికాక ఈ గ్రంథరచనవిషయమున సంప్రదింపబడిన మఱికొన్ని గ్రంథముల నామములు ఇక్కడ కృతజ్ఞతాపూర్వకముగ చేర్కొనబడుచున్నవి:


1. ఆంధ్రులచరిత్ర మొదటిభాగము- శ్రీ చిలుకూరి వీరభద్రరావు.
2. విదుషీమణులు- (సరస్వతీ నిలయము: బందరు.)
3. Introduction to Madhuravijayam By T A. Gopina-tha Rao M A ('New India' Madras. 1915.)
4. Raghunathabhyudaya of Ramabhadramma By T R. Chintamani - 'University of Madras'.
5 Raghunathabhyudayam - A study by T.A. Gopinatha Rao M.A. Christi n College Magazine 1916-17.
6 Sources of Vijayanagara History - - A. Rangaswami Saraswati.
7. Further Sources of Vijayanagara History - N. Venkata Ramanayya M.A.
8 The Third Dynasty of Vijayanagara - N. Venkata Ramanayya M.A.
9. Madras Epigraphy Annual Report for 1904.
10 Indian Review, Madras. vol ix. (1908)


---


*Printed at Ganesa Press, 11, Venkatachala Mudali St., Purasaw kam. Madras 7.*